


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 258

సోమవారం 9-12-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**'మనీ' మాట.. బంగారు బాట**

చిన్న నాటి నుంచే ఖర్చులు, పొదుపు, ఇన్వెస్టింగ్ నేర్పాలి - బిజినెస్‌లో



**భారత్‌కు భంగపాటు**

రెండో టి20లో విండీస్ చేతిలో 8 వికెట్లతో ఓటమి. - స్పోర్ట్స్‌లో

# ఢిల్లీలో అగ్నిప్రమాదం.. 43 మంది మృతి

# ఊపిరాడక..

## పొగతో ఉక్కిరిబిక్కిరై కార్మికుల మరణం



**నాలుగు అంతస్తుల భవనంలోనే పలు చిన్న పరిశ్రమలు**

**విచారణకు ఢిల్లీ సర్కార్ ఆదేశం**

తెల్లారకముందే 43 మంది ప్రాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఢిల్లీలోని అనాజ్ మండీ ప్రాంతం జనావాసాలతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. చిన్నా చితక పరిశ్రమలున్న నాలుగు అంతస్తుల భవనంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఇలాంటి ప్రమాదాలు తలెత్తితే ముందు జాగ్రత్తకు తగిన భద్రతా ఏర్పాట్లు లేవు. పైగా కార్మికులు నిద్రిస్తున్న గది చాలా చిన్నది. వెంటిలేషన్ సరిగా లేదు. మంటలు త్వరితగతిన వ్యాపించడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగకమ్మేసింది. ఫలితంగా కార్మికులు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. తలుపులకు సమీపంలో నిద్రిస్తున్న వారు మాత్రమే బయటపడగలిగారు. - వివరాలు 4లో



**ఇదీ భవనానికి దారి..**

ఎక్కడ: ఉత్తర ఢిల్లీలోని రాణి ఝాన్సీరోడ్డులో అనాజ్ మండీ ప్రాంతంలోని భవనం.

కారణం: షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణం. అంతే కాదు ఈ భవనంలో అగ్నిప్రమాదం తలెత్తితే ముందు జాగ్రత్తకు తగిన భద్రతా ఏర్పాట్లు లేవు.

**ఇరుకు సందు..**

30 అగ్నిమాపక శకటాలొచ్చాయి.. వీటితో 150 మంది సిబ్బంది వచ్చారు. అంబులెన్సులు కూడా వచ్చాయి. కానీ, జనావాసాల మధ్య, ఇరుకు సందుల్లోంచి ఘటనా స్థలానికి చేరుకోవడానికే సిబ్బంది తంటాలు పడాల్సి వచ్చింది.






**రియల్ హీరో..**

ప్రమాద స్థలికి వెళ్లిన అగ్నిమాపక సిబ్బందిలో రాజేశ్ శుక్లా మంటలు చుట్టుముడుతున్నా లోపలికి వెళ్లి 11మంది ప్రాణాలు కాపాడాడు. ఆ సమయంలో శుక్లా కాళ్లకి తీవ్ర గాయాలవడంతో ఆయనని ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించారు. ఢిల్లీ హోం మంత్రి సత్యేంద్ర జైన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజేశ్ శుక్లాను పరామర్శించారు. రియల్ హీరో అని కొనియాడారు.

# ఇక వజ్ర బస్సులుండవ్!




- కనుమరుగు కానున్న ఏసీ మినీ బస్సులు
- రెండున్నరేళ్లకే సర్వీసు ఉపసంహరణ
- సీట్లు తొలగించి సరుకు రవాణా విభాగానికి..
- 1,200 బస్సులతో ప్రత్యేకంగా గూడ్స్ విభాగం
- నష్టాలు పెరుగుతుండటంతో ఈ నిర్ణయం

- వివరాలు 14లో

## అసలేం జరిగింది?

- దిశ హత్యాచారం, ఎన్‌కౌంటర్‌పై వివరాలు సేకరించిన ఎన్‌హెచ్‌ఆర్సీ
- అన్యాయంగా కాల్చి చంపారు: ఎన్‌కౌంటర్ మృతుల తల్లిదండ్రులు
- హత్యాచారం గురించే అడిగారు: దిశ కుటుంబసభ్యులు



-2లో

## ఏ తుపాకీతో కాల్చారు?

- దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం విచారణ ముమ్మరం
- మృతుల శరీరాల్లో బుల్లెట్లు లేకపోవడంపై ఆరా
- ఇద్దరు ఫైర్ చేస్తే నలుగురిని ఎందుకు షూట్ చేశారు?
- కీలకం కానున్న ఫోరెన్సిక్ బాలిస్టిక్ నివేదిక..
- ఎన్‌కౌంటర్‌పై పోలీసులు సీన్ రీ కన్‌స్ట్రక్షన్

# మా బిడ్డలూ ఆడబిడ్డలే కదా..

**మీడియా భేటీలో బాధిత కుటుంబ సభ్యుల ప్రశ్న**

- ప్రభుత్వం చంపకపోతే నేనే చంపుతా: టేకు లక్ష్మి భర్త గోపి
- మాపై వివక్ష చూపుతున్నారా?: మానస తల్లి
- దళితుడిని కదా.. ఎవరూ అడగరని వారి ధైర్యం: శైలజ తండ్రి వెంకట్
- మా బిడ్డలు చనిపోయి 8 నెలలు: హాజీపూర్ బాధితులు

"దిశ'కు జరిగిన అన్యాయాన్ని మేం కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. నిందితులకు వారం రోజుల్లోనే శిక్ష విధించారు. మరి మా బిడ్డలు కూడా ఆడబిడ్డలే కదా.. ఎందుకు చర్యలు తీసుకోవడంలేదు. మా బిడ్డలను అతి క్రూరంగా చంపిన వారికి శిక్ష విధించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారు

5లో



**మహిళల భద్రతలో పోలీసులే కీలకం**

- డీజీపీ, ఐజీపీల జాతీయ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ
- అవసరాల మేరకు చట్టాల్లో మార్పులు: హోం మంత్రి - 4లో



**కాళేశ్వరం నీరు... కృష్ణాబేసిన్‌కు చేరు**

- బస్వాపూర్ నుంచి సాగర్ ఒడికి జలం
- సమగ్ర అధ్యయనం చేయాలని రిటైర్డ్ ఇంజనీర్లకు సీఎం కేసీఆర్ ఆదేశం - 14లో

**నేడు లోక్‌సభకు పౌరసత్వ బిల్లు**

**నేడు కర్ణాటక ఉప ఎన్నిక ఫలితాలు**

**ఐఐటీల్లో పెరుగుతున్న ఆత్మహత్యలు**

- వివరాలు 4లో
















# పట్టుకున్న చెయ్యే పేల్చిందా..?



## ఎన్‌కౌంటర్‌లో కీలకంకానున్న జీఎస్సార్ నివేదిక

**సాక్షి, హైదరాబాద్:** 'కీలక ఆధారాల సేకరణ కోసం నలుగురినీ తీసుకువెళ్లాం. తప్పించుకునే ప్రయత్నం చేసిన నిందితులు పోలీసుల వద్ద తుపాకులు లాక్కుని కాల్పులు జరిపారు. ఆత్మరక్షణ కోసం జరిపిన ఎదురు కాల్పుల్లో వారు చనిపోయారు'

ఇది 'దిశ'కేసులో నిందితుల ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పోలీసులు చెబుతున్న మాట. అయితే ఈ వ్యవహారంలో గన్ షాట్ రెసిడ్యూ (జీఎస్సార్) విధానం అత్యంత కీలకంగా మారనుంది. ప్రాథమిక ఆధారాలు, ఇతర అంశాలను బట్టి పోలీసులు చెప్పింది నిజమేనని కనిపిస్తున్నా.. సాంకేతికంగా నిరూపించడంతోపాటు పోలీసులపై ఉన్న అనుమానాలు పూర్తిగా నివృత్తి కావడానికి ఎన్‌కౌంటర్ కేసులో జీఎస్సార్ నివేదికలే కీలకంగా మారనున్నాయి.

### రెండుగా బుల్లెట్..

**తు**పాకీలో ఉండే తూటా పైకి ఒకటిలానే కనిపించినా.. అందులో రెండు భాగాలుంటాయి. పేల్చిన వెంటనే దూసుకుపోయే ముందు భాగమైన బుల్లెట్ ఒకటి కాగా.. అలా దూసుకుపోవడానికి అవసరమైన శక్తిని అందించే క్యాట్రిడ్జ్ (బుల్లెట్ కేస్) మరొకటి. రివాల్వర్ విషయానికి వస్తే సిలిండర్‌లో లోడ్ అయి ఉండే తూటాను కాల్చాలని భావించిన వ్యక్తి తన చూపుడు వేలితో ట్రిగ్గర్‌ను నొక్కుతాడు. ఆ వెంటనే తుపాకీపైన వెనుక భాగంలో ఉండే హేమర్ తూటా వెనుక భాగంలో మధ్యలో ఉండే ప్రైమర్‌ను హిట్ చేస్తుంది. దీంతో బుల్లెట్ కేస్‌లో ఉండే ప్రొపెల్లెంట్‌గా పిలిచే గన్ పౌడర్ మండుతుంది. ఫలితంగా ఉత్పన్నమయ్యే శక్తి బుల్లెట్‌ను ముందుకు దూసుకుపోయేలా చేస్తుంది. ఇలా కాల్చిన తర్వాత మిగిలే ఎమ్టీ క్యాట్రిడ్జ్ రివాల్వర్ సిలిండర్‌లోనే ఉండిపోతుంది. పిస్టల్ విషయానికి వస్తే కుడివైపు పైభాగాన ఉండే ప్రత్యేక అర నుంచి బయటకు పడిపోతుంది.

### జీఎస్సార్ అంటే..

**తూ**టాను కాల్చినప్పుడు హేమర్ ధాటికి ప్రైమర్ ప్రేరేపితమై బుల్లెట్ కేస్‌లో ఉండే గన్ పౌడర్‌ను మండిస్తుంది. అత్యంత స్వల్ప వ్యవధిలోనే ముందు భాగంలో ఉండే బుల్లెట్ దూసుకుపోవడంతో గన్ పౌడర్ పూర్తిగా కాలిపోదు. బుల్లెట్ కేస్ నుంచి స్వల్ప మొత్తంలో బయటకు చిమ్ముతుంది. అది ఆ తుపాకీని కాల్చిన వ్యక్తి చేతి బొటన వేలు, చూపుడు వేళ్ల మధ్య భాగంలో పడుతుంది. దీన్నే సాంకేతిక పరిభాషలో జీఎస్సార్ అంటారు. కంటికి కనిపించని ఈ జీఎస్సార్‌ను స్వాబ్స్ ద్వారా సేకరించి ఫోరెన్సిక్ పరీక్షలకు పంపిస్తారు. ఫలానా తుపాకీని, ఫలానా వ్యక్తే ఫైర్ చేశారు అని అధికారికంగా, సాంకేతికంగా నిర్ధారించడానికి ఈ జీఎస్సార్ నివేదికలు ఎంతో కీలకం. వేరే వ్యక్తులు ఎవరైనా సదరు ఆయుధాన్ని వినియోగించి ఓ వ్యక్తిని హత్య చేసి, ఆపై తుపాకీని చనిపోయిన వ్యక్తి చేతుల్లో పెట్టే అవకాశాలు ఉంటాయి. ఇలాంటప్పుడు చనిపోయిన వ్యక్తి చేతి వేళ్లపైన జీఎస్సార్ కనిపించదు.




### ఇలా కీలకం..

**ది**శ కేసులో నిందితులుగా ఉన్న నలుగురిలో ప్రధాన నిందితుడు ఆరిఫ్‌తోపాటు నాలుగో నిందితుడు చెన్నకేశవులు పోలీసులపై దాడికి దిగారు. అధికారుల వద్ద ఉన్న సర్వీస్ తుపాకులైన పిస్టల్స్ లాక్కుని ఇద్దరూ కాల్పులు జరిపారన్నది పోలీసులు చెబుతున్న అంశం. ఈ నేపథ్యంలో ఎన్‌కౌంటర్ స్థలికి వెళ్లిన క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ నిపుణులు ఆ ఇద్దరి కుడి చేతి బొటన, చూపుడు వేళ్ల మధ్య నుంచి నమూనాలు సేకరించారు. వీటిని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి పంపిన అధికారులు.. ఆ నివేదికల ఆధారంగా నిందితులు కాల్పులు జరిపినట్లు నిర్ధారించనున్నారు. 'ఆ తుపాకులపై ఉన్న నిందితుల వేలిముద్రల్ని బట్టి వాళ్లు వాటిని పట్టుకున్నారని మాత్రమే చెప్పగలం. జీఎస్సార్ నివేదికల ఆధారంగానే ఆ తుపాకీని వాళ్లే కాల్చారా? లేదా? అనేది తేల్చగలం'అని ఫోరెన్సిక్ విభాగానికి చెందిన ఓ ఉన్నతాధికారి 'సాక్షి'కి తెలిపారు.

## మగబిడ్డలకు మర్యాద నేర్పుదాం

- తల్లిదండ్రులకు తమిళిసై పిలుపు
- దిశ ఘటనపై గవర్నర్ ఉద్వేగం



**సాక్షి, చెన్నై:** మహిళల్ని ఏవిధంగా గౌరవించాలి, ఎలా మర్యాద ఇవ్వాలి..అన్న విషయాల్ని మగ బిడ్డలకు చిన్నతనం నుంచే నేర్పుదామని తల్లిదండ్రులకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. 'మొగ్గల్ని తుంచేయవద్దు.. పువ్వుల్ని నలిపేయొద్దు'అంటూ దిశ ఘటనను గుర్తు చేసుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. తమిళనాడు వాణిబర్ పేరవై నేతృత్వంలో చెన్నైలోని కోయంబేడులో ఆదివారం ఓ కార్యక్రమం జరిగింది. ఇందులో తమిళిసై ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో మహిళలకు వ్యతిరేకంగా హింసాత్మక ఘటనలు పెరుగుతుండటం వేదన కలిగిస్తున్నదన్నారు. దేశంలో ప్రతి రోజూ ఏదో ఒక చోట లైంగిక దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా, వారిపై హింస మాత్రం తగ్గకపోవడం మనోవేదనకు గురి చేస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో దిశ ఘటనను గుర్తు చేస్తూ, ఆమె ఉద్వేగానికి లోనయ్యారు.

## ఎన్‌కౌంటర్‌ను సమర్థించం

- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టీకరణ



**సాక్షి, హైదరాబాద్:** దిశ కేసు నిందితుల ఎన్‌కౌంటర్‌ను సీపీఐ సమర్థించదని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టం చేశారు. ఎన్‌కౌంటర్లు చట్టవిరుద్ధమని, ఆమోదయోగ్యం కాదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మఖ్దూం భవన్‌లో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి, ఏపీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో కలిసి డి.రాజా మాట్లాడారు. అయోధ్య తీర్పులో వైరుధ్యాలున్నాయని, వాస్తవాల ఆధారంగా కాకుండా విశ్వాసాల ఆధారంగా ఈ తీర్పు వచ్చిందన్నారు. జనవరి 8న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు, రైతు, వ్యవసాయ కూలీ సంఘాలు తలపెట్టిన గ్రామీణ బంద్‌కు సీపీఐ మద్దతిస్తుందని, అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

**నారాయణ క్షమాపణలు**

దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై తాను చేసిన వ్యాఖ్యల పట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ క్షమాపణలు తెలిపారు. పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో పలువురు పార్టీ నేతలు ఈ వ్యాఖ్యలను తప్పుబట్టడంతో పార్టీకి, ప్రజలకు నారాయణ బహిరంగ క్షమాపణలు తెలియజేశారు. పార్టీ విధానాలకు భిన్నంగా తన వ్యాఖ్యలుండడంతో క్షమాపణలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌ను సీపీఐ సమర్థిస్తుందని ఆయన వ్యాఖ్యానించడంతో పార్టీతో పాటు ప్రజాసంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొవాల్సి వచ్చింది.

# అసలేం జరిగింది?

## దిశ హత్యాచారం, నిందితుల ఎన్‌కౌంటర్‌పై ఎన్‌హెచ్‌ఆర్సీ వివరాల సేకరణ

- అన్యాయంగా కాల్చి చంపారు: ఎన్‌కౌంటర్ మృతుల తల్లిదండ్రులు
- దిశ హత్యాచారం గురించే అడిగారు: దిశ కుటుంబసభ్యులు
- నేడు నిందితుల మృతదేహాల అప్పగింతపై స్పష్టత..
- మరో రెండ్రోజుల పాటు ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం విచారణ



పోలీస్ వాహనంలో అకాడమీలోకి వెళ్తున్న ఎన్‌కౌంటర్ మృతుల కుటుంబ సభ్యులు

**రాజేంద్రనగర్:** చటాన్‌పల్లి వద్ద జరిగిన ఎన్‌కౌంటర్ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) ప్రతినిధుల బృందం దిశ కుటుంబ సభ్యులు, ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన నిందితుల కుటుంబ సభ్యుల వాంగ్మూలం తీసుకోవడంతో పాటు వివరాలు సేకరించింది. 'తప్పు చేసిన మా బిడ్డలను శిక్షించమనే చెప్పాం. మా బిడ్డలను అన్యాయంగా కాల్చి చంపారు..'అంటూ ఎన్‌కౌంటర్ మృతుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటు హత్యాచార ఘటన గురించి దిశ తండ్రితో పాటు సోదరిని ఎన్‌హెచ్‌ఆర్సీ సభ్యులు అడిగి తెలుసున్నారు. ఆదివారం హిమాయత్‌సాగర్‌లోని రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో వీరందరి నుంచి ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. సాయంత్రం 5.40 గంటల సమయం ప్రత్యేక వాహనంలో పోలీసులు దిశ తండ్రితో పాటు సోదరిని పోలీస్ అకాడమీకి తీసుకొచ్చారు. అంతకుముందు ఉదయం మూడు వాహనాల్లో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన నిందితుల కుటుంబ సభ్యులను తీసుకొచ్చి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు.

### మాకు న్యాయం చేయండి..

**నారాయణపేట/మక్తల్:** 'కోర్టు తీర్పు రాకముందే మా బిడ్డలను అన్యాయంగా ఎన్‌కౌంటర్ చేశారు. మాకు న్యాయం చేయండి'అంటూ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన నలుగురి కుటుంబీకులు ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం ముందు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు గుట్టుచప్పుడు కాకుండా పోలీసు ప్రత్యేక బృందం మహ్మద్ పాషా తండ్రి ఆరిఫ్ హుస్సేన్, నవీన్ తల్లి లక్ష్మి, శివ తండ్రి రాజప్ప, చెన్నకేశవులు తండ్రి కుర్మన్నలను ప్రత్యేక వాహనంలో బందోబస్తు మధ్య హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం సభ్యుల వద్దకు తీసుకెళ్లారు. తిరిగి రాత్రి 8 గంటలకు వారి ఇళ్ల వద్ద వదిలేశారు. అయితే నిందితుల తల్లిదండ్రులతో ఒకరి తర్వాత ఒకరితో ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం సభ్యులు 2 గంటల పాటు మాట్లాడినట్లు తెలుస్తోంది. మీ పిల్లల ప్రవర్తన ఎలా ఉండేది.. ఎందుకిలా ప్రవర్తించారు.. ఇంటి నుంచి ఎప్పుడెళ్లారు.. సంఘటనలో పోలీసులు వారిని ఎప్పుడు తీసుకెళ్లారు.. ఆ తర్వాతేం జరిగింది.. పోలీసుల ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మీ బిడ్డలపై మీరు ఏమనుకుంటున్నారు..?'అని ఎన్‌హెచ్‌ఆర్సీ సభ్యులు ప్రశ్నించినట్లు తెలిసింది.

### అదే చివరి చూపైంది..

'పోయిన శుక్రవారం ఉదయం 3.30 గంటలకు మా బిడ్డలను లారీ ఓనర్ శ్రీనివాస్‌రెడ్డితో వచ్చి పోలీసులు తీసుకెళ్లారు. ఎందుకు తీసుకెళ్తున్నారని మా బిడ్డలను అడిగితే ఓ అమ్మాయి బైక్ అడ్డు రావడంతో యాక్సిడెంట్‌లో చనిపోయిందని.. అందుకే తీసుకెళ్తున్నాం అని చెప్పారు. ఆ రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు ఓ ఆడపిల్లను పెట్రోల్ పోసి అంటించి చంపింది మీ పిల్లలనే అని పక్కన వారు వచ్చి చెబితేనే తెలిసింది. ఆ తర్వాత రోజు పోలీసులు షాద్‌నగర్‌కు పిలిపించి సంతకాలు పెట్టించుకున్నారు. అంతే అదే చివరిగా మా పిల్లలను చూడడం.. మాట్లాడటం. ఆ తర్వాత టోల్ గేట్ వద్ద వచ్చి విడిచిపెట్టిపోయారు. సరిగ్గా వారం తర్వాత శుక్రవారం రోజు ఉదయం 7 గంటలకు మా బిడ్డలను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారని తెలిసింది. తప్పు చేస్తే శిక్షించమనే చెప్పాం. కానీ ఇలా చేస్తారని అనుకోలేదు'అని మృతుల తల్లిదండ్రులు ఎన్‌హెచ్‌ఆర్సీ సభ్యులకు చెప్పినట్లు తెలిసింది. చెన్నకేశవులు భార్య గర్భిణిగా ఉందని, ఆమెకు న్యాయం చేయాలంటూ చెన్నకేశవులు తండ్రి కుర్మన్న వారిని వేడుకున్నట్లు తెలుస్తోంది.

### మృతదేహాలను ఎప్పుడిస్తారు సారూ?

తమ పిల్లల మృతదేహాలను ఎప్పుడిస్తారంటూ ఎన్‌హెచ్‌ఆర్సీ సభ్యులను తల్లిదండ్రులు అడిగినట్లు తెలుస్తోంది. 'సోమవారం హైకోర్టు తీర్పు ఉంది.. ఆ తర్వాత మేము మీకు సమాచారమిస్తాం.. మీ పిల్లల మృతదేహాలు భద్రంగా ఉన్నాయి. ఎప్పుడిస్తామనేది సోమవారం తెలుస్తుంది'.. అని సముదాయించినట్లు సమాచారం.



### ఎన్‌కౌంటర్ గురించి ఏమీ అడగలేదు..: దిశ కుటుంబీకులు

దిశ హత్యాచారం ఘటన రోజు వివరాలను మాత్రమే ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం అడిగి తెలుసుకుందని ఆమె తండ్రి, సోదరి వెల్లడించారు. విచారణ అనంతరం పోలీస్ అకాడమీ నుంచి బయటకు వచ్చిన వారిని మీడియా ప్రశ్నించగా.. కేవలం సంఘటన జరిగిన రోజు తమకు ఎలా తెలిసిందో వివరాలను అడిగి తెలుసుకున్నారని చెప్పారు. ఎన్‌కౌంటర్‌పై ఎలాంటి ప్రశ్నలు అడగలేదని స్పష్టం చేశారు.

### ఆ పోలీసులను విచారించిన ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం..

**సాక్షి, హైదరాబాద్:** మరో రెండ్రోజులు ఎన్‌హెచ్‌ఆర్సీ బృంద సభ్యులు హైదరాబాద్‌లోనే ఉండనున్నారు. ఇప్పటికే ఘటనపై నివేదిక ఇవ్వాలని సైబరాబాద్ పోలీసులను ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం ఆదేశించిన నేపథ్యంలో వారు ఫోరెన్సిక్, రెవెన్యూ రిపోర్టులతో కలిపి ఓ నివేదికను తయారుచేస్తున్నారు. నవంబర్ 27 దిశ కిడ్నాప్, లైంగికదాడి, హత్య, దహనం నుంచి డిసెంబర్ 6న ఎన్‌కౌంటర్ వరకు జరిగిన అన్ని విషయాలపై పక్కాగా నివేదిక రూపొందిస్తున్నారు. సోమవారం సాయంత్రానికి ఎన్‌హెచ్‌ఆర్సీ బృందానికి నివేదిక ఇచ్చే పనిలో తలమునకలయ్యారు. ఆదివారం ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం ఎన్‌కౌంటర్‌లో గాయపడి గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులను విచారించింది. ఇక నేడు లేదా రేపు మిగిలిన పోలీసులనూ విచారిస్తారని సమాచారం.



### గుంతల పూడ్చివేత..

ఎన్‌కౌంటర్ మృతుల అంత్యక్రియల కోసం జక్లేర్, గుడిగండ్ల గ్రామాల్లో తవ్విన గుంతల్లో ఆదివారం టెంకాయలు వేసి పూడ్చేశారు. మృతదేహాలు వచ్చిన తర్వాత వాటిలో ఉన్న మట్టిని తొలగించి అంత్యక్రియలు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

# ఏ తుపాకీతో కాల్చారు?

- దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం విచారణ ముమ్మరం
- మృతుల శరీరాల్లో బుల్లెట్లు లేకపోవడంపై ఆరా..

**సాక్షి, హైదరాబాద్:** దిశ నిందితుల ఎన్‌కౌంటర్ విషయంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) సభ్యుల బృందం విచారణ ముమ్మరం చేసింది. ఇప్పటికే ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన ఆ బృందం పోలీసులను పలు వివరాలు అడిగి తెలుసుకుంది. తొలుత దిశను దహనం చేసిన ప్రాంతం నుంచి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం వరకు పరిశీలించారు. ఇంతదూరం నిందితులు ఎలా వచ్చారు? అంతా ఒకే దగ్గర ఎలా పడిపోయారు? నిందితుల శరీరంలో ఎలాంటి బుల్లెట్లు లేకపోవడంపై సభ్యులు దృష్టిసారించినట్లు సమాచారం. నిందితులు ఆరిఫ్, చెన్నకేశవులు, శివ, నవీన్‌లను పోలీసులు ఏ రకం తుపాకీతో కాల్చారు? పిస్టల్స్‌తోనా.. పెద్ద గన్స్ వాడారా? పోలీసులు జరిపిన ఫైరింగ్‌లో ఎంతమంది పాల్గొన్నారు? ఇద్దరు నిందితులు తొలుత ఫైర్ ఓపెన్ చేస్తే.. పోలీసులు నలుగురిని ఎందుకు కాల్చాల్సి వచ్చింది? అన్న విషయాలపై ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం ఆరా తీస్తున్నట్లు సమాచారం. అయితే మృతుల శరీరంలో బుల్లెట్లు లేకపోవడంపై ఓ పోలీసు ఉన్నతాధికారి స్పందిస్తూ.. ఎన్‌కౌంటర్‌లో శరీరంలో నుంచి తూటాలు దూసుకుపోవడం సాధారణ విషయమేనని తెలిపారు. ఎముకలు, పక్కటెముకలకు తగిలినపుడు తూటాల దిశ మారుతుందని, మెత్తని శరీరభాగాలకు తగిలినప్పుడు ఇలా బయటికి వస్తుంటాయని వివరించారు.

### ముగ్గుర్ని తూర్పువైపు నుంచి..

ఎన్‌కౌంటర్‌లో నిందితులపై పోలీసులు ఎక్కుపెట్టిన తుపాకులు ఏ రకానికి చెందినవి అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ పోలీసుల వద్ద 9 ఎంఎం పిస్టల్, ఎస్ఎల్ఆర్ (సెల్ఫ్ లోడింగ్ రైఫిల్) ఉంటాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. నిందితులను పోలీసులు ఎస్ఎల్ఆర్ తుపాకులతోనే కాల్చారు. ఈ ఘటనలో చటాన్‌పల్లి బ్రిడ్జి నుంచి పారిపోతున్న నిందితులను లొంగిపొమ్మని హెచ్చరిస్తూ.. వెంబడించిన పోలీసులు రెండువైపులా చుట్టుముట్టారు. అయినా నిందితులు కాల్పులు ఆపకపోవడంతో పోలీసులు కూడా ఎదురుకాల్పులు జరిపారు. ఆరిఫ్, శివ, నవీన్ ముగ్గురిని పోలీసులు తూర్పు వైపు నుంచి కాల్చారు. అందుకే, వారి తలలు పడమర వైపు వాలి ఉన్నాయి. అంటే పోలీసుల తూటాలు వారికి ఎదురుగా వచ్చి తగిలినట్లు తెలుస్తోంది. ఇక చెన్నకేశవులుకు మాత్రం బుల్లెట్లు వెనక నుంచి వచ్చి తగిలినట్లుగా అతని శరీరం పడి ఉన్న తీరు చెబుతోంది. అందుకే, ఇతని ఒక్కడి తల మాత్రం తూర్పు వైపు వాలి ఉంది.

### గాయం ఆధారంగా చెప్పొచ్చు..!

నిందితుల పోస్టుమార్టం నివేదిక ఆధారంగా ఫోరెన్సిక్ నిపుణులు ఏ తుపాకీతో కాల్చింది చెప్పగలరు. తూటా గాయం ఆధారంగా చేసుకుని, శరీరాన్ని తగిలిన చోట, వెలుపలికి వచ్చిన ప్రాంతంలో ఏమేరకు గాయం చేసింది అన్న విషయాలను ఆధారంగా చేసుకుంటారు. సాధారణంగా ఏ బుల్లెటయినా శరీరాన్ని తగిలిన చోట మామూలు వ్యాసార్థంలో.. వెలుపలికి వచ్చినపుడు అందుకు రెట్టింపు వ్యాసార్థంలో గాయాలను ఏర్పరుస్తాయి. అదే సమయంలో గాయంపై ఉన్న గన్‌పౌడర్ రెసిడ్యూ (జీపీఆర్) ఆధారంగా చెప్పగలరు. గాయం తగిలిన విధానాన్ని బట్టి, అది ఏ దిశ నుంచి దూసుకొచ్చింది.. ఎంత దూరం నుంచి వచ్చింది.. కచ్చితంగా చెప్పే పరిజ్ఞానం మన ఫోరెన్సిక్ నిపుణుల వద్ద ఉంది. వీరిని ఫోరెన్సిక్ బాలిస్టిక్ ప్రొఫెసర్లు అని పిలుస్తారు. ఈ ఎన్‌కౌంటర్‌లో వీరు ఇచ్చే నివేదిక కీలకం కానుంది.



ఘటనా స్థలం వద్ద గుమికూడిన జనం

### ఘటనాస్థలి వద్ద బందోబస్తు..

ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం వద్ద పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. రాజేంద్రనగర్ ఏసీపీ చక్రవర్తి ఆధ్వర్యంలో సుమారు 59 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. కాగా దిశను దహనం చేసిన చోటు, హంతకులను ఎన్‌కౌంటర్ చేసిన ప్రదేశాన్ని చూసేందుకు జనం పెద్ద ఎత్తున వస్తున్నారు. అయితే పోలీసులు ఎన్‌కౌంటర్ ఘటనా స్థలానికి వెళ్లనీయకుండా జాతీయ రహదారి వద్దనే కట్టడి చేస్తున్నారు.

### 'ఎన్‌కౌంటర్'పై సీన్ రీకన్‌స్ట్రక్షన్

**షాద్‌నగర్ టౌన్:** దిశ హత్య కేసు నిందితుల ఎన్‌కౌంటర్ ఘటనపై ఆదివారం ఉదయం చటాన్‌పల్లి వద్ద పోలీసులు సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. ఘటనా స్థలాలను ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం సభ్యులు ఇప్పటికే పరిశీలించారు. మరోమారు ఈ బృందం ఘటనా స్థలానికి వచ్చి ఎన్‌కౌంటర్ గురించి అడిగితే చూపించడానికి పోలీసులు ఆదివారం సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. హంతకులు పోలీసులపై ఏవిధంగా తిరగబడ్డారు.. ఏవిధంగా రాళ్లు, కట్టెలతో దాడికి పాల్పడ్డారు.. ఏవిధంగా పోలీసులు, హంతకులపై కాల్పులు జరిగాయన్న వాటిపై పోలీసులు సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. దీనిని శంషాబాద్ డీసీపీ ప్రకాశ్‌రెడ్డి పర్యవేక్షించారు. అయితే, ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం మళ్లీ సంఘటనా స్థలానికి వస్తుందా.. లేదా అన్న విషయంపై స్పష్టత లేదు.

## పాలమూరు మెడికల్ కాలేజీలో మృతదేహాలు

- తరలింపు వీడియోల వైరల్‌పై ఇద్దరు సీఐలకు మెమోలు

**మహబూబ్‌నగర్ క్రైం:** 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్ కేసు జిల్లా పోలీసులకు తలనొప్పిగా మారింది. నిందితులు ఇదే ప్రాంతానికి చెందిన వారు కావడంతో పాటు ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత నాలుగు మృతదేహాలకు మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వ హించారు. ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం శనివారం మృతదేహాలను పరిశీలించడంతోపాటు సమగ్ర విచారణ జరిపింది. కాగా జనరల్ ఆస్పత్రి నుంచి ఎన్‌హెచ్‌ఆర్సీ సభ్యులు వెళ్లిన తర్వాత శనివారం రాత్రి హైడ్రామా నడిచింది. స్థానిక ఆస్పత్రి పోస్టుమార్టం విభాగంలోనే మృతదేహాలుంటే శాంతిభద్రతల సమస్యలు వస్తాయనే ఉద్దేశంతో పోలీసులు రాత్రి 11.30 గంటల ప్రాంతంలో అక్కడి నుంచి డీసీఎంలో ఎదిర శివారులో ఉన్న పాలమూరు మెడికల్ కళాశాలకు తరలించారు. తరలింపు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఇద్దరు సీఐలకు చార్జ్ మెమోలిచ్చినట్లు తెలిసింది.

## మహేశ్ భగవత్ నేతృత్వంలో సిట్

'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్ కేసు విచారణకు..

**సాక్షి, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'దిశ'నిందితుల ఎన్‌కౌంటర్ కేసుపై విచారణకు ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుచేసింది. ఏడుగురు సభ్యుల ఈ విచారణ బృందానికి రాచకొండ సీపీ మహేశ్ భగవత్ నేతృత్వం వహించనున్నారు. వనపర్తి ఎస్పీ అపూర్వరావు, మంచిర్యాల డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, రాచకొండ అడిషనల్ డీసీపీ సురేందర్‌రెడ్డి, సంగారెడ్డి డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, రాచకొండ ఐటీ సెల్‌కు చెందిన శ్రీధర్‌రెడ్డి, కోరుట్ల సీఐ రాజశేఖర్ రాజు, సంగారెడ్డి డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డిలు ఈ సిట్‌లో సభ్యులుగా ఉన్నారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం.. ప్రభుత్వం ఈ సిట్‌ను ఏర్పాటు చేసింది. చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్ జరిగిన తీరు, దానికి దారి తీసిన పరిస్థితులపై సిట్ దర్యాప్తు చేసి కోర్టుకు నివేదిక సమర్పించనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదివారం ఆదేశాలు జారీ చేశారు.

# పక్కాగా జీరో ఎఫ్‌ఐఆర్ అమలు

- ఇప్పటికే డీజీపీ మౌఖిక ఆదేశాలు.. త్వరలో ఉత్తర్వులు
- సీసీటీఎన్ఎస్ ద్వారా ఆన్‌లైన్‌లోనే ట్రాన్స్‌ఫర్
- గతేడాది 1,200, ఈ ఏడాది 200 దాటిన జీరో ఎఫ్ఐఆర్‌లు
- యువతుల అదృశ్యం కేసుల్లో నిరంతర పర్యవేక్షణ




**సాక్షి, హైదరాబాద్:** దిశ ఘటన నేపథ్యంలో జీరో ఎఫ్ఐఆర్ మరోసారి చర్చకు వచ్చింది. పోలీసు స్టేషన్ పరిధులతో సంబంధం లేకుండా ఎఫ్ఐఆర్ బుక్ చేసి ముందు దర్యాప్తు ప్రారంభిస్తారు. అనంతరం కేసును సంబంధిత స్టేషన్‌కు బదిలీ చేస్తారు. వాస్తవానికి ఇదేం కొత్త విధానం కాదు. ఇప్పటికే మనుగడలో ఉన్నదే. దిశ హత్య కేసు అనంతరం జీరో ఎఫ్ఐఆర్ విధానాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్రంలోని వివిధ జిల్లాల ఎస్పీలు, కమిషనర్లకు డీజీపీ మహేందర్‌రెడ్డి గత నెలాఖరునే మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే ఈ విధానాన్ని అన్ని పోలీస్‌స్టేషన్లలో తప్పకుండా అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు డీజీపీ కార్యాలయం తెలిపింది. ప్రత్యేకించి యువతులు, బాలికలు, మహిళలు అదృశ్యమయ్యారంటూ వచ్చిన ఫిర్యాదులపై ఏమాత్రం ఆలస్యం చేయవద్దని అందులో పొందుపరచనున్నారు. నేడో, రేపో ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని పోలీసుస్టేషన్లకు ఆదేశాలు చేరనున్నాయి.

### ఈ ఏడాది 200పైనే..

జీరో ఎఫ్ఐఆర్ విధానాన్ని చాలా ఏళ్లుగా తెలంగాణ పోలీసులు పాటిస్తున్నారు. 2018లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్ల పరిధుల్లో దాదాపు 1,200 కేసులు ఈ విధానంలో నమోదయ్యాయి. అనంతరం దర్యాప్తు దశలో వాటిని ఇతర స్టేషన్లకు బదిలీ చేశారు. తాజాగా వరంగల్‌లోని సుబేదారిలో నమోదైన యువతి మిస్సింగ్ కేసుతో జీరో ఎఫ్ఐఆర్‌ల సంఖ్య ఈ ఏడాదిలో 200 దాటింది. గతంలో కేసుల బదిలీ ప్రక్రియ మాన్యువల్‌గా జరిగేది. కానీ తెలంగాణ పోలీసులు ఈ కేసులో మాత్రం సీసీటీఎన్ఎస్ (క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ సిస్టం) ద్వారా ఆన్‌లైన్‌లో ఈ ఎఫ్ఐఆర్‌ను బదిలీ చేయడం గమనార్హం. మహిళలు, యువతులు అదృశ్యమైన సందర్భంలో వెంటనే స్పందిస్తారు. విషయాన్ని సంబంధిత ఎస్పీ, కమిషనర్ కార్యాలయాలకు వెంటనే సమాచారం చేరిపోతుంది. ఆ వెంటనే సీసీటీఎన్ఎస్ ద్వారా డీజీపీ కార్యాలయానికి కేసు వివరాలు చేరతాయి. ఇలాంటి కేసులను ఎస్పీ, కమిషనర్‌తోపాటు డీజీపీ కార్యాలయం కూడా పర్యవేక్షిస్తాయి.

## ఇదండీ సంగతి



ఎన్నికల్లో ఒక వేళ మళ్లీ పార్టీ ఓడిపోతే నైతిక బాధ్యత వహిస్తూ మళ్లీ రాజీనామా చేస్తారా సార్!!

## వావ్.. వెదురు అదిరే..


ఇంటి సీలింగ్‌కు వేసిన డిజైన్



పర్యావరణాన్ని కాపాడుకునేందుకు వినూత్నంగా ఆలోచించాడు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తాళ్లసింగారం గ్రామానికి చెందిన కొసునం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి. పర్యావరణానికి హాని లేని విధంగా బ్యాంబూ షీట్లతో (వెదరుబొంగులు) ఇంటిని నిర్మిస్తున్నాడు. ప్రవీణ్, సుచిత్ర దంపతులు ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉంటున్నారు. పర్యావరణానికి హాని తలపెట్టకుండా ఆహ్లాదకరంగా ఉండేలా ఇంటిని నిర్మించుకోవాలని సంకల్పించారు. అయితే అందరిలా హైదరాబాద్‌లో కాకుండా సొంత ఊరిలోనే ఇంటి నిర్మాణం చేయాలనుకున్నారు. ఆ క్రమంలో బ్యాంబూ(వెదురుబొంగులు) షీట్లతో ఇంటి నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేశారు. 500 గజాల స్థలంలో నాలుగు గదులు ఉండేలా గత అక్టోబర్ 15న ఇంటి పనులు ప్రారంభించగా ప్రస్తుతం ఆ పనులు చివరి దశలో ఉన్నాయి. ఇంటి నిర్మాణానికి 95 శాతం మొరం మట్టి, 05 శాతం సిమెంట్‌ను వినియోగించారు. అలాగే 220 అడుగుల ప్రహరీని నిర్మించారు. ఈ ప్రహరీ కూడా పూర్తిగా మొరంమట్టితోనే నిర్మించడం విశేషం. 500 గజాల చుట్టూ ప్రహరీ, నాలుగు గదుల సాధారణ ఇంటికి సుమారు రూ.9 లక్షల వ్యయం అవుతుండగా, ఈ ఇంటికి రూ.5 లక్షల వరకే ఖర్చవుతుండటం గమనార్హం. ఈ ఇల్లుకు పార్కింగ్ సదుపాయంతోపాటు మంచి గార్డెన్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు.

– చౌటుప్పల్

# ‘టిన్నర్ దాడి’ నిందితుడు ఆత్మహత్య



**జగిత్యాల క్రైం/కొండగట్టు/కొండపాక:** సిద్దిపేట జిల్లా కొండపాక మండలం ఖమ్మంపల్లిలో గత నెల 21న నలుగురు కుటుంబ సభ్యులను హత్యచేసిన కేసులో నిందితుడైన లక్ష్మీరాజం (42) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం దిగువ కొండగట్టు ప్రాంతంలో ఆదివారం చెట్టుకు ఉరివేసుకొని అతను ఆత్మహత్య చేసుకున్నాడు. కొడిమ్యాల మండలం నమిలికొండకు చెందిన చిలుమలు లక్ష్మీరాజంకు 2007లో సిద్దిపేట జిల్లా కొండపాక మండలం ఖమ్మంపల్లికి చెందిన విమలతో వివాహమైంది. వీరికి కూతురు పవిత్ర, కుమారుడు జైపాల్ సంతానం. కుటుంబ కలహాల నేపథ్యంలో హైదరాబాద్‌లో విడిగా ఉంటున్న భార్య విమల నవంబర్ 21న ఖమ్మంపల్లి వచ్చిందని తెలుసుకున్న లక్ష్మీరాజం, అదే రోజు అర్ధరాత్రి విమలతోపాటు బావమరిది జాన్ రాజ్, ఆయన భార్య రాజేశ్వరి, కుమార్తె పవిత్ర, వదిన సుజాత ఒకే గదిలో నిద్రిస్తుండగా.. వారిపై టిన్నర్ అనే రసాయనం పోసి నిప్పుపెట్టి పరారయ్యాడు. ఆ ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడగా.. నలుగురు మృతిచెందారు. అప్పటి నుంచి పోలీసులు లక్ష్మీరాజం కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో అతను కొండగట్టు వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న మల్యాల ఎస్సై ఉపేంద్రాచారి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి మైసయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# డీజిల్‌కు బదులు నీళ్లు

### జనగామ జిల్లాలో ఘటన

**రఘునాథపల్లి:** జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరి ఆర్పీ ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్ బంక్)లో డీజిల్‌కు బదులు నీళ్లు రావడంతో వాహనదారులు ఆదివారం ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గోవర్ధనగిరి గ్రామానికి చెందిన తోటకూరి అనిల్ బంక్‌కు వచ్చి క్యాన్‌లో డీజిల్ పోయించుకున్నాడు. అయితే క్యాన్ అడుగు భాగంలో సగం వరకు నీళ్లు ఉండటంతో ఇదేమిటని బంక్ సిబ్బందిని ప్రశ్నించాడు. సాంకేతిక సమస్యతో నీళ్లు వచ్చాయని వారు చెప్పడంతో అనిల్‌తో పాటు మిగతా వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు మార్లు డీజిల్, పెట్రోల్‌కు బదులు నీళ్లు వచ్చాయని, తమ వాహనాలు పాడయ్యాయని మండిపడ్డారు. పెట్రోల్ బంక్‌లో నీళ్లు వస్తున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బంక్‌ను తనిఖీ చేసి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేశారు.


బంక్ సిబ్బందిని నిలదీస్తున్న వాహనదారులు

# తెలంగాణలోనే ధాన్యం కొనుగోళ్లు

### ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు


మహిళా రైతుతో మాట్లాడుతున్న హరీశ్

**హుస్నాబాద్:** దేశంలోనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నది కేవలం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమేనని ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి గిట్టుబాటు ధర అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ధాన్యం కొనుగోలు చేసేందుకు చేతులెత్తేసినా.. తెలంగాణ ప్రభుత్వం 11 వేల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. రూ.12 వేల కోట్లు వెచ్చించి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు వరినాట్ల యంత్రాలు, చైన్ బండ్లు కావాలని కోరుతున్నారని, వచ్చే బడ్జెట్‌లో వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేసేందుకు నిధులు కేటాయించాలని సీఎం కేసీఆర్ చెప్పారని తెలిపారు. ఆయన వెంట ఎమ్మెల్యే సతీష్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డిలు ఉన్నారు.

# కల్లెంలో షోలాపూర్ టెక్స్‌టైల్ పార్క్

### 120 ఎకరాలు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం

**షోలాపూర్:** జనగాం జిల్లాలోని కల్లెం గ్రామంలో షోలాపూర్‌కు చెందిన మరమగ్గాలదారులకు మినీ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయడానికి మార్గం సుగమమైంది. ఈ పార్క్ కోసం తెలంగాణ ప్రభుత్వం 120 ఎకరాల భూమిని కేటాయించింది. దీంతో వచ్చే సంవత్సరన్నర కాలంలో పార్క్ ఏర్పాటై సరుకు ఉత్పత్తి ప్రారంభం కానుంది. తెలంగాణ మూలాలు కలిగి, బతుకుదెరువు కోసం దేశంలోని భివండీ, సూరత్, షోలాపూర్ లాంటి పట్టణాలకు వెళ్లి స్థిరపడిన చేనేతన్నలు, మరమగ్గాలదారులు తెలంగాణలోని టెక్స్‌టైల్ పార్క్‌లో పాలు పంచుకోవాలని రెండేళ్ల కిందట ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. ఆయన పిలుపు మేరకు షోలాపూర్ పట్టణానికి చెందిన 500 మంది మరమగ్గాలదారులు ఈ పార్క్‌లో పాలుపంచుకునేందుకు ఆసక్తి ప్రకటించారు. అయితే కాకతీయ పార్క్ పథకంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టే ఆర్థిక స్తోమత లేక మినీ పార్క్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో తెలంగాణ ప్రభుత్వం జనగాం జిల్లాలోని కల్లెం గ్రామంలో 120 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. లేఔట్ మంజూరు లభించడంతో ప్లాటింగ్ ప్రక్రియ కూడా పూర్తయి సర్వే నంబర్లు కూడా లభించాయి. ఇందులో 6 నుంచి 9 వేల చదరపుటడుగుల చొప్పున మొత్తం 465 ప్లాట్స్ ఉన్నాయని సంస్థ కార్యదర్శి మనోహర్ సింగం తెలిపారు. ఈ ప్రాజెక్టులో ఒక్క యూనిట్ ప్రాజెక్టు రూ.2 కోట్ల వరకు ఉంటుంది. స్థలం కోసం సభ్యులు ప్లాట్ విలువలో 10 శాతం మేర తెలంగాణ ప్రభుత్వానికి ఆన్‌లైన్‌లో చెల్లించి నమోదు చేసుకోవాలని ఆయన అన్నారు. ఇప్పటివరకు 80 మంది నమోదు చేసుకున్నారు. రెండు కోట్ల మేర రుణం బ్యాంకుల ద్వారా లభించింది. ఈ మొత్తాన్ని భవనం, మిషనరీ, ఇతర సామగ్రి కొనుగోలుకు వాడుకోవచ్చు. స్థలం కొనుగోలుకు 50 శాతం గ్రాంటు ప్రభుత్వం ఇవ్వనుంది. ఈ రుణానికి తెలంగాణ ప్రభుత్వం హామీనిస్తుందన్నారు.

**30 దరఖాస్తుల పరిశీలన పూర్తి**

టెక్స్‌టైల్ పార్క్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకునే వారికోసం కల్లెంలో, షోలాపూర్‌లో సంస్థ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ సంస్థ అధ్యక్షుడిగా చిడుపాక దుర్గా స్వామి, ఉపాధ్యక్షుడిగా ఆనంద్ అరుకాల్, కోశాధికారిగా రాజేశం చిలుక, ఇట్టం దేవదాస్ తదితరులు కొనసాగుతున్నారని మనోహర్ అన్నారు. ఇదిలాఉండగా దరఖాస్తు చేసుకున్న 80 మందిలో 30 మంది దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయిందని మనోహర్ వివరించారు. మరో 400 మంది దరఖాస్తు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. పక్షం రోజులకు ఒకసారి సమావేశం నిర్వహిస్తామని టీఎస్ఐఐసీ చైర్మన్ జి.బాలమల్లు, ఎండీ నర్సింహారెడ్డి, సీఈఓ మధుసూదన్ తెలిపారు. టెక్స్‌టైల్ పార్క్ ఏర్పడిన తరువాత చద్దర్లు, తువ్వాళ్లు, సూటింగ్స్, షర్టింగ్స్, చీరలు, లుంగీలు ఇక్కడ ఉత్పత్తి అవుతాయి. తెలంగాణ ప్రభుత్వం ఏటా అందజేసే బతుకమ్మ చీరలు కూడా ఇక్కడే తయారవుతాయని ఆయన అన్నారు.

# అంధ ఉద్యోగురాలికి ఆదివారం విధులు

### మత్స్యశాఖ అధికారుల నిర్వాకం



**హన్మకొండ చౌరస్తా :** ఈ ఫొటోలో ఉన్న యువతి పేరు స్వప్న. జన్మతః కంటిచూపు లేదు. ఆమెకు దివ్యాంగుల కోటాలో నాల్గవ తరగతి స్థాయి ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం వరంగల్ ములుగు రోడ్ సమీపంలోని మత్స్యశాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తోంది. అయితే ఆదివారం సైతం డ్యూటీ చేయాలని అధికారులు ఆదేశించడంతో తప్పనిసరి పరిస్థితులలో అమ్మమ్మ లచ్చుమమ్మను తోడుగా తీసుకుని వచ్చింది. కొన్ని నెలలుగా ప్రతి ఆదివారం ఒకరు విధులు నిర్వర్తించాలని అధికారులు ఆదేశించిన నేపథ్యంలో ఆమె కార్యాలయానికి వచ్చింది. ఈ విషయమై వరంగల్ అర్బన్ జిల్లా మత్స్యశాఖ అధికారి దాహగం సతీశ్‌ను వివరణ కోరగా, ఆఫీసులో ఇద్దరు అటెండర్లు, ఇద్దరు వాచ్‌మన్లు ఉన్నారు..వారిలో ఒకరు తప్పనిసరిగా ప్రతీ ఆదివారం ‘టర్న్’డ్యూటీ చేయాల్సిందేనని పేర్కొన్నారు.

# తాళికట్టు వేళ.. వరుడికి చెరసాల

- నిశ్చితార్థం ఒకరితో చేసుకుని మరొక యువతిని పెళ్లాడటానికి యత్నం
- ఓ బ్యాంకు మేనేజర్ నిర్వాకం

**బొమ్మలసత్రం:** ఓ అమ్మాయితో నిశ్చితార్థం చేసుకుని మరో యువతి మెడలో తాళికట్టేందుకు సిద్ధమైన ఓ వంచకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుపతికి చెందిన మోహన్‌కృష్ణ అదే ప్రాంతంలో ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ గ్రామానికి చెందిన యువతిని వివాహం చేసుకోవడానికి ఆగస్టు 24న నిశ్చితార్థం చేసుకున్నాడు. కట్నకానుకల కింద రూ.12 లక్షల నగదు, 6 తులాల బంగారాన్ని కూడా తీసుకు న్నాడు. అక్టోబర్‌లో వివాహం చేసుకోవాల్సి ఉంది. జాతకాలు కుదరలేదని దాన్ని రద్దు చేసుకున్నట్టు కృష్ణమోహన్ సోదరుడు వీరప్రసాద్ పెళ్లికుమార్తె కుటుంబానికి సమాచారమిచ్చాడు. తీసుకున్న కట్నాన్ని కూడా తిరిగి ఇవ్వలేదు. నంద్యాలలోని మహానందీశ్వర దేవస్థానంలో ఆదివారం మరో యువతి మెళ్లో తాళి కట్టడానికి సిద్ధమయ్యాడు. తమకు అందిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు రంగంలోకి దిగి పెళ్లిపీటలపై కూర్చున్న మోహన్‌కృష్ణతో పాటు అతని సోద రుడు వీరప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం వివాహం చేసుకోబోతున్న యువతి కుటుంబ సభ్యుల వద్ద కూడా రూ.15 లక్షల నగదు, 12 తులాల బంగారం కట్నంగా మాట్లాడుకుని.. ఇప్పటికే రూ.12లక్షల నగదు, 6 తులాల బంగారం తీసుకున్నట్లు ఆ యువతి తల్లిదండ్రులు తెలిపారు. మోహన్‌కృష్ణతో పాటు అతని కుటుంబ సభ్యులపై పోలీసులకు ఫిర్యా దు చేశారు. వీరప్రసాద్ గతంలో నంద్యాల పట్టణంలోని కెనరా బ్యాంకులో ఉద్యోగిగా పనిచేశాడు. ఆ సమయం (2008)లో నిరుద్యోగులను మోసం చేశాడు. కేవలం రూ.400 చెల్లిస్తే నెలకు రూ.30 వేలు సంపాదించే సలహాలు ఇస్తానని నమ్మించి 300 మంది నుంచి రూ.400 చొప్పున వసూలు చేశాడు. దీనిపై చీటింగ్ కేసుకూడా నమోదైంది.


మోహన్‌కృష్ణను అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసులు

# సార్.. నాకు పెళ్లి వద్దు..

### పోలీసులను ఆశ్రయించిన బాలిక

**ఎర్రుపాలెం:** కుటుంబ సభ్యులు తనకు బలవంతపు పెళ్లి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, తనకు ఇప్పుడే పెళ్లి చేసుకోవాలని లేదని ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని మామునూరు గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఆదివారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. ఏఎస్ఐ నారాయణ కథనం ప్రకారం..కుటుంబ సభ్యులు తనకు బలవంతపు వివాహం చేసేందుకు సిద్ధమయ్యారని, రక్షణ కావాలని కోరుతూ ఆ బాలిక చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణశ్రీ, హెల్ప్‌లైన్ సభ్యురాలు నస్రత్‌లు బాధిత బాలికను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. కుటుంబసభ్యులకు చెప్పి పెళ్లి నిలిపి వేయిస్తామని పోలీసులు తెలిపారు.

# ఆడ పిల్లను వద్దనుకున్నారు..

### పోలీసుల జోక్యంతో శిశువు ఐసీడీఎస్ అధికారులకు అప్పగింత

**కొండమల్లేపల్లి (దేవరకొండ):** మూడో సంతానంలోనూ ఆడశిశువే జన్మించడంతో వదిలించుకోవాలనుకున్నారు ఆ దంపతులు. ఈ క్రమంలో శిశువును హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న సంతానం లేని దంపతులకు అప్పగించారు. ఐసీడీఎస్, పోలీస్ అధికారులకు ఈ విషయం తెలియడంతో కౌన్సెలింగ్ నిర్వహించి శిశువును తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో ఆదివారం వెలుగుచూసింది. చందంపేట మండలం మోత్యా తండాకు చెందిన ముడావత్ మోత్యా, సరిత దంపతులకు మూడో కాన్పులో నవంబర్ 3న ఆడశిశువు జన్మించింది. అప్పటికే ఇద్దరు ఆడ పిల్లలు ఉండటంతో ఆ చిన్నారిని వదిలించుకోవాలనుకున్నారు. దీంతో హైదరాబాద్‌కు చెందిన మోహన్ దంపతులు శిశువును పెంచుకుంటామని చెప్పడంతో నవంబర్ 18న వారికి అప్పగించారు. ఈ విషయం తండాలోని అంగన్‌వాడీ సిబ్బందికి తెలియడంతో ఐసీడీఎస్ సీడీపీఓ సువర్ణ శిశువును హైదరాబాద్ నుంచి తండాకు రప్పించారు. ఈ క్రమంలో ఈ నెల 6న దేవరకొండ ఐసీడీఎస్ కార్యాలయంలో సరిత దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. శిశువును పెంచుకుంటామని దంపతులు అధికారులకు తెలిపారు. కాగా ఆదివారం మళ్లీ మోహన్ దంపతులు తండాకు చేరుకుని పాపను తీసుకెళ్తుండగా.. సీడీపీఓ సువర్ణ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చి మోహన్ దంపతులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే మోత్యా దంపతులను దేవరకొండ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆ తర్వాత శిశువును ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు.

# యాదాద్రిలో భక్తుల రద్దీ

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధికి ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. సెలవు దినం కావడంతో జంట నగరాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానికి సుమారు 3 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు.






# ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం

## ఊపిరాడక ఉక్కిరిబిక్కిరై 43 మంది మృతి

- తెల్లారకుండానే తెల్లారిపోయిన కార్మికుల బతుకులు
- పోలీసుల అదుపులో భవన యజమాని • న్యాయవిచారణకు ఢిల్లీ సర్కార్ ఆదేశం

న్యూఢిల్లీ

ఉత్తర ఢిల్లీలోని రాణి ఝాన్సీరోడ్డులో అనాజ్ మండీ ప్రాంతం. ఆ పరిసరాలన్నీ జనావాసాలతో ఎప్పుడూ రద్దీగా ఉంటాయి. అక్కడే నాలుగు అంతస్తుల భవనంలో చిన్నా చితక తయారీ పరిశ్రమలున్నాయి. ఆదివారం తెల్లవారు జామున 5 గంటలు దాటింది. ఇంకా చిమ్మచీకట్లు వీడిపోలేదు. ఇంతలో రెండో అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్ని జ్వాలలు అన్ని అంతస్తుల్లోకి పాకాయి. రేయింబవళ్లు పని చేసి అలసిపోయిన వలస కార్మికులు అక్కడే గాఢ నిద్రలో ఉన్నారు. వారు నిద్రిస్తున్న గది చాలా చిన్నది. వెంటిలేషన్ కూడా సరిగా లేదు. మంటలు వేగంగా వ్యాపించడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగకమ్మేసింది. ఫలితంగా 43 మంది కార్మికులు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ భవనంలో లగేజీ బ్యాగులు, ప్లాస్టిక్ బ్యాగుల వర్క్‌షాప్‌లున్నాయి. భవన యజమాని రెహాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

### ఇరుకు వీధులే సహాయ కార్యక్రమాలకి అడ్డంకి

అగ్ని ప్రమాదం సంగతి తెలిసిన వెంటనే 30 అగ్ని మాపక శకటాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. మంటల్ని అదుపులోకి తేవడానికి, కార్మికుల్ని రక్షించడానికి 150 మంది అగ్ని మాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ఆ ఫ్యాక్టరీ చట్టవిరుద్ధంగా జనావాసాల మధ్య ఉండటంతో ఇరుకు సందుల్లోంచి ఘటనా స్థలానికి చేరుకోవడానికే అగ్నిమాపక సిబ్బంది తంటాలు పడ్డారు. కిటికీ గ్రిల్స్ కట్ చేసి భవనం లోపలికి వెళ్లాల్సి వచ్చింది. ఈ ఘటనలో 63 మందిని కాపాడారు. మంటల్లో చిక్కుకున్న వారు తప్పించుకోవడానికి భవనానికి వెంటిలేషన్ సౌకర్యాలే సరిగా లేవు. దీంతో తప్పించుకునే మార్గాలు లేక కార్మికులు అల్లాడిపోయారు.

### షార్ట్ సర్క్యూటే కారణం

షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమని అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. అంతే కాదు ఈ భవనంలో తగిన భద్రతా ఏర్పాట్లు లేవు. అగ్ని మాపక శాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కూడా తీసుకోలేదు. భవనంలో అంతర్గత విద్యుత్ వ్యవస్థలో లోపాల కారణంగా ప్రమాదం జరిగిందని విద్యుత్ శాఖ వెల్లడించింది.

### కార్బన్‌మోనాక్సైడ్ వల్లే..

కర్మాగారంలో మంటల్ని అదుపులోకి తీసుకువచ్చాక నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్‌ఎఫ్) ఘటనాస్థలాన్ని పరిశీలించింది. అగ్నిప్రమాదం కారణంగా గాల్లో కార్బన్ మోనాక్సైడ్ ఎక్కువగా కలవడంతో ఉక్కిరిబిక్కిరై ఊపిరాడక కార్మికులు ప్రాణాలు కోల్పోయారని ఎన్‌డీఆర్‌ఎఫ్ డిప్యూటీ కమాండర్ ఆదిత్య ప్రతాప్ సింగ్ వెల్లడించారు. ప్లాస్టిక్, తోలు బ్యాగులు వంటివన్నీ మంటల్లో కాలడం వల్లనే కార్బన్ మోనాక్సైడ్ అధికంగా వెలువడిందని ఆయన వివరించారు.




అగ్ని ప్రమాదం జరిగిన భవనం. సంఘటన స్థలానికి వస్తున్న అగ్నిమాపక వాహనాలు

### తలుపు దగ్గర ఉన్నవారే సేఫ్

నాలుగు అంతస్తుల ఆ భవనంలో గదులకి తలుపులు, ఒకటి రెండు చోట్ల కిటికీలు తప్ప తప్పించుకోవడానికి మరో మార్గం లేదు. దీంతో తలుపులకి సమీపంలో నిద్రిస్తున్న వారు మాత్రమే ప్రాణాలతో బయట పడ్డారు. ప్రమాదం నుంచి బయటపడిన ఫిరోజ్‌ఖాన్ కథనం ప్రకారం 'ఒక గదిలో తలుపు దగ్గరే పడుకున్నా. మంటల సెగకు మెలకువ వచ్చింది. ప్రమాదాన్ని ఊహించాను. వెంటనే పక్కనే పడుకున్న నలుగైదుగురిని లేపి పరుగు పరుగున బయటకి వచ్చాం. ఇంకా చాలా మంది లోపలే ఉండిపోయారు''అని చెప్పారు.

### 10 లక్షల ఎక్స్‌గ్రేషియా

ఢిల్లీ ప్రభుత్వం ఈ ఘటనపై సమగ్ర న్యాయ విచారణకు ఆదేశించింది. ఏడు రోజుల్లోగా నివేదిక అందించాలని పేర్కొంది. ఘటనా స్థలిని పరిశీలించిన ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.లక్ష సాయం ప్రకటించారు. ప్రభుత్వ ఖర్చుతో ఖరీదైన చికిత్స అందిస్తామని చెప్పారు.

### అత్యంత భయానకమైంది: ప్రధాని మోదీ

ఢిల్లీ అగ్నిప్రమాదం అత్యంత భయానకమైందని ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు అందిస్తామని ప్రధాని కార్యాలయం మరో ట్వీట్‌లో వెల్లడించింది. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ఈ ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

### తెలంగాణ సీఎం కేసీఆర్ విచారం

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో జరిగిన అగ్నిప్రమాదంలో తీవ్ర ప్రాణనష్టం జరగడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు విచారం వ్యక్తం చేశారు. మృతులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఇది దురదృష్టకరమైన సంఘటన అని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని తన సందేశంలో తెలిపారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

**1997, జులై:** ఢిల్లీలో అత్యంత ఖరీదైన ప్రాంతమైన గ్రీన్ పార్క్ ఏరియాలోని ఉపహార్ థియేటర్‌లో సన్ని డియోల్ నటించిన బోర్డర్ సినిమా మధ్యాహ్నం ఆట ప్రదర్శిస్తుండగా భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 59 మంది మంటల్లో బుగ్గయిపోతే, 100 మందికిపైగా గాయపడ్డారు.
**2018 జనవరి:** వాయవ్య ఢిల్లీలో బాణాసంచా కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాదంలో 17 మంది మరణించారు.

### ఉపహార్ నుంచి అనాజ్ మండీ వరకు..

**2019, ఫిబ్రవరి:** సెంట్రల్ ఢిల్లీ కరోల్‌బాగ్ ప్రాంతంలో అర్పిత్ ప్యాలెస్ హోటల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది అగ్నికి ఆహుతయ్యారు.
**2019, డిసెంబర్:** ఉత్తర ఢిల్లీలో అనాజ్ మండీ ప్రాంతంలో కర్మాగారం అగ్ని ప్రమాదంలో 43 మంది మృతి

## క్లుప్తంగా...



### అరుణ్ శౌరీకి మోదీ పరామర్శ

పుణే: మెదడు సంబంధిత గాయంతో పుణెలోని ఓ ఆస్పత్రిలో చేరిన కేంద్ర మాజీ మంత్రి అరుణ్ శౌరీ (78)ని ప్రధాని మోదీ పరామర్శించారు. 15 నిమిషాల పాటు అరుణ్ శౌరీతో ప్రధాని మాట్లాడారు. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. లావాసాలోని తన నివాసం దగ్గర్లో డిసెంబరు 1న కిందపడడంతో అరుణ్ శౌరీ మెదడుకు గాయమైంది. ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

### సత్వర న్యాయం ఉండదు

**ఆలస్యం కూడా కాకూడదు: వెంకయ్య**



న్యూఢిల్లీ: కేసుల్లో సత్వర న్యాయం ఉండదని, అలాగే న్యాయం అందడంలో ఆలస్యం కూడా ఉండకూడదని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చెప్పారు. ప్రజాప్రాతినిధ్య స్తంభాలు అనే అంశంపై వీరేంద్ర భాటియా స్మారక ఉపన్యాసంలో ఆదివారం ఈ వ్యాఖ్యలు చేశారు. 'సత్వర న్యాయం ఉండదు. అలాగే న్యాయం అందడంలో ఆలస్యం జరగకూడదు. ఒకవేళ న్యాయం అందడంలో ఆలస్యం జరిగితే ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటారు. ఎమ్మెల్యేలు, ఎంపీలపై ఉన్న కేసుల్లో కూడా నిర్దిష్ట సమయంలో తీర్పులు రావాల్సిన అవసరం ఉంది' అన్నారు. న్యాయస్థానాల్లో వాదనలు ప్రాంతీయ భాషల్లో జరగాలన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బోబ్డే మాట్లాడుతూ సత్వర న్యాయం ఉండదని, న్యాయం ప్రతీకారంగా మారకూడదని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

### ఆస్పత్రి నుంచి లతామంగేష్కర్ డిశ్చార్జ్



ముంబై: న్యుమోనియాతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన దిగ్గజ గాయని లతా మంగేష్కర్ (90) ఆదివారం డిశ్చార్జ్ అయ్యారు. ఆస్పత్రి వైద్యుల సలహా మేరకు పూర్తిగా తగ్గే వరకూ ఆస్పత్రిలో ఉన్నానని ఆమె చెప్పారు. శ్వాసకోశ సంబంధిత సమస్యతో గత నెల 11న ఆమె ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చేరిన సంగతి తెలిసిందే. అభిమానుల ప్రార్థనలు, వైద్యుల వల్లే మళ్లీ ఇల్లు చేరగలిగానని ట్విట్టర్ ద్వారా వెల్లడించారు.

### శబరిమల ఆదాయం రూ. 69 కోట్లు

శబరిమల: శబరిమల అయ్యప్ప ఆలయం తెరుచుకున్న తొలి 20 రోజుల్లో రూ. 69 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. భక్తుల దర్శనార్థం ఏడాదిలో 2 నెలలే తెరిచి ఉంచే ఈ ఆలయంలో నవంబర్ 16 నుంచి దర్శనాలు మొదలయ్యాయి. ఇక అప్పటి నుంచి డిసెంబర్ 6వ తేదీ నాటికి లెక్కించిన ఆదాయం రూ. 69 కోట్లు. 2018–19 సీజన్‌తో పోల్చుకుంటే ప్రస్తుతం వచ్చిన ఆదాయం రూ. 27.55 కోట్లు ఎక్కువని ట్రావెన్‌కోర్ దేవస్థాన బోర్డు (టీడీబీ) తెలిపింది.

# మహిళల భద్రతలో పోలీసులే కీలకం

- డీజీపీ, ఐజీపీల జాతీయ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ
- అవసరాల మేరకు చట్టాల్లో మార్పులు: హోం మంత్రి



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ, చిత్రంలో హోంమంత్రి అమిత్ షా, సహాయ మంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ/పుణె: మహిళలకు భద్రత కల్పించడంలో పోలీసులు సమర్థవంతమైన పాత్ర నిర్వహించాలని ప్రధాని మోదీ అన్నారు. పుణెలో జరుగుతున్న 54వ డీజీపీ, ఐజీపీల జాతీయ సదస్సులో ఆదివారం ఆయన ప్రసంగించారు. పోలీసుల గౌరవాన్ని పెంచేలా అధికారులు కృషి చేయాలని, సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు..ముఖ్యంగా మహిళలు, చిన్నారుల భద్రతపై విశ్వాసం పెంచాలని కోరారు. దేశంలో మహిళలపై పెరుగుతున్న నేరాలు, ప్రజల్లో పెరుగుతున్న ఆందోళన నేపథ్యంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. సాధారణ పౌరుల నమ్మకాన్ని చూరగొనేందుకు పోలీసింగ్ కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. పోలీసు అధికారులు నిత్యం విధి నిర్వహణలో ఎదుర్కొనే సవాళ్ల గురించి తనకు తెలుసునంటూ ప్రధాని..'ఇలాంటివి ఎన్ని ఉన్నా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరైనప్పుడు ఉన్న ఉత్సాహం, ఆదర్శ భావాలను మనసులో ఉంచుకుంటూ జాతిహితం, సమాజంలోని పేదలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు'అని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

**అవసరాల మేరకు చట్టాల్లో మార్పులు**

దేశ అవసరాలకు అనుగుణంగా చట్టాలను మార్చేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్‌పీసీ)లను మెరుగుపరిచేందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాల్సిందిగా అన్ని రాష్ట్రాలను హోం శాఖ కోరిన నేపథ్యంలో ఆయన ఈ విషయం వెల్లడించడం గమనార్హం.

**ఉగ్రవాద శక్తులను నిర్వీర్యం చేయాలి**

సార్క్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ సార్క్ సెక్రటేరియట్‌కు లేఖ రాశారు. ఉగ్రవాదాన్ని సమష్టిగా ఎదుర్కోవడంతో పాటు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తులను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందని లేఖలో పేర్కొన్నారు. పాకిస్తాన్‌ను ఉద్దేశిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## 'ఉన్నావ్' బాధితురాలికి కన్నీటి వీడ్కోలు


పోలీసు భద్రత మధ్య అంతిమ యాత్ర

ఉన్నావ్: ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో అత్యాచారం, హత్యకు గురైన బాధితురాలి (23) అంత్యక్రియలు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఆదివారం ముగిశాయి. కుటుంబసభ్యులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య యువతి స్వగ్రామంలోనే ఆమె తాత, నానమ్మ సమాధుల పక్కన అంత్యక్రియలు నిర్వహించారు. బాధితురాలిని కడసారి చూసేందుకు స్థానికులు భారీగా తరలివచ్చారు. యూపీ మంత్రులు స్వామి ప్రసాద్ మౌర్య, కమల్ రాణి వరుణ్, సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్సీ సునీల్ సింగ్ సజన్ అంత్యక్రియలకు హాజరయ్యారు. బాధితురాలి కుటుంబానికి ఉన్నావ్ ఎంపీ అన్నూ టాండన్ రూ.5 లక్షల సాయం అందించారు. కాగా, ఈ కేసులో నిందితులను శిక్షిస్తామని సీఎం ఆదిత్యనాథ్ భరోసా ఇచ్చేదాకా అంత్యక్రియలు నిర్వహించేది లేదని పట్టుబట్టిన బాధిత కుటుంబం.. అధికారుల హామీతో వెనక్కుతగ్గింది. ఆ కుటుంబానికి భద్రత ఏర్పాటు చేస్తామని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇల్లు మంజూరు చేస్తామని లక్నో డివిజినల్ కమిషనర్ వెల్లడించారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న బాధితురాలి సోదరికి ప్రత్యేక భద్రత కల్పిస్తాన్నారు. రక్షణ కోసం ఆయుధాలు కావాలంటే ఇస్తామని చెప్పారు. రేప్ బాధితురాలి ఘటనలో నిర్లక్ష్యం వహించిన ఏడుగురు పోలీసులను యూపీ ప్రభుత్వం విధుల నుంచి సస్పెండ్ చేసింది.

### 2 నెలల్లో రేప్ కేసుల దర్యాప్తు పూర్తి కావాలి: కేంద్ర మంత్రి

పట్నా: రేప్, పోక్సో కేసుల దర్యాప్తు రెండు నెలల్లోగా పూర్తయ్యేలా ముఖ్యమంత్రులకు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు లేఖలు రాస్తానని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్ చెప్పారు. కేవలం ఆరు నెలల్లో విచారణ పూర్తయ్యేలా చూడాలని కూడా చెబుతానన్నారు. 'దేశంలోని రాష్ట్రాల సీఎంలు, సీజేలకు లేఖలు రాయడంతో పాటు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరితగతిన విచారించేలా చూస్తాం' అన్నారు. మహిళలపై జరిగే అకృత్యాలు దురదృష్టమని, వాటిని ఖండించాలని అన్నారు.

# ఐఎస్‌ఎస్‌కు ఎలుకలు, పురుగులు

- కేప్ కార్నివాల్ నుంచి అంతరిక్ష నౌకలో పంపిన స్పేస్ ఎక్స్
- ఓ స్మార్ట్ రోబో సైతం అక్కడకు



కేప్ కార్నివాల్ (అమెరికా): ఆదివారం తెల్లవారుజామునే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్‌ఎస్)లో కొత్త మిత్రులు సందడి చేశాయి. స్టేషన్ కమాండర్, ఇటలీకి చెందిన ల్యూకా పార్మిటానో ఓ పెద్ద రోబో చెయ్యిని వినియోగించి వాటిని కేంద్రంలోకి తీసుకొచ్చి సాదరస్వాగతం పలికారు. ఇంతకీ ఈ మిత్రులు ఎవరో చెప్పలేదు కదా..! ఓ స్మార్ట్ రోబో, కండలుదిరిగిన పెద్దపెద్ద ఎలుకలు, క్రిమిసంహారక పురుగులే..!'స్పేస్ ఎక్స్'అనే అమెరికా సంస్థ వీటిని ఐఎస్‌ఎస్‌కి చేర్చింది. దీనికోసం కేప్ కార్నివాల్‌లోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి రెండు అంతరిక్ష నౌకల సాయంతో 3 రోజుల క్రితం ఈ ప్రయోగాన్ని చేపట్టింది. ఎలుకలు, పురుగులే కదా.. వీటి బరువు కేవలం ఓ రెండు, మూడు కిలోలు ఉంటాయని అనుకుంటే పొరపాటే. వీటి బరువు దాదాపు 3 టన్నులు.. అంటే 2,720 కిలోగ్రాములు అన్నమాట. కొత్త మిత్రుల్లో ఓ 40 ఎలుకలు ఉన్నాయి. వీటిని కండలు, ఎముకల పరీక్షల కోసం అక్కడకు పంపించారు. వీటిలో జన్యుపరంగా తయారు చేయబడిన బాహుబలి లాంటి ఎలుకలు 8 ఉన్నాయి. వీటి బరువు సాధారణ ఎలుకల కంటే రెట్టింపు ఉంటుంది.అలాగే లక్షా 20 వేల నులి పురుగులు ఉన్నాయి. వీటిని వ్యవసాయంలో క్రిమిసంహారకం కోసం అక్కడకు పంపించారు. కృత్రిమ మేధస్సు సాంకేతికతతో పనిచేసే రోబో అయితే ఎదుటివారి భావాలను అర్థం చేసుకోగలదు. దీని పేరు సిమన్. దీనిని వ్యోమగాముల భావాలను అర్థం చేసుకోవడానికి పంపించారు. ఇక ఐఎస్‌ఎస్‌లో ఉన్న ఆరుగురు వ్యోమగాముల కోసం నాసా క్రిస్మస్ పండుగ సందర్భంగా బహుమతులు పంపింది.

# నేడు లోక్‌సభకు పౌరసత్వ బిల్లు

**బీజేపీ సభ్యులకు విప్ జారీ**

న్యూఢిల్లీ: పౌరసత్వ (సవరణ) బిల్లుతోపాటు చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీలకు కోటా పొడిగింపునకు ఉద్దేశించిన బిల్లును సోమవారం కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్తాన్‌లలో మత వివక్ష కారణంగా వలసవచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన పౌరసత్వ బిల్లును హోం మంత్రి అమిత్ షా దిగువ సభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం సభలో ప్రవేశపెట్టిన బిల్లుపై చర్చ, అనంతరం ఓటింగ్ జరగనుందని లోక్‌సభ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి రిజర్వేషన్లను మరో పదేళ్లపాటు పొడిగించేందుకు ఉద్దేశించిన బిల్లును కూడా ప్రభుత్వం నేడు సభలో ప్రవేశపెట్టనుంది. ప్రస్తుత చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు చట్టసభల్లో రిజర్వేషన్ల కోటా 2020 జనవరితో ముగియనుంది. ఈ నేపథ్యంలో బీజేపీ తమ పార్టీకి చెందిన లోక్‌సభ సభ్యులకు విప్ జారీ చేసింది. సోమవారం నుంచి మూడు రోజులపాటు సభకు తప్పని సరిగా హాజరు కావాలని ఆదేశించింది. పౌరసత్వ బిల్లుపై కాంగ్రెస్ నేత శశిథరూర్ విరుచుకుపడ్డారు. గాంధీజీ ఆలోచనా విధానంపై జిన్నా వాదానికి గెలుపు వంటిదే పౌరసత్వ బిల్లు అని విమర్శించారు. ఈ బిల్లును నిరసిస్తూ 10వ తేదీన బంద్ పాటించాలని ఈశాన్య విద్యార్థుల సమాఖ్య పిలుపునిచ్చింది.

# కర్ణాటక 'ఉప' ఫలితాలు నేడే

**అన్ని పార్టీల్లో ఉత్కంఠ**

సాక్షి, బెంగళూరు: కర్ణాటకలో ఉత్కంఠ రేకెత్తిస్తున్న 15 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడనున్నాయి. ఈ నెల 5న రాష్ట్రంలో 15 సీట్లకు పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. మైనారిటీ ప్రభుత్వాన్ని నెట్టుకొస్తున్న యడియూరప్ప తన ప్రభుత్వాన్ని నిలుపుకునేందుకు ఎక్కువ సీట్లు సాధించాల్సి ఉంది. కనీసం 8 సీట్లలో గెలిస్తేనే బీజేపీ ప్రభుత్వం ఒడ్డున పడుతుంది. మరోవైపు అధికార బీజేపీని నిలువరించి తిరిగి అధికారంలోకి రావాలని ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నంలోగా పూర్తి ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. ఓట్ల లెక్కింపు దగ్గర పడే కొద్దీ బీజేపీ తరఫున పోటీ చేసిన అనర్హత వేటుపడిన ఎమ్మెల్యేలతో పాటు వివిధ పార్టీల అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కాంగ్రెస్, జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోసి బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి కీలకంగా వ్యవహరించిన అనర్హత ఎమ్మెల్యేల భవితవ్యం కూడా నేడు తేలనుంది.

**బీజేపీకి పట్టం కట్టిన ఎగ్జిట్‌పోల్స్..**

ఎగ్జిట్ పోల్స్ అన్నీ బీజేపీకి పట్టం కట్టడంతో సీఎం యడియూరప్ప ధైర్యంగా కనిపిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలు మాత్రం ఎగ్జిట్ పోల్స్ శాస్త్రీయమైనవి కాదంటున్నాయి. బీజేపీ, కాంగ్రెస్‌లు మొత్తం 15 స్థానాల్లో, జేడీఎస్ 12 చోట్ల బరిలో ఉన్నాయి.

# ఛత్తీస్‌గఢ్ 'చెత్త' శుద్ధి

వ్యర్థాల నిర్వహణలో భేష్ | దేశవ్యాప్తంగా 57% చెత్త రీసైకిల్ | కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నివేదిక

**న్యూఢిల్లీ: మన దేశంలో ఎటు చూసినా చెత్తే. ఎక్కడికి వెళ్లినా పరిసరాల పరిశుభ్రత మచ్చుకైనా కనిపించదు. కేంద్రంలో మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చాక స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. చెత్తాచెదారాన్ని సేకరించి దానిని ప్రాసెస్ చేసి దేశాన్ని అద్దంలా మార్చాలని ప్రణాళికలు వేసింది. ఇందుకోసం ప్రతీ ఏడాది అన్ని రాష్ట్రాల్లో వ్యర్థాల నిర్వహణ ఎలా ఉంటుందో పరిశీలిస్తోంది. ఈ వ్యర్థాల నిర్వహణలో ఛత్తీస్‌గఢ్ అద్భుతమైన పనితీరుని కనిపిస్తోందని కేంద్ర గృహ, పట్టణ శాఖ ఇటీవల పార్లమెంటుకు సమర్పించిన తన నివేదికలో పేర్కొంది. అతి పెద్ద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలు ఛత్తీస్‌గఢ్‌తో పోలిస్తే ఎంతో వెనుకబడి ఉన్నాయని వెల్లడించింది. ఆ నివేదికలో ఏముందంటే...**

- దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లోని 84 వేల మున్సిపాల్టీల్లో 79 వేలకు పైగా గృహాల నుంచి (93%) చెత్తను సేకరిస్తున్నారు.
- దేశంలో ప్రతిరోజూ 1.48 లక్షల టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. అందులో 57శాతం మాత్రమే రీసైకిల్ చేస్తున్నారు. మిగిలినదంతా డంపింగ్ యార్డులో నింపేస్తున్నారు.
- ఇంటింటికీ వెళ్లి వ్యర్థాలను సేకరించడంలో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కర్ణాటక సహా 14 రాష్ట్రాలు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకున్నాయి.
- ఛత్తీస్‌గఢ్ వ్యర్థాలను సేకరించడంలోనే కాదు దానిని ప్రాసెస్ చేయడంలో కూడా సమర్థవంతంగా వ్యవహరిస్తోంది. ఆ రాష్ట్రంలోని 3,217 మున్సిపల్ కౌన్సిల్ పరిధిలో ఉన్న ప్రతీ ఇంటి నుంచి రోజుకి సుమారుగా 1,650 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను సేకరిస్తోంది. వాటిలో 90 శాతాన్ని శుద్ధి చేసి ఇతర అవసరాలకు వాడుకుంటోంది.
- మధ్యప్రదేశ్ సేకరించిన వ్యర్థాల్లో 84 శాతాన్ని శుద్ధి చేస్తే, గుజరాత్ 82 శాతాన్ని శుద్ధి చేస్తోంది.
- చాలా రాష్ట్రాలు వ్యర్థాల్ని సేకరిస్తున్నప్పటికీ వాటిని శుద్ధిచేయడంలో చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదు.
- మహారాష్ట్రలో ప్రతిరోజూ 23,450 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నప్పటికీ 57 శాతం మాత్రమే ప్రాసెస్ చేస్తున్నారు.
- తమిళనాడులో 62 శాతం చెత్తను ప్రాసెస్ చేస్తూ ఉంటే అరుణాచల్‌ప్రదేశ్‌లో వ్యర్థాల ప్రాసెసింగ్ అసలు జరగడమే లేదు.



- 2022 నాటికి దేశంలో నూటికి నూరు శాతం వ్యర్థాల నిర్వహణ జరగాలని కేంద్రం లక్ష్యంగా నిర్ణయించింది.
- స్వచ్ఛభారత్ మిషన్ కింద కేంద్రం వ్యర్థాల నిర్వహణకు 5,023.96 కోట్లు కేటాయిస్తోంది.
- వ్యర్థాలను ప్రాసెస్ చేసే యూనిట్లు లేకపోవడంతో పట్టణాల్లో చెత్తలన్నీ కొండల్లా పేరుకుపోతున్నాయి.

## ఐఐటీల్లో పెరుగుతున్న ఆత్మహత్యలు

ఇండోర్: దేశంలోని 10 ఐఐటీల్లో గత అయిదేళ్లలో (2014–2019) 27 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన ప్రశ్నకు మానవ వనరుల శాఖ పరిధిలోని ఉన్నత విద్యా విభాగం సమాధానమిచ్చింది. విద్యార్థుల ఆత్మహత్యల్లో ఐఐటీ–మద్రాస్ తొలి స్థానంలో ఉందని తెలిపింది. ఐఐటీ–మద్రాస్‌లో ఈ అయిదేళ్ల కాలంలో ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు వెల్లడించింది. ఐఐటీ–ఖరగ్‌పూర్‌లో అయిదుగురు, ఐఐటీ–ఢిల్లీ, ఐఐటీ–హైదరాబాద్‌లలో ముగ్గురేసి చొప్పున విద్యార్థులు, బోంబే, గువాహటి, రూర్కీ ఐఐటీల్లో ఇద్దరేసి చొప్పున విద్యార్థులు, వారణాసి, ధన్‌బాద్, కాన్పూర్ ఐఐటీల్లో ఒక్కరు చొప్పున ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొంది. కానీ, కారణాలు మాత్రం వెల్లడించలేదు. విద్యార్థుల బలవన్మరణాలను నివారించడానికి ప్రతీ ఐఐటీలో విద్యార్థుల గ్రీవియెన్స్ విభాగాలు, క్రమశిక్షణా చర్యల కమిటీలు, కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామని వెల్లడించింది.

# మా బిడ్డలూ ఆడబిడ్డలే కదా..



మృతులకు నివాళులు అర్పిస్తున్న మందకృష్ణ మాదిగ, రాములు నాయక్ తదితరులు

**ప్రభుత్వం చంపకపోతే నేనే చంపుతా: టేకు లక్ష్మి భర్త గోపి**

**మాపై వివక్ష చూపుతున్నారా?: మానస తల్లి**

**దళితుడిని కదా.. ఎవరూ అడగరని వారి ధైర్యం: శైలజ తండ్రి వెంకట్**

**మా బిడ్డలు చనిపోయి 8 నెలలు: హాజీపూర్ బాధితులు**

**పంజగుట్ట:** దిశ ఘటన యావత్ దేశాన్నే కుదిపేసింది. ''దిశ'జరిగిన అన్యాయాన్ని మేం కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. నిందితులకు వారం రోజుల్లోనే శిక్ష విధించారు. మరి మా బిడ్డలు కూడా ఆడబిడ్డలే కదా.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. మా బిడ్డలను అతి క్రూరంగా చంపిన వారికి శిక్ష విధించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారు 'అని పలువురు బాధిత కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారి ఆవేదన వెల్లడించారు.

**అగ్రవర్ణాలు అని తెలిస్తేనే ప్రచారం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ**

దేశంలో ప్రతినిత్యం ఎక్కడోచోట మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉన్నాయని, అయితే బాధితులు అగ్రవర్ణాలు అని తెలిస్తేనే సమాజం మొత్తం రోడ్డుపైకి వచ్చేలా ప్రచారం జరుగుతోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. దేశంలో వేల సంఖ్యలో అత్యాచారాలు జరుగుతున్నా ఢిల్లీ నిర్భయ, శంషాబాద్ దిశ ఘటనలకు మాత్రమే దేశవ్యాప్త ఉద్యమాలు, పార్లమెంట్‌లో చర్చ, పేర్లు మార్చడం జరిగిందని, ఈ ఇద్దరూ అగ్రవర్ణానికి చెందిన వారే అని ఆయన పేర్కొన్నారు. దళిత మహిళ టేకు లక్ష్మి, బీసీ వర్గానికి చెందిన మానస కుటుంబాలకు న్యాయం చేయాలని, నిందితులకు శిక్ష పడాలన్న డిమాండ్లు కూడా ఎవరూ వ్యక్తం చేయకపోవడం చూస్తే ఎంత వివక్ష ఉందో అర్థమౌతుందన్నారు. ఆదివారం 'ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడిన నిందితులను త్వరగతిన కఠినంగా శిక్షించడంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ' రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. మంద కృష్ణ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ రాములునాయక్, దళిత నాయకులు జే.బీ. రాజు, బాధిత మహిళల కుటుంబ సభ్యులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ .. దిశ, నిర్భయ ఘటనల్లో వారిద్దరూ అగ్రకులం వారు అని తెలియకుండా నిందితులు వారిపై అత్యాచారం, హత్య చేశారని.. కానీ 99 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలపై వారు బలహీన వర్గాలు అని తెలిసే అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. ఎవరిని చంపితే సమాజం నుంచి స్పందన రాదో వారినే చంపేస్తున్నారని.. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బలహీనంగా ఉన్నవారు కావడంతోనే ఎన్‌కౌంటర్ చేశారన్నారు. హాజీపూర్‌లో ఓ అగ్రకులానికి చెందిన నిందితుడు శ్రీనివాస్ రెడ్డి ముగ్గురిని అత్యాచారం చేసి, హత్య చేస్తే ఇప్పటికీ శిక్ష విధించలేదన్నారు. వెంటనే ఫస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇదే విషయమై సోమవారం డీజీపీని కలవనున్నట్లు, మంగళవారం హ్యూమన్‌రైట్స్‌ను, రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి జరిగిన అత్యాచారాలన్నింటినీ వివరించి వారి కుటుంబాలను సందర్శించాలని కోరనున్నట్లు తెలిపారు. ఈ నెల 20న దిశకు ఓ న్యాయం మాకు ఒక న్యాయమా అనే నినాదంతో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్, మాజీ మంత్రి రవీంద్ర నాయక్, వివిధ సంఘాల నాయకులు సాంబన్న యాదవ్, రాజు, రాజ్‌కుమార్ నాయక్, భాస్కర్, పి.వీ.రమణ, మహేష్‌రాజ్, దీపక్ కుమార్ తదితరులు ఉన్నారు.

నేను నా భార్య టేకు లక్ష్మి చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం వెళ్లబోసుకుంటున్నాం. గత నెల 24న ఆసిఫాబాద్ జిల్లా జహినూర్ మండలంలో నా భార్యను వదిలి నేను మరో ప్రాంతంలో బెలూన్‌లు అమ్ముకునేందుకు వెళ్లాను. మధ్యాహ్నం సమయంలో కొందరు దుండగులు నా భార్యను బలవంతంగా లాక్కెళ్లి అత్యాచారం చేసి, చేతులు విరిచేసి, గొంతుపై తీవ్రగాయం చేసి చిత్ర హింసలు పెట్టి చంపారు. ఘటన జరిగిన వారం వరకు కనీసం జిల్లా వ్యాప్తంగా కూడా ప్రచారం కాలేదు. 10 రోజులకు విషయం తెలుసుకున్న మంద కృష్ణ వచ్చి నిరసన వ్యక్తం చేశారు. అప్పుడు 12వ రోజున ఎమ్మెల్యే వచ్చి పరామర్శించారు. మేము దళితులమనా మాపై ఈ వివక్ష. నా కొడుకులకు తల్లి లేకుండా పోయింది. నా జీవితమే ఆగమయ్యింది. ఆ నిందితులను కూడా చిత్రహింసలు పెట్టి చంపాలి. వారికి భూమి మీద ఉండే హక్కు లేదు. ప్రభుత్వం చంపకపోతే నేనే చంపేస్తా.

*– టేకు గోపి, ఆసిఫాబాద్.*

దిశ ఘటన జరిగే కొన్ని గంటల ముందే నా కూతురు మానస ఘటన జరిగింది. పుట్టినరోజు కావడంతో దేవాలయానికి వెళ్లి వస్తానని చెప్పి బయటికి వెళ్లి శవమై కనిపించింది. మానసను ముగ్గురు కలసి చంపారు. అత్యాచారం చేసి కాళ్లు చేతులు విరిచారు. ఇది ఒక్కడే చేసింది కాదు. ముక్కు, చెవుల నుంచి రక్తం వచ్చింది. చిత్ర హింసలు పెట్టారు. పోలీసులు మాత్రం ఒక్కరే చేశారని అరెస్టు చేశారు. మేము పేదవాళ్లమని, బలహీన వర్గానికి చెందిన వాళ్లమని మాపై వివక్ష చూపుతున్నారా?. ఇప్పటివరకు కనీసం పరామర్శించిన వారూ లేరు. ఒక తల్లికి ఒక న్యాయం, మరో తల్లికి మరో న్యాయమా?. బిడ్డల దగ్గర కులం, మతం ఏమిటి?.

*– స్వరూప, మానస తల్లి, వరంగల్*

మా ఇంటిపక్కన ఒకతను ఇల్లు కట్టుకునేందుకు భూమి చదును చేశాడు. దీంతో మా బాత్రూం గోడ కొద్దిగా కూలింది. నా కూతురు సుద్దాల శైలజ మూత్ర విసర్జనకు వెళ్లడం గమనించిన అక్కడి యువకులు ఆమెను బలవంతంగా ఎత్తుకెళ్లి, సమీపంలోని ఓ పాఠశాలలో సామూహిక అత్యాచారం చేశారు. అంతేకాదు వారు తాగిన బీర్ బాటిల్ పగలగొట్టి అతి దారుణంగా పొడిచి, బండరాయితో తలపై మోది, కాళ్లు విరిచి అతి క్రూరంగా చంపారు. 4 రోజులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఎవరో పాఠశాలలో ఒక మృతదేహం ఉంది అని చెప్పడంతో వెళ్లి చూడగా నా కూతురు. అప్పుడు పోలీసులు వచ్చి మృతదేహాన్ని తరలించారు. నెల రోజులైనా కేసు నమోదు చేయకపోవడంతో మంద కృష్ణ వచ్చి ఆందోళన చేస్తే కేసు నమోదు చేశారు. 17 నెలలు అయ్యింది ఇప్పటివరకు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నేరస్తులు యథేచ్ఛగా బయట తిరుగుతున్నారు. అంతే కాకుండా కేసు వెనక్కు తీసుకోవాలని నన్ను భయపెడుతున్నారు. దళితుడిని కదా.. ఎవరూ అడగరని వారి ధైర్యం.

*– శైలజ తండ్రి వెంకట్, రామకృష్ణాపురం, మంచిర్యాల*

మా బిడ్డలు చనిపోయి 8 నెలలు అయ్యింది. అందరూ చిన్న పిల్లలే. హాజీపూర్‌లో పాఠశాలకు వెళ్లే పిల్లల్ని ఎత్తుకెళ్లి అతి కిరాతకంగా అత్యాచారం చేసి చంపి బావిలో పూడ్చిపెట్టాడు. వాడికి ఇప్పటివరకూ ప్రభుత్వం శిక్ష విధించలేదు. నిందితుడు శ్రీనివాస్‌రెడ్డి నరరూప రాక్షసుడు. వాడికి భూమి మీద బతికే హక్కులేదు. మా పిల్లలు ఇంకా మా కళ్ల ముందే కనిపిస్తున్నారు. మీకు చేత కాకపోతే మాకు అప్పగించండి. వాడ్ని కూడా పెట్రోల్ పోసి తగలబెట్టి అదే బావిలో పూడ్చి పెడతాం.

*– హాజీపూర్ బాధితులు మనీషా తండ్రి మల్లేష్, కల్పన తండ్రి సదానందం, శ్రావణి తల్లి నాగలక్ష్మి*

## బీఆర్‌కేఆర్ భవన్‌లోకి మంత్రి కొప్పుల కార్యాలయం

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు (బీఆర్‌కేఆర్) భవన్ మొదటి అంతస్తులో రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ మంత్రి కార్యాలయాన్ని ఆదివారం ఆ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. ఉదయం 10.50 గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి కార్యాలయంలోకి వెళ్లారు. ఇకపై ఈ కార్యాలయం నుంచే కార్యకలాపాలు సాగించనున్నట్లు కొప్పుల పేర్కొన్నారు. బీఆర్‌కేఆర్ భవన్‌లో పూర్తి స్థాయి సౌకర్యాలు లేకపోవడంతో గత కొంత కాలంగా ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ మంత్రి కార్యాలయం మాసాబ్‌ట్యాంక్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవనంలో కొనసాగింది.

## మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు సన్మానం



**సాక్షి, హైదరాబాద్:** టీజీవోల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడైన శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర మంత్రి కావడం పట్ల ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ మోటార్ వెహికల్స్ డిపార్ట్‌మెంట్ టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు అశ్వాక్ అహమ్మద్ నేతృత్వంలో ప్రతినిధి బృందం ఆదివారం శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానించింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు గోవింద్, శశాంక్ అధికారి (పశ్చిమ బెంగాల్), ఆదర్శ్ సింగ్ రాఘవ్ (రాజస్తాన్), రవీంద్రసింగ్ గిల్, మనోహర్ లూత్ర (పంజాబ్)లు పాల్గొన్నారు.

## థర్డ్ జెండర్లకు రిజర్వేషన్లు కల్పించండి

**సాక్షి, న్యూఢిల్లీ:** చట్టసభల్లో థర్డ్ జెండర్లకు రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా ఆర్టికల్ 334–బీకి సవరణలు చేయాలని కోరుతూ ఎంపీ రేవంత్ రెడ్డి లోక్‌సభలో నోటీసు ఇచ్చారు. ప్రస్తుతం ఆంగ్లో ఇండియన్లకు ఉన్న రిజర్వేషన్లను రద్దు చేయాలని, ఆ రిజర్వేషన్లను థర్డ్ జెండర్‌లకు కల్పించేలా రాజ్యాంగ సవరణ చేయలని పేర్కొన్నారు.

## నేడు ఢిల్లీలో ఆదివాసీల భారీ సభ

**సాక్షి, న్యూఢిల్లీ:** లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్‌తో సోమవారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివాసీలు భారీ బహిరంగ సభ తలపెట్టారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ, అటవీ అధికారుల నుంచి దాడుల నియంత్రణ, ఎమర్జెన్సీ సమయంలో ఎలాంటి ప్రక్రియ లేకుండా ఎస్టీ జాబితాలో చేర్చిన లంబాడాలను ఆ జాబితా నుంచి తీసేయాలనే డిమాండ్‌తో ఆదివాసీల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహించనున్నారు. సభలో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచి ఆదివాసీలు ప్రత్యేక రైళ్లలో ఢిల్లీ చేరుకుంటున్నారు.

## ఎస్సీ వర్గీకరణ వద్దు: మాల మహానాడు

**సాక్షి, న్యూఢిల్లీ:** తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ చేపట్టొద్దంటూ మాల మహానాడు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆదివారం ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చెల్లదని సుప్రీంకోర్టు, జాతీయ ఎస్సీ కమిషన్ గతంలోనే తేల్చాయని, రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు కోసమే వర్గీకరణ కుట్ర చేస్తున్నాయని విమర్శించారు.

## పోలీసులు ప్రజల కోసం... టీఆర్‌ఎస్ నేతల కోసం కాదు: భట్టి



**సాక్షి, హైదరాబాద్:** పోలీసులు ప్రజల కోసం పని చేయాలి కానీ, టీఆర్‌ఎస్ నేతల కోసం కాదని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. అధికార పార్టీ నేతల ఆగడాలు రోజురోజుకూ మీరిపోతున్నా పోలీసులు వారిని నిలువరించలేకపోవడం విడ్డూరంగా ఉందని ఆదివారం ఓ ప్రకటనలో ఆయన ఆరోపించారు. బోయిన్‌పల్లిలో వాచ్‌మన్ శంకరప్ప భూమిలో ప్రహరీగోడను అనుచరులు, గూండాలతో కలసి స్థానిక టీఆర్‌ఎస్ నేత మాధవరెడ్డి కూల్చివేయడమే కాకుండా ఆయన భార్యను వివస్త్రను చేసి హింసించారని, శంకరప్పపై పెట్రోల్ పోసి నిప్పంటించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఇంతవరకు ఎవరిపైనా చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఇందుకు బాధ్యులైన టీఆర్‌ఎస్ నేతలపై చర్యలు తీసుకోవాలని భట్టి డిమాండ్ చేశారు.

## ఐఎస్‌బీ సదస్సుకు కవితకు ఆహ్వానం



**సాక్షి, హైదరాబాద్:** భారతీయ ప్రజాస్వామ్యంపై హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో జనవరి 9, 10 తేదీల్లో నిర్వహించనున్న సదస్సుకు హాజరవ్వాలని మాజీ ఎంపీ కవితకు ఆహ్వానం అందింది. ఈ కార్యక్రమంలో 'రాజకీయాల్లో ధనబలం'అనే అంశంపై కవిత ప్రసంగించనున్నారని ఆమె కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సదస్సులో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసా, సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి జలమేశ్వర్, బీజేపీ నేత రాంమాధవ్, కాంగ్రెస్ నేత జైరాం రమేశ్, సీపీఎం జాతీయ కార్యదర్శి ఏచూరి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ నారాయణ, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ తదితరులు పాల్గొననున్నారని పేర్కొంది.




# సాక్షి సాహిత్యం



నల్లగొండ | సోమవారం
డిసెంబర్ | 9 | 2019
sakshisahityam@gmail.com

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారినామ సంవత్సరం. దక్షిణాయనం, హేమంత ఋతువు. మార్గశిర మాసం. తిథి శు.ద్వాదశి ఉ.8.45 వరకు, తదుపరి త్రయోదశి. నక్షత్రం భరణి తె.4.53 వరకు(తెల్లవారితే మంగళవారం), తదుపరి కృత్తిక. వర్జ్యం ప.1.23 నుంచి 3.06 వరకు. దుర్ముహూర్తం ప.12.13 నుంచి 12.57 వరకు, తదుపరి ప.2.25 నుంచి 3.09 వరకు. అమృత ఘడియలు రా.11.41 నుంచి 1.23 వరకు.

సూర్యోదయం: 6.22 సూర్యాస్తమయం : 5.22
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు.
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

### నమాజ్ వేళలు

ఫజర్ : 5.17
జొహర్ : 12.08
అసర్ : 4.06
మగ్రీబ్ : 5.42
ఇషా : 6.59

### ఈవారం పుస్తకాలు




**ఒక అస్పృశ్యుని యుద్ధగాథ**
(స్వీయ జీవన చిత్రణ)
రచన: డాక్టర్ కత్తి పద్మారావు ; పేజీలు: 640 ; వెల: 500 ; ప్రతులకు: లోకాయత ప్రచురణలు, లుంబినీవనం, అంబేడ్కర్ కాలనీ, పొన్నూరు, గుంటూరు. ఫోన్: 9849741695

**కులం కథ** (కథల సంకలనం)
సంపాదకులు: కస్తూరి మురళీకృష్ణ, కోడీహళ్లి మురళీమోహన్ ; పేజీలు: 368 ; వెల: 250 ; ప్రతులకు: సాహితీ ప్రచురణలు, విజయవాడ-4. ఫోన్: 0866-2436642




**ఒక విప్లవమాత ఆత్మకథ**
(మరికొన్ని ఇతర కథలు)
రచన: ఎన్.వి.ఎస్.నాగభూషణ్ ; పేజీలు: 220 ; వెల: 150 ; ప్రతులకు: ఆలోచన ప్రచురణలు, 3ఎ-5-13, రైల్వే గూడ్స్‌షెడ్ రోడ్, కృష్ణానగర్, పాలకొల్లు-534260. ఫోన్: 9493474836

**తూర్పు గోదావరి జిల్లా సాహిత్య చరిత్ర** (1880-2015)
ప్రధాన సంపాదకులు: డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి ; పేజీలు: 326(ఎ 4 సైజు) ; వెల: 600 ; ప్రచురణ: రచయితల సంఘం, తూ.గో.జిల్లా ; ప్రతులకు: ఫోన్: 0884-2378586




**జగన్నాథ కథచక్రాల్**
(నూరు నవ్య వీక్లీ మొదటిపేజీ కథలు)
రచన: ఎ.ఎన్.జగన్నాథ శర్మ ; పేజీలు: 208 ; వెల: 108 ; ప్రతులకు: ఎస్.ఆర్.బుక్ లింక్స్, విజయవాడ రూరల్-520012. ఫోన్: 0866-2436959

**బాచనపల్లి**
(తెలంగాణలో 'ఒక గుట్టలకింద పల్లె')
రచన: కె.ముత్యం, కాశెట్టి స్వయంప్రకాశ్ ; పేజీలు: 94 ; వెల: 100 ; ప్రతులకు: ఎ.గంగాగౌడ్, పోస్టు: బాచనపల్లి, మండలం: భీమ్‌గల్, నిజామాబాద్ - 503307. ఫోన్: 9849373669

### జోకో ప్రపంచం

మీకు చేతకాదు కానీ, ఈ బియ్యంలో రాళ్ళు ఏరి పడేసి మీ పుస్తకంలో అచ్చుతప్పులు కూడా ఏరేస్తా. కాస్త ఆగండి!



# నిమిషంలో చదివే కథ

## వృద్ధుడు మరియు భారీ వాహనం

కథాసారం

ఇప్పుడు చెప్పబోయే కథ నిజం కాకపోవచ్చు, కానీ నిజం కాని కథల పట్ల కూడా మనం గొప్ప ఆసక్తిని కలిగుండాలి. ఎందుకంటే ఆ కథలు చెప్పే విధానం వల్ల ఒక గొప్ప వెలుగు మనలోకి ప్రసరించవచ్చు. ఎవరైనా ఇదే కథను ఒక ఐదేళ్ల కింద గనక చెప్పివుంటే దాన్ని ఈ విధంగా చెప్పేవాళ్లు:

కాళ్లకు కనీసం చెప్పులైనా లేని, చింపిరిగుడ్డలు వేసుకున్న ఒక ముసలాయన బాలటాన్ (హంగరీలోని ప్రసిద్ధ సరస్సు) నుంచి రోడ్డు మీద నడుస్తున్నాడు. కాసేపైన తర్వాత ఉన్నట్టుండి అతడు తన చేయిని ఆపమన్నట్టుగా ఊపడం మొదలుపెట్టాడు. అదే తోవలో దూరంగా ఒక భారీ వాహనమేదో వస్తూ కనబడింది. దగ్గరికి వస్తూనే ఆ భారీ వాహనం ఆగుతుంది, డ్రైవరు డోర్ తీస్తాడు.

''కామ్రేడ్(మిత్రుడు/సహచరుడు), ఎందుకు బండిని ఆపావు?'' అడిగాడు అతను.

''ఎందాకా మీ ప్రయాణం?'' ముసలాయన వాకబు చేశాడు.

''మేము దగ్గర దగ్గర బుడాపెస్ట్ దాకా వెళ్లాలి, కామ్రేడ్.''

''దయచేసి నన్ను అందులో కొంచెం ఎక్కించుకుంటారా?'' అడిగాడు ముసలాయన.

''కానీ లోపల జాగా లేదు, కామ్రేడ్,'' డ్రైవర్ జవాబిచ్చి, డోర్ మూసి, గేరు మార్చాడు.

ఈపాటికల్లా కొంత ఎండ వచ్చింది, ఆ ఎండలో నీలిరంగు సరస్సు తళుకులీనుతోంది. పొద్దుపోవడానికి మనకు మనం ఎన్నో గొప్ప కథలు చెప్పుకుంటున్నాం. ఈ కథ కూడా మళ్లీ మన మధ్యకు వచ్చింది, కాకపోతే కొత్త రూపంలో:

కాళ్లకు కనీసం చెప్పులైనా లేని, చింపిరిగుడ్డలు వేసుకున్న ఒక ముసలాయన బాలటాన్ నుంచి రోడ్డు మీద నడుస్తుండగా, అదే తోవలో ఒక భారీ వాహనమేదో వస్తూ కనబడింది. వృద్ధుడిని సమీపించగానే ఆ భారీ వాహనం ఆగుతుంది, డ్రైవర్ డోర్ తెరుస్తాడు.

''ఓ పెద్దాయనా, బుడాపెస్ట్ దిక్కేనా నువ్వు పోవడం?'' అడిగాడు అతను.

''ఔను,'' జవాబిచ్చాడు వృద్ధుడు.

''దా, ఎక్కు, నిన్ను అక్కడ దిగబెడతాం,'' స్నేహపూర్వకమైన నవ్వుతో అన్నాడు డ్రైవర్.

ముసలాయన లోపలికి ఎక్కి, కిటికీకి తల ఆనించి, నిదానంగా అడుగుతాడు:

''లోపల రేడియో ఏమీ లేదా?''

రెండు కథలూ బానేవున్నాయి, కానీ రెండూ నిజం కాదు. నిజం ఎంతవరకూ అంటే, ఆ కాళ్లకు కనీసం చెప్పులైనా లేని, చింపిరిగుడ్డలు వేసుకున్న ముసలాయన రోడ్డు మీద నడుస్తుండగా అదే తోవన ఒక భారీ వాహనం ఏదో వస్తూ కనిపించడం. కానీ దానివైపు చెయ్యెత్తి ఆపాలని ఎప్పటికీ ఆ ముసలాయనకు తోచదు, ఆ పెద్దాయన్ని చూడగానే ఆపాలని ఆ డ్రైవరుకు ఏనాటికీ అనిపించదు.

ఇదీ నిజమైన కథ. కానీ మనలో మన మాట, ఈ కథ ఆ రెండింటికంటే పెద్ద గొప్పగా ఏం లేదు.



**రెండు కథలూ బానేవున్నాయి, కానీ రెండూ నిజం కాదు. నిజం ఎంతవరకూ అంటే...**

గ్రేట్ రైటర్

ఓర్కెనీ ఇస్త్వాన్ కథ 'ది ఓల్డ్‌మాన్ అండ్ ద గ్రేట్ బిగ్ ఆటోమొబైల్' ఇది. అనువాదం: సాహిత్యం డెస్క్. ఓర్కెనీ(1912–1979) ఇరవయ్యో శతాబ్దపు ప్రసిద్ధ హంగరీ రచయితల్లో ఒకరు. కథలు, నాటకాలు రాశారు. ఒక చిన్న సందర్భంలోంచే గొప్ప సత్యాలను వెలికితీసే రచయితగా పేరొందారు. 'వన్ మినిట్ స్టోరీస్' పేరుతో ఆయన తన కథలు ప్రచురించారు. ఇవి చదవటానికి ఒక్క నిమిషమో, రెండు నిమిషాలో పట్టొచ్చుగానీ ఇవి నిమిషాల్లో మరిచిపోయే కథలు మాత్రం కావు. ద తోథ్ ఫ్యామిలీ, ద క్యాట్స్ ప్లే ఆయన పేరొందిన నాటకాలు.

ప్రపంచం తలకిందులైపోవడం అంటారే, అలాంటి అనుభవాల్ని కనీసం రెండుసార్లు భరించాడు ఓర్కెనీ. హంగరీ రాజధాని బుడాపెస్ట్‌లో ఓ యూదు కుటుంబంలో జన్మించిన ఓర్కెనీ, యుద్ధంలో సైనికుడిగా రష్యాలో పట్టుబడి, నిర్బంధ కార్మిక శిబిరంలో కొంతకాలం పాటు బంధించబడినారు. అలాగే, 1956 హంగరీ 'విప్లవం' తర్వాత ప్రచురించకుండా ప్రభుత్వం ఆయన మీద నిషేధం విధించింది. 1960ల్లో తిరిగి ఓర్కెనీ రాయడం ఆరంభించారు. కనీసం రెండు పత్రికలకు సంపాదకుడిగా పనిచేశారు.



ఓర్కెనీ ఇస్త్వాన్

తొలినాళ్లలో వీర కమ్యూనిస్టుగా ఉండి, అటుపై తప్పుదోవపట్టానని బహిరంగంగా ఒప్పుకున్నారు. జర్మన్ రచయిత ఫ్రాంజ్ కాఫ్కా, మరో ప్రసిద్ధ హంగరీ రచయిత డెజో కొస్తొలాన్యీ అంటే అభిమానం. 2004లో ఒక థియేటర్‌కు అధికారికంగా ఆయన పేరు మీదుగా ఓర్కెనీ థియేటర్ అని నామకరణం చేసింది అక్కడి ప్రభుత్వం.

లేఖా సాహిత్యం

# అలసిపొయ్యాను సార్

వేమన, బ్రౌన్, గురజాడ మీద ప్రామాణికమైన పరిశోధన చేసిన పాత్రికేయుడు, 'రీసెర్చి గెరిల్లా', 'తవ్వకప్పనిమంతుడు' బంగోరె(బండి గోపాల రెడ్డి: 1938–82) లేఖలు పుస్తకంగా వచ్చాయి. ఇందులో బుచ్చిబాబు, రాళ్లపల్లి, నార్ల, కేవీఆర్, వకుళాభరణం రామకృష్ణ, కేతు విశ్వనాథ రెడ్డి, కాత్యాయనీ విద్మహే లాంటి సాహితీ ప్రముఖులకు బంగోరె రాసిన ఉత్తరాలున్నాయి. 44 ఏళ్ల వయసులో భాక్రానంగల్‌లో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ముందు భార్యాపిల్లలను ఉద్దేశించి ఇంగ్లిష్‌లో రాసిన ఇన్‌లాండ్ లెటర్ కూడా జత చేశారు. 'ప్లీజ్ పోస్ట్ దిస్ లెటర్' అని దానిమీద ఉంది. కొన్ని నెలలుగా ఆవరించిన తీవ్రమైన ఒంటరితనం, తీవ్రమైన నిరాశావాదం, తన మేధోజీవితం అంతమైపోయిందని అనుకోవడం దీనికి కారణాలుగా చెప్పారు. చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయాక, ఢిల్లీ, హరిద్వార్, రుషికేశ్, డెహ్రాడూన్, ఛండీగఢ్‌లలో లక్ష్యం లేకుండా తిరిగానని రాశారు. 'పూర్ హజ్బెండ్'గా తనను అభివర్ణించుకున్నారు. అయితే, పుస్తకంలో సగానికి పైగా ఆక్రమించినవి ఘట్టమరాజు అశ్వత్థనారాయణ(బెంగళూరు నివాసి, స్కాలర్, హిందీ లెక్చరర్)కు రాసిన లేఖలు. అందులోంచి ఒకటి ఇక్కడ. సాహితీ వేత్త, ఆంధ్ర యూనివర్సిటీ వ్యవస్థాపక ఉపాధ్యక్షులు సర్ కట్టమంచి రామలింగారెడ్డి మీద అప్పుడు చేస్తున్న పని గురించి బంగోరె అధికంగా ఇందులో ప్రస్తావించారు. ఇంగ్లిష్ పదాలు వచ్చిన ప్రతిచోటా ఆ పదాన్ని దాదాపుగా ఇంగ్లిష్‌లోనే రాశారు బంగోరె. వాటిని మాత్రం ఇక్కడ తెలుగులోనే ఇస్తున్నాం.



**బంగోరె జాబులు**
సంపాదకులు: డాక్టర్ కాళిదాసు పురుషోత్తం, డాక్టర్ మాచవోలు శివరామప్రసాద్ ; పేజీలు: 168 ; వెల: 150 ; ప్రచురణ: సొసైటీ ఫర్ సోషల్ ఛేంజ్, నెల్లూరు. ఫోన్: 9247564044

బంగోరె
28-11-80
రాత్రి 10.40

Vemana Research Centre,
Office of the Endowments
Commissioner,
Tilak Road, Hyderabad-500001.

శ్రీ ఘట్టమరాజు గారికి,

నమస్కారాలు. హఠాత్తుగా వేమన్నను హైకోర్టు దాకా తీసుకెళ్లవల్సి వచ్చింది. గెల్చుకొని యిప్పుడే వస్తున్నాను.

నా సర్వీసెస్‌ను టెర్మినేట్ చేస్తూ (విత్ ఎఫెక్ట్ ఫ్రమ్ 30-11-80) నిన్ననే వొక వుద్వాసన ఆర్డర్ నాచేతికిచ్చాడు కమిషనర్ మహాశయుడు. నీకా అధికారం లేదు– నీ ఆర్డరు చెల్లదు అని యివాళే హైకోర్టులో లంచ్ మోషన్ మూవ్ చేయించి స్టే ఆర్డర్ తెచ్చుకొన్నాను. అంటే, ప్రస్తుతానికి నేను గెల్చినట్లే. చూద్దాం వుత్తరోత్తరా యేమవుతుందో.

యీ పరిస్థితుల్లో రీసెర్చి జరగాలి యీ దేశంలో! యింత టెన్షన్‌లో వుంటూ కూడా నిన్న రాత్రి రూముకొచ్చి 'వేమూరి విశ్వనాథ శర్మ– వేమన' వొక పేజ్ రాసి నిద్రపోయాను. యిటువంటి ఎదురుదెబ్బలు వొకటి తర్వాత వొకటి తగిలి చాలెంజెస్ యెదురవుతున్నకొద్దీ సి.ఆర్.రెడ్డి లెటర్స్ పుస్తకం వాయువేగ మనోవేగాల్లో పూర్తిచేయాలని ప్రయత్నిస్తూనే వున్నాను. యీ పరుగు పందెంలో గెలుపు బంగోరెదే వుంటుందని ఆశిస్తున్నా.

నిన్నరాత్రి– నా వద్ద వున్న మెటీరియల్స్‌ను బట్టి వి.వి.శర్మ గూర్చి నోట్సు రాశాను. యివాళ పోస్టులో వచ్చిన మీ వి.వి.శర్మ తాలూకు జిరాక్స్ కాపీ వచ్చినందుకు యెగిరి గంతేశాను. మీకు నా కృతజ్ఞతలు.

మొన్న మీరు పంపిన భీమరాజు వేమన పద్యాల కన్నడానువాదం చేరింది. దీనికీ నేనెంతో కృతజ్ఞుణ్ణి. సి.ఆర్.రెడ్డి దేవనాల అడ్రెస్ గురించి ఎన్.ఎస్.కృష్ణమూర్తికి రాశాను– మీకు పంపే యేర్పాటు చేయమని. వుంటే తప్పక పంపుతాడనే ఆశిస్తున్నాను. లైబ్రరీ పరిస్థితి యిప్పుడేమీ బాగులేదు.

అలిసిపొయ్యాను సార్– కళ్లు పూడుకుపోతున్నాయి– నిద్ర ముంచుకు వస్తున్నది.

ఢిల్లీ నుంచి (ఎన్.ఎమ్.లైబ్రరీ అండ్ మ్యూజియం) సి.ఆర్.ఆర్. ఫైల్స్ మాదిరికి 3 (జిరాక్స్ కాపీస్– మొత్తం 96 ఫైల్స్) తెప్పించానని రాశాను మీకు మొన్న జాబులో. అందులో 4 జాబులు టైప్ చేయించాను కూడా– సర్వేపల్లి రాధాకృష్ణన్ సి.ఆర్.ఆర్.కి రాసిన జాబుతో సహా, నేను తెప్పించిన ఫైల్స్ మీకు తర్వాత రాస్తాను. మీకు వచ్చిన ఫైల్స్‌లో విశేషాలేమైనా వుంటే, చేర్చతగిన జాబులేమైనా వుంటే రాయండి. పూనా నుంచి వచ్చిందేమిటి? ఏమిటో సి.ఆర్.రెడ్డి విశ్వరూపాన్ని మనం వొక పుస్తకంలో యిమడ్చడం సాధ్యమా అనిపిస్తున్నది– పుస్తకం వైశాల్యం యెక్కువయ్యే కొద్దీ– నేను పెట్టవల్సిన పెట్టుబడి కూడా పెరిగిపోతున్నది– ఆ అగ్నిపరీక్షను కూడా యెదుర్కొనాలి. పలికించెడివాడు రామభద్రుడైనట్లు సి.ఆర్.ఆర్. ఆత్మ పరుగులు తీయిస్తున్నట్లనిపిస్తుంది– అతనే అన్నీ చూసుకొంటాడని ముందుకు సాగిపోతున్నా.

(ఎన్.ఎస్. కృష్ణమూర్తి = చరిత్రకారుడు, ఇండాలజిస్ట్. వి.వి.శర్మ = వేమూరి విశ్వనాథ శర్మ, నెల్లూరుకు చెందిన కెమిస్ట్రీ లెక్చరర్. వేమనపై వ్యాసాలూ, 'రసాయన శాస్త్రం' రాశారు.)

ముందుమాట

# సాహితీ రంగులు

ఈ వ్యాసాలలో విషయం రెండు రకాలుగా ఉంటుంది. మొదటిది తాను చదివిన కొన్ని రచనలలో తాను గ్రహించిన విశేషాలను పాఠకులకు అర్థమయ్యే విధంగా చెప్పటం. రెండవది జ్ఞాపకాల పుటలలో నుంచి విలువైన వాటిని సేకరించి, మనతో పంచుకోవటం. ఇందులో ఏది చెయ్యాలన్నా ముందుగా కావలసినది సహృదయం, తన పరిసరాల మీద మమకారం, తన పరిచయాల పట్ల గౌరవం, తనను ఆకర్షించిన పాత్రల మీద అవ్యాజమైన ప్రేమ. తులసిగారిలో ఇవన్నీ సమపాళ్లలో సమృద్ధిగా ఉన్నాయని ఈ వ్యాసాలు చదవటం మొదలుపెట్టగానే గ్రహిస్తాం.

పూర్ణమ్మ గేయానికి చేసిన వ్యాఖ్య ఎంతో అర్థవంతంగా ఉంది. పూర్ణమ్మ మనసును గురజాడ ఎంత బాగా అర్థం చేసుకున్నాడో, అంత బాగాను గురజాడ మనసును తులసి గారు అర్థం చేసుకున్నారనిపిస్తుంది. ''నలుగురు కూచుని నవ్వే వేళల నా పేరొకపరి తలవండి'' అనటం, ''దీవెన వింటూ ఫక్కున నవ్వటం''– ఇవన్నీ పూర్ణమ్మ తీసుకున్న అంతిమ నిర్ణయాన్ని సూచించే సంకేతాలని తులసిగారు వివరిస్తారు. ఆమె కవితాహృదయం రావిశాస్త్రి కథల గురించి, చాసో మాస్టర్ ఆర్ట్ గురించి, పతంజలి రచనా ప్రస్థానం గురించి రాసిన వ్యాసాల్లో స్పష్టంగా వ్యక్తమౌతోంది. 'జీవితంలోంచి చాసో సిద్ధాంతాన్ని చూసాడు, సిద్ధాంతంలోంచి రావిశాస్త్రి జీవితాన్ని చూసాడు, వీటిలో ఉన్న తేడా పతంజలి చూపుకు ఆనిం'దని చెప్పటం పతంజలి రచనలకి లోతైన వ్యాఖ్యానంగా నాకు తోస్తుంది. గురజాడ సమకాలీన భారతీయ రచయితల గురించి రాసిన వ్యాసం ఎంతో విలువైన చారిత్రక సమాచారాన్ని ఇస్తుంది. పలు అనువాదాలు చేసిన రచయిత్రిగా ఇరుగు పొరుగు భాషల నుంచి వస్తున్న అనువాద రచనల్లోని లోటుపాట్లను గురించి అర్థవంతమైన చర్చ చేశారు.

రచయిత్రులకు సహజమైన, సమర్థనీయమైన స్త్రీ పక్షపాతం ఈ వ్యాసాలలో కనిపిస్తుంది. అమృతా ప్రీతమ్, కుర్రతుల్ ఇన్ హైదర్, ఆశాపూర్ణాదేవి, మహాదేవి వర్మ, కె.రామలక్ష్మి వంటి వారితోపాటు, ఒడియా సాహిత్యంలో స్త్రీవాద రచయిత్రుల రచనల గూర్చిన చర్చ ఇక్కడ చూడవచ్చు.

చాసో, నారాయణబాబు, రోణంకి, పురిపండా, ఆరుద్ర, శ్రీశ్రీ, ఉప్పల లక్ష్మణరావు మొదలైన వారి ముఖచిత్రాలను, హావభావాలను, దైనందిన జీవితంలో వారు మసలిన విధానాన్ని వారి గురించి ప్రస్తావించిన పలు వ్యాసాలు కళ్లకు కట్టినట్టుగా వివరిస్తాయి.

మౌలికంగా మార్క్సిస్టు భావజాలంతో ముడిపడిన అభ్యుదయ మార్గానికి చెందిన తులసిగారి అన్ని అభిప్రాయాలతో నాకు నూరు శాతం ఏకీభావం ఉందని చెప్పలేను. ఐతే, వ్యాసాలను చదవటానికి, అభిమానించటానికి అది అవరోధం కాదు. కారా మాష్టారి 'హింస' కథలో మూడు ప్రధాన పాత్రలూ వైఫల్యం చెందటం వల్ల ప్రయోజనం దిశగా కథ ముగియలేదని ఆవిడ అభిప్రాయపడటం అర్థం చేసుకోవచ్చు. కానీ మానవ వైఫల్యం కూడా జీవితంలో భాగమే. ఆ విధంగా ఏర్పడిన పరిస్థితులను, వాటి అనివార్యతను చిత్రించటంలోనే సహజత్వం సిద్ధిస్తుంది. కేవలం కథా ప్రయోజనం కోసం దానిని మార్చినంత మాత్రాన ఒనగూరేదేమీ ఉండదు.

◆ విన్నకోట రవిశంకర్



**రంగంటే ఇష్టం**
(సాహితీ చింతనలు)
రచన: డాక్టర్ చాగంటి తులసి ; పేజీలు: 346 ; వెల: 200 ; ప్రచురణ: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా (హ్యూస్టన్) ; రచయిత్రి ఫోన్: 9963377672

# చలం చందనం

ప్రతిధ్వనించే పుస్తకం

చలం అంత్యక్రియలకు సంబంధించిన ఈ విశేషాలు పురాణం సుబ్రహ్మణ్య శర్మ 1982లో రాసిన 'అరుణాచలంలో చలం' పుస్తకంలో ఉన్నాయి.

1979లో చలానికి 84-85 ఏళ్ల వయసులో ఆరోగ్యం క్షీణించింది. నా చావువార్తను బయటి ప్రపంచానికి తెలియనివ్వొద్దు, నాకీ పాడేగీడె కట్టి తీసుకెళ్లొద్దు, నా శవం దగ్గర భజనలూ అవీ చేయొద్దు, నేనీ ఈజీ చైర్లో ఎట్లావున్నానో అట్లా సైలెంటుగా తీసుకెళ్లండి అని కూతురు సౌరిస్‌కు సూచించారు చలం. ఎవరికీ చెప్పొద్దనడం ధర్మం కాదని సౌరిస్ అప్పుడే ఆ మాట కొట్టేసింది. చనిపోయిన తర్వాత రమణాశ్రమంలో కొందరు పాడె కడతామనీ, మేము మోసుకెళ్తామనీ అడిగినప్పటికీ సౌరిస్ ఒప్పుకోలేదు. ఈజీ చైర్లోనే పట్టుకెళ్లారు. మీద బట్ట కప్పలేదు.



స్నానం చేయించి తెల్లటి బుష్ షర్టూ, తెల్లటి లుంగీ కట్టారు. పూవులు ఆయన వద్దనలేదు కాబట్టి బుట్టలకొద్దీ తెచ్చారు. సుధ నుంచీ, వాల్మీకి రామాయణం నుంచీ శ్లోకాలను పద్యాలను గానం చేశారు. తిరువణ్ణామలై రమణస్థాన్‌కు ముప్పాతిక మైళ్ల దూరంలో ఉన్న అరుణగిరి కొండలు, యమలింగాల దేవాలయం నడుమ సామూహిక మార్నింగ్ వాక్‌లా అంత్యక్రియలు జరిగాయి.

చలానికి చాలా ప్రియమైన చెల్లెలి పిల్లల్లో ఒకరు వక్కలంక నరసింహారావు చితికి నిప్పు పెట్టారు మంచి గంధపు చెక్కతో. సౌరిస్– ''మీ ప్రేమ కొద్దీ మీరు వేసుకోండి చితిమీద'' అని అందరికీ చందనపు చెక్కలు యిప్పించింది. అంతా గంధపు చెక్కలను చితిమీద వేసారు.

ఈ చందనపు చెక్కల గురించి ఓ కథ వుంది. చలం చనిపోవడానికి 'ఏడాది ఆర్నెల్ల క్రితం' చలాన్ని చూడ్డానికి రాయలసీమ నుంచి ఒక ఆసామీ వచ్చాడు.

ఆయన వస్తూ ఓ చందనపు చెక్కను తెచ్చి ''ఇది మీకోసం తెచ్చానండీ'' అని చలానికి బహూకరించాడు. ఆయన రచయిత కాదు, పెద్ద భక్తుడు కాదు. చలం గురించి విని ఓమారు చూసిపోదామని వచ్చాడు. ఉత్తి చేతులతో రావడం ఎందుకని చందనపు కర్ర తెచ్చి సమర్పించుకున్నాడు ప్రేమతో. ''ఈశ్వరుడు నాకు అంత్యకాలం వచ్చిందని చందనం పంపించాడు'' అని చలం చమత్కరించాడట. ఆ చందనం నిజంగా అలానే ఉపయోగపడింది.

### మీకు తెలుసా?

కథారచయిత 'శ్రీరమణ' అసలు పేరు వంకమామిడి రాధాకృష్ణ. దత్తత వెళ్లిన తర్వాత అదే పేరు కామరాజు రామారావు అయ్యింది. ఆ రెండింటినీ గుర్తుపెట్టుకునే పనిలేకుండా ఆయన శ్రీరమణ అనే కలంపేరుతో ప్రసిద్ధులయ్యారు.

సాహిత్య మరమరాలు

## సెకండ్ ఎడిషన్

కథకుడు, సంపాదకుడు పురాణం సుబ్రహ్మణ్య శర్మ తన ఇద్దరు అబ్బాయిల పెళ్లిళ్లు ఒకేసారి చేశారట. పెళ్లి పత్రికలు వేయించి ఇవ్వడానికి ఒక మిత్రుని ఇంటికి వెళ్లారు. ఇవ్వడంలో కొంచెం ఆలస్యమైంది. దానికి వివరణగా– ''ఫస్ట్ ఎడిషన్ అయిపోతే మరో ఎడిషన్ వెయ్యవలసి వచ్చింది'' అని జోక్ చేశారట పురాణం. ''నా రచనల్లో ఇప్పటివరకూ సెకండ్ ఎడిషన్‌కి వచ్చింది ఈ శుభలేఖే' అని కూడా ముక్తాయించారు.




### రారండోయ్

- డాక్టర్ ఎ.ఎం.అయోధ్యారెడ్డి కథల సంపుటి 'అక్కన్నపేట రైల్వేస్టేషన్' ఆవిష్కరణ డిసెంబరు 9న సాయంత్రం 5:30కు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరగనుంది. కె.శివారెడ్డి, నందిని సిధారెడ్డి, మామిడి హరికృష్ణ, ఆడెపు లక్ష్మీపతి, కస్తూరి మురళీకృష్ణ, ఏనుగు నర్సింహారెడ్డి, కె.పి.అశోక్‌కుమార్ పాల్గొంటారు. నిర్వహణ: మంజీరా రచయితల సంఘం.
- భూపతిచంద్ర మెమోరియల్ ట్రస్టు వారి జీవన సాఫల్య పురస్కారాన్ని అంపశయ్య నవీన్‌కు డిసెంబర్ 11న సాయంత్రం 5:30కు నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ప్రదానం చేయనున్నారు. ముఖ్య అతిథి: ఘంటా చక్రపాణి. ఇందులోనే ఏలే లక్ష్మణ్‌కు సన్మానం ఉంటుంది.
- గంటి భానుమతి నవల 'తమసోమా జ్యోతిర్గమయ' ఆవిష్కరణ డిసెంబర్ 11న సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరగనుంది. ఆవిష్కర్త: కె.వి.రమణ. నిర్వహణ: పాలపిట్ట బుక్స్.
- ర్యాలిప్రసాద్ దీర్ఘకవిత 'చే గువేర' ఆవిష్కరణ డిసెంబర్ 11న సాయంత్రం 4 గంటలకు కాకినాడలోని ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో జరగనుంది. ముఖ్య అతిథి: ఆర్.నారాయణమూర్తి.
- తెలంగాణ సాహిత్య అకాడమీ నెలనెలా 'నవలా స్రవంతి'లో భాగంగా డిసెంబర్ 13న సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో సాహు, అల్లం రాజయ్య నవల 'కొమురం భీము'పై కాత్యాయనీ విద్మహే ప్రసంగిస్తారు. అధ్యక్షత: నందిని సిధారెడ్డి.
- స్వాతికుమారి బండ్లమూడి 'పదహారు గడ్డిపోచలు' పరిచయ సభ డిసెంబర్ 14న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో జరగనుంది. అఫ్సర్, మన్నెం సింధుమాధురి, రవీందర్ వీరెల్లి, ప్రసూన రవీంద్రన్, శ్రీరామ్ పుప్పాల, అనిల్ డ్యానీ పాల్గొంటారు. నిర్వహణ: ఛాయ.
- ముకుంద రామారావు 'అదే నేల' పుస్తక పరిచయ సభ డిసెంబర్ 15న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో జరగనుంది. నిర్వహణ: 'ఛాయ'.
- ఆటా (అమెరికా తెలుగు అసోసియేషన్) అంతర్జాతీయ సాహితీ సదస్సు డిసెంబర్ 14న ఉదయం 9:30 నుండి సాయంత్రం 6 వరకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరగనుంది. ముందు తరాల సాహితీవేత్తలతో సంభాషణ ; నవ కవి సమ్మేళనం ; ఇప్పటి కథకుల ఆలోచనలు, అనుభవాలు ; పద్యం, పాట, జానపదం అనే నాలుగు విభాగాలుగా ఈ సదస్సు జరుగుతుంది. ఆటా లిటెరరీ కమిటీ అధ్యక్షత: రవీందర్ వీరెల్లి.
- 'నెలనెలా వెన్నెల' సాహిత్య కార్యక్రమం డిసెంబర్ 14న సాయంత్రం 5 గంటలకు ఎన్.బి.టి. హాల్, ఆంధ్ర మహిళా సభ, ఉస్మానియా యూనివర్సిటీలో జరుగనుంది. నిర్వహణ: తెలంగాణ చైతన్య సాహితి.
- తెలుగెత్తి జైకొట్టు: శతాధిక సాహితీవేత్తల జీవితం–సాహిత్యంపై తెలంగాణ సాహితి డిసెంబర్ 14–16 వరకు మూడ్రోజుల సదస్సు నిర్వహించనుంది. ముఖ్య అతిథి: హిందీ కవి మంగలేష్ దబ్రాల్. తెలుగెత్తి జైకొట్టు పుస్తకావిష్కర్త: కె.శివారెడ్డి.
- కవి, అనువాదకుడు, నాటక రచయిత, పాత్రికేయుడు రెంటాల గోపాలకృష్ణ (1920 – 1995) శత జయంతి సభ డిసెంబర్ 15న ఉదయం పదిన్నరకు హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో జరగనుంది. కె.శ్రీనివాస్, బి.నర్సింగరావు, తెలకపల్లి రవి, అఫ్సర్, కె.పి.అశోక్‌కుమార్, ఆదిత్య కొర్రపాటి మాట్లాడుతారు. నిర్వహణ: 'ఛాయ' మరియు రెంటాల స్మరణోత్సవ సంఘం.



- డాక్టర్ రమణ యశస్వి 'భలే మంచిరోజు' (న్యూమరిక్కులు) ఆవిష్కరణ డిసెంబర్ 14న ఉదయం 10:30కు గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో జరగనుంది. ఆవిష్కర్త: కొలకలూరి ఇనాక్. నిర్వహణ: నవ్యాంధ్ర రచయితల సంఘం.
- రామా చంద్రమౌళి సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాది జూకంటి జగన్నాథంకు ప్రదానం చేయనున్నారు. అవార్డు కింద పదిహేను వేల నగదు ఇస్తారు. డిసెంబర్ 15న ఉదయం 10:30కు హన్మకొండలోని వాగ్దేవి డిగ్రీ మరియు పీజీ కళాశాలలో జరిగే ఈ కార్యక్రమంలో బి.ఎస్.రాములు, కె.పురుషోత్తం, నలిమెల భాస్కర్ పాల్గొంటారు.
- కొలకలూరి విశ్రాంతమ్మ 2020 పురస్కారాన్ని నవలకూ, కొలకలూరి భాగీరథి 2020 పురస్కారాన్ని కథానికకూ ఇవ్వనున్నారు. విడివిడిగా పురస్కార నగదు రూ.15 వేలు. 2017–19 వరకు ముద్రితమైన నవల, కథల సంపుటాల మూడు ప్రతులను జనవరి 12లోగా పంపాలి. ఫలితాలు ఫిబ్రవరి 12న. ప్రదానం ఫిబ్రవరి 26న తెలుగు విశ్వవిద్యాలయంలో. చిరునామా–నవలలకు: డాక్టర్ కొలకలూరి సుమకిరణ్, ప్రొఫెసర్, ఆంగ్ల శాఖ, ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి–517502. కథల సంపుటాలకు– ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆంధ్రాచార్యులు, తెలుగు శాఖ, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం ॥ 9-12-2019


భయపెడతా


రెండు జంటలు
– సినిమా పేజీలో

మోత బరువు

# లేనిపోని ధైర్యాలు

'పిల్లని ధైర్యంగా పెంచకపోతే ఎలా?' అంటారు! పిల్ల హాయిగా పెరగాలి గానీ, ధైర్యంగా పెరగడం ఏంటి?

● మాధవ్ శింగరాజు

**అం**దరూ ధైర్యస్తులే ఉండరు. అసలు ధైర్యంగా ఉండాల్సిన ఖర్మేమిటి ఆడపిల్లకు?! ధైర్యం ఎక్స్‌ట్రా లగేజ్. కాళ్లుచేతులు ఫ్రీగా కదిలే వీలు లేకుండా! నా కూతురికి స్కూల్ బ్యాగే ఎక్స్‌ట్రా లగేజ్ అని నేను అనుకుంటుంటే మీరంతా వచ్చి, బుక్స్‌తో పాటు ధైర్యాన్ని కూడా బ్యాగ్‌లో పెట్టి పంపు అని చెప్పడం ఏంటి? స్కూల్ బ్యాగ్‌లో బుక్స్ ఉండాలి. అందులో ధైర్యానికేం పని? పిడికిలి బిగించి, ఒక పంచ్ ఇవ్వగలిగిన ధైర్యం అనే బలం కూడా ఉండాలి నీ కూతురి చేతులకు అంటారు మీరు! పదీపన్నెండేళ్ల పిల్ల, పోనీ పద్దెనిమిదేళ్ల పిల్ల.. చేతి గోళ్లను చక్కగా ట్రిమ్ చేసుకుని డ్రెస్‌కి మ్యాచింగ్‌గా గోళ్ల రంగు వేసుకుని పెదనాన్న కూతురి ఫంక్షన్‌లో చూపించుకోవాలని ఉండదా తనకు! ఎవడికైనా డొక్కలో ఒక్కటిచ్చేందుకు నకుల్స్‌ని పొజిషన్‌లోకి తీసుకోవడం ఎలా అని థింక్ చెయ్యడానికి తనకేం పట్టిన దౌర్భాగ్యం? ఆఫీస్ వర్క్‌లో టార్గెట్ రీచ్ అయినందుకు వస్తున్న బోనస్‌తో తనకు ఇష్టమైనవాళ్లకు ఏమిచ్చి సర్‌ప్రైజ్ చెయ్యాలో ఆలోచనలు ఉండవా తనకు! టోల్ గేట్ దగ్గర పగిలిన ఏ ఖాళీ సీసాపై కాలు పడుతుందోనని స్ట్రెస్ ఫీల్ అవుతూ ఆ ప్రమాదం నుంచి బయటపడేందుకు మనసులోనే స్కెచ్ వేసుకుంటూ నిద్ర లేవడానికి తనకేంటి అంత దిక్కుమాలినతనం?

> ఆపదలో ఉన్న అమ్మాయి వెంట ధైర్యం ఎంత తోడుగా ఉంటుందో.. మనం చేసే ఈ సంస్కారవంతమైన నామకరణలు, మన ధర్మాగ్రహ వ్యక్తీకరణలు ఆపదలో పడబోయే అమ్మాయిలకు అంతకుమించి తోడుగా ఉండబోయేదేమైనా ఉంటే మంచిదే.

న్యాయం వెతుకుతున్న రెండు కాగడాలే. ఎవరు చేయాల్సింది వారు చేశారు. ఎవరు చెప్పగలిగింది వారు చెప్పారు. చట్టం 'సీన్ ఆఫ్ అఫెన్స్' గుర్తుకు రాకుండా ప్రియాంక పేరుపై 'దిశ' అనే గుడ్డను కప్పేసింది. ఏడేళ్ల క్రితం జ్యోతీసింగ్‌పై 'నిర్భయ'ను కప్పినట్లు. మృతురాలికి, ఆమె కుటుంబానికి రెస్పెక్ట్ ఇవ్వడానికే కావచ్చు.. నిజంగా ఆ పేర్లు ఉన్న అమ్మాయిల రెస్పెక్ట్ మాటేమిటనే ఆలోచనను కూడా రానివ్వని మూడ్‌లోకి వెళ్లిపోయింది దేశం. ఆపదలో ఉన్న అమ్మాయి వెంట ధైర్యం ఎంత తోడుగా


ఇలా కదా తను ఉండాల్సింది!

గోళ్ల రంగే కాదు, రాబోయే బోనసే కాదు.. ఇంకా ఏవో ఉంటాయి తన లోకంలో. అన్నీ అందమైనవి. సున్నితమైనవి. భవిష్యత్తును చక్కగా అల్లుకుని జీవితానికి జడగా వేసుకుంటూ ఉన్నవి. తన ఇల్లు, తన స్కూలు, ఇంటి నుంచి స్కూలుకు వెళ్లొచ్చే తన దారి.. దారి కూడా తనదే కదా. ఇంట్లో ఉండటానికి ధైర్యం అక్కర్లేదు. స్కూల్లో ఉండటానికి ధైర్యం అక్కర్లేదు. మధ్య దారిలో ఈ ధైర్యం నస ఏమిటి? ధైర్యాన్ని నూరి పోయడానికి చుట్టూ ఇంతమంది కల్వంలో పంచ్‌లు, పిన్నులు, పెప్పర్ స్ప్రేలు నూరుతూ కూర్చోవడం ఏమిటి నా కూతురికి ఇవ్వడానికి! నాజూకుగా ఉంటాయి తన చేతులు. నోట్‌బుక్కులు రెండెక్కువైతేనే ఆ రోజంతా చేతులు గుంజేస్తాయి. మీరేమో పిడికిలి బిగించమంటారు. మృదువుగా ఉంటుంది తన మనసు. బొద్దింకల మీదికి స్ప్రే కొడుతుంటేనే.. 'పాపం.. నాన్నా..' అని కళ్లు మూసుకుంటుంది. మీరేమో బండెడన్నం తినే రాక్షసుడి మీద తననే పెప్పర్ స్ప్రే కొట్టమంటారు. 'పిల్లని ధైర్యంగా పెంచకపోతే ఎలా?' అంటారు. పిల్ల హాయిగా పెరగాలి గానీ, ధైర్యంగా పెరగడం ఏంటి?

ధైర్యంగా ఉండాల్సొస్తుందని ఏమాత్రం అనుకోని ఒక కూతురు.. ధైర్యం గురించి ఆలోచించడానికే భయపడిన ఒక కూతురు.. తన లోపలి ధైర్యం కన్నా, బయట ప్రపంచంలోని మంచినే ఎక్కువగా నమ్ముకున్న కూతురు.. తన నమ్మకానికే కదా తను ఆహుతైపోయింది! ధైర్యం లేకపోయినందుకా?! 'నిర్భయ' దెబ్బకి కూడా దేశం ఇంతగా సొమ్మసిల్లిపోలేదు. బహుశా 'దిశ' తన ఫోన్‌లోంచి చెల్లితో మాట్లాడిన చివరి మాటల్లోని.. 'నాకు భయం అవుతోంది పాపా..' అన్న మాటే మళ్లీ మళ్లీ గుర్తొచ్చి దేశానికి నిద్ర పట్టకుండా చేస్తుండవచ్చు. 'దిశ' నిందితుల్ని ఎన్‌కౌంటర్ చేయకముందు వరకు ప్రతి రెండు కళ్లూ మౌనంగా వెలిగిన రెండు కొవ్వొత్తులే. ప్రతి రెండు చేతులూ దిశ కు ఉంటుందో మనం చేసే ఈ సంస్కారవంతమైన నామకరణలు, మన ధర్మాగ్రహ వ్యక్తీకరణలు.. ఆపదలో పడబోయే అమ్మాయిలకు అంతకుమించి తోడుగా ఉండబోయేదేమైనా ఉంటే మంచిదే.

'దిశ' ఘటన తర్వాత దేశంలోని కొన్ని రాష్ట్రాల పోలీసు శాఖలు.. రాత్రి తొమ్మిది – ఉదయం ఆరు మధ్య బయట చిక్కుకుపోయిన మహిళల్ని క్షేమంగా ఇంటికి చేర్చే బాధ్యతను తీసుకున్నాయి. 'మేమున్నాం' అని ధైర్యం చెప్పడం కోసం. బాధితురాలు ఎక్కడ కంప్లయింట్ చేసినా 'ఇది మా పరిధిలోకి రాదు' అనకుండా అక్కడికక్కడే కేసు నమోదు చేసుకునేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'జీరో ఎఫ్.ఐ.ఆర్.'ను అమల్లోకి తెచ్చింది. 'మేమున్నాం' అని ధైర్యం చెప్పడం కోసం. గ్రామాల్లో జులాయిల వివరాలు సేకరిస్తున్నారు తెలంగాణ పోలీసులు. 'మేమున్నాం' అని ధైర్యం చెప్పడం కోసం. దేశవ్యాప్తంగా మహిళల రక్షణపై ఉన్నతస్థాయి సమీక్షలు చేస్తున్నాయి హోమ్ శాఖలు. 'మేమున్నాం' అని ధైర్యం చెప్పడం కోసం. ఆఖరికి దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కూడా జరిగింది. అదీ 'మేమున్నాం' అని ధైర్యం చెప్పడం కోసమే కావచ్చు!

నా కూతురి చుట్టూ ఇంత ధైర్యం ఉన్నప్పుడు నా కూతురెందుకు పనిగట్టుకుని మరీ మళ్లీ ధైర్యంగా ఉండాలి. తన చిరునవ్వుల్లో తనుండటం మాని, తన ఊహలతో తను గుసగుసలాడటం మాని, తన క్లాస్‌లోని ఫస్ట్ ర్యాంకర్‌తో తను పోటీ పడటం మాని, తనెంతో ఇష్టంగా చేరిన వర్క్‌లో.. ఉద్యోగంలో మనసు పెట్టడం మాని.. ఇవన్నీ మాని.. ధైర్యంగా ఉండటం కోసం నా కూతురెందుకు తన మైండ్‌ని, తన బాడీని ధైర్యం అనే మందుగుండు సామగ్రితో నింపుకుని బయటికి అడుగు పెట్టే ప్రతిసారీ అంతా సవ్యంగా ఉందా లేదా అని బొట్టునో, బట్టల్నో చూసుకున్నట్లు అద్దమెందుకు చూసుకోవాలి?!

# షీ రాక్ టీమ్

రాక్ బ్యాండ్ అనగానే వాయిద్య పరికరాలతో స్టైలిష్‌గా అబ్బాయిలు కళ్లముందు నిలిస్తే నిలిచారు గానీ.. ఉత్తరప్రదేశ్‌కి చెందిన జయ తివారీ 'మేరీ జిందగీ' పేరుతో తొమ్మిదేళ్ల క్రితమే మహిళా రాక్ బ్యాండ్‌ను ఏర్పాటు చేశారు. జయతో పాటు మరో నలుగురు బృందంగా కలిశారు. మహిళల సమస్యల మీద మహిళలే సాహిత్యాన్ని సంగీతంతో జత కలిపి జయహో అనిపిస్తున్నారు. దేశంలోనే మొట్టమొదటి మహిళా మిషన్ బ్యాండ్‌గా పేరొందిన ఈ షీ రాక్ టీమ్ త్వరలోనే దేశవ్యాప్తంగా ప్రదర్శనలు ఇవ్వబోతోంది.


'మేరీ జిందగీ' రాక్ బ్యాండ్ వ్యవస్థాపకురాలు జయా తివారి (మధ్యలో), బృంద సభ్యులు

**మ**హిళల సామాజిక సమస్యలపై జయ బృందం సంధిస్తోన్న అస్త్రం 'మేరీ జిందగీ'. రాక్ సాంగ్స్‌తో ప్రజల్లో చైతన్యం తెస్తోంది. 'మేం పాట ద్వారా చూపే సమస్యలు మహిళలనే కాదు, మగవారినీ ప్రభావితం చేస్తాయి. అందుకే మా బృందానికి చాలా మంది పురుష మద్దతుదారులూ ఉన్నారు. మా బృందం ఆశయం లింగసమానత్వం ఒక్కటే కాదు. అణచివేతలను సమాజంలోంచి పూర్తిగా తొలగించడం కూడా' అంటోంది ఈ రాక్ బ్యాండ్. ఇందులోని వారంతా సాధారణ మధ్యతరగతి మహిళలే. తెల్లవారుఝామునే మేల్కొని ఉదయం ఏడున్నర లోపు తమ రాక్‌బాండ్ సెషన్‌ను ముగించుకుంటారు. ఆ తర్వాత ఉద్యోగాలు, కాలేజీలంటూ ఎవరి పనుల్లో వాళ్లు పరిగెడతారు.

### రాక్‌తో షేక్

ఉన్న సమయంలోనే తమ కోసం కొంత కేటాయించుకొని రాక్‌బ్యాండ్‌తో పాటకు ప్రాణం పోస్తారు జయ అండ్ కో. ఆ పాటలు ఫేస్‌బుక్, యూట్యూబ్ ద్వారా రిలీజై అత్యంత ప్రజాదరణను పొందుతున్నాయి. 'మైరి మేరా బైహ్ నా రాచన...' అనే పాటలో కూతుళ్లు పెరిగే దశలోనే పెళ్లి అనకుండా వారి కలలకు అవకాశం ఇవ్వమని తల్లులను తమ పల్లవులతో అడుగుతారు. 'డ్రీమింగ్ కే ప్రెజర్ కుక్కర్ కి సీటీ కో బజ్నే దో..' అనే పాట అమ్మాయిలను తమను తాము నమ్ముకోమని చెబుతుంది. భ్రూణ హత్యలపై 'తేరి గాలియోన్ మెయిన్ నా అయేంగే కబీ ఈజ్ రాత్ కే బాద్, మా, మేరీ మా..' అనే వారి హృదయ స్పందన విపరీతంగా వైరల్ అయ్యింది. ఈ పాట మహిళా సాధికారత కోసం పనిచేస్తున్న రాష్ట్ర మహిళా సమాఖ్య, యునిసెఫ్, బిబిసి మీడియా యాక్షన్, బ్రేక్ త్రూ, వాటర్ ఎయిడ్ ఇండియా.. వంటి సంస్థల నుండి ఆహ్వానాలు అందుకునేలా చేసింది. ఈ ప్రోత్సాహంతో 'మేరీ జిందగీ' త్వరలోనే దేశవ్యాప్త ప్రదర్శనలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది.

### వంట గిన్నెలే వాయిద్యాలు!

సంగీతం అంటే ప్రాణం పెట్టే నిహారికా దుబే జయ బృందంలో ఒకరు. ''మొదట్లో నేను జయను కలిసినప్పుడు చాలా ఆశ్చర్యంగా ఉండేది. మ్యూజిక్ నేర్చుకునేవారంతా బాలికలే. కానీ, ఒకే ఒక్క గిటార్ ఉండేది. మ్యూజిక్ క్లాస్‌కు వచ్చే వారంతా స్పూన్లు, గిన్నెలు, గ్లాసులు, ప్లేట్లు, పట్టుకారు.. ఇలాంటి వాటితోనే ప్రాక్టీస్ చేసేవాళ్లం. కానీ అమ్మాయిలెవరూ ఒక్క రోజు కూడా క్లాస్ మిస్ చేసేవాళ్లు కాదు. పార్కుల్లోనూ ప్రాక్టీస్ ఉండేది. నెమ్మదిగా ప్రజలు మా బృందాన్ని గమనించడం ప్రారంభించారు'' అని చెబుతుంది నిహారిక.

### మొదటన్నీ ఖాళీ కుర్చీలే

2010లో లక్నోలో మొదటిసారి జయ ఈ రాక్ బ్యాండ్‌ను ప్రారంభించినప్పుడు.. ఎవరూ దీనిని పట్టించుకోలేదు. ప్రదర్శనకు ప్రేక్షకులను రాబట్టడమే పెద్ద కష్టమైందని అంటారు ఆమె. ''ఖాళీ కుర్చీలు మమ్మల్ని వెక్కిరించేవి. చాలా బాధగా అనిపించేది. బాధ్యతను భుజానికెత్తుకున్నప్పుడు అది ఎంత బరువైనా దించకూడదు అనుకున్నాం. బ్యాండ్‌కు అవసరమైన పరికరాలను కొనుగోలు చేయడానికి డబ్బు లేదు. కానీ, మేం మా ఆశను కోల్పోలేదు. ఒక్కో వాయిద్య పరికరాన్ని కొనుగోలు చేసుకుంటూ వచ్చాం. తొమ్మిదేళ్లుగా మేం చేసిన ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. ఇప్పుడు మహిళా విద్య, సమానత్వం, గృహహింస, భ్రూణ హత్యలను పాటలుగా ఎలుగెత్తి పాడే ఏకైక రాక్ బ్యాండ్ 'మేరీ జిందగీ' అయినందుకు చెప్పలేనంత సంతోషంగా ఉన్నాం'' అంటారు జయ తివారి. సంగీతంలో పీహెచ్‌డీ చేసిన జయ ఐదేళ్లుగా రేడియో జాకీగానూ కొనసాగుతున్నారు.

తొలినాళ్లలో ఇంటి మేడ పైనే సృజనాత్మక చర్చలు : 'మేరీ జిందగీ' టీమ్


### బాలికల విద్యకు సహకారం

''ఇంతవరకు ఇలా మహిళల కోసం పనిచేసే బృందం నాకు మరొకటి కనిపించలేదు. మహిళల కోసం మహిళలే కదిలే ఈ బృందంతో కలిసి పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను'' అంటోంది పదిహేడేళ్ల అనామిక ఝుంఝున్‌వాలా. అత్యంత పిన్నవయస్కురాలైన డ్రమ్మర్‌గా అనామిక పేరొందింది. అనామిక ఎనిమిదేళ్ల వయసు నుంచి ఈ బృందంతో కలిసి డ్రమ్స్ వాయిస్తోంది. గిటారిస్ట్ పూర్వి మాల్వియా, గాయకురాలు సౌభాగ్య, స్వస్తిక వంటి ఇతర సంగీతకారులూ ఈ బృందంలో ఉన్నారు. ఈ ముగ్గురూ ఇటీవలే పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో చేరారు. అయినా 'మేరీ జిందగీ' బృందంలో కొనసాగుతున్నారు.

ఇప్పటి వరకు ఉత్తరప్రదేశ్ మహిళా పోలీసు విభాగానికి 70 పాటలను కంపోజ్ చేసింది ఈ షి రాక్ బ్యాండ్. రాక్ బ్యాండ్ షోస్ ద్వారా వచ్చే డబ్బుతో వీరు నిరుపేద బాలికల విద్యకు సహకారాన్ని అందిస్తున్నారు.

''మహిళా లోకాన్ని జాగృతం చేయగలం అనే నమ్మకాన్ని ఈ బ్యాండ్ మాకు కలిగించింది. ఇక ఇదే మా జీవితం అంటోంది'' దృఢంగా ఈ సంగీత, సాహిత్య, సంఘహిత బృంద సభ్యులు.

– ఆరెన్నార్

చెట్టు నీడ

# ఆనాడే చెప్పాడు!

కరువు నుండి తప్పించుకోవడానికి ఐగుప్తుకొచ్చిన డెబ్బై – డెబ్బై ఐదు మంది యాకోబు వారసులు ఐగుప్తులోనే నాలుగు శతాబ్దాలకు పైగా ఉన్నారు కాని బానిసల స్థాయికి దిగజారారు. అపుడు దేవుడు మోషే నాయకుడు గా వారిని దాస్య విముక్తులను చేసి, వారికి వాగ్దానంగా తానివ్వ జూపిన కనానుకు.. అంటే ఈనాటి ఇశ్రాయెల్ దేశానికి.. అరణ్యమార్గాన నడిపించాడు. ఈ అరణ్యమార్గ ప్రస్థానం వారి విశ్వాస జీవితంలో అత్యంత కీలకమైనది. ఎందుకంటే ఆ నాలుగు శతాబ్దాలలో దేవుని ప్రజలు, యేసుప్రభువు ఆగమనం కోసం దేవుడు తమను ఒక విత్తనం లాగా ప్రత్యేకించిన జన సమూహమని మర్చిపోయి, అన్నిరకాల అవలక్షణాలున్న ఐగుప్తు ప్రజల్లాగే మారిపోయారు. అందువల్ల దేవుడు తనదైన ఆత్మీయ క్రమశిక్షణను నేర్పి, వారిని సంస్కరించి, కార్యోన్ముఖుల్ని చేయడానికి నియోగించిన పాఠశాల ఆ అరణ్యమైతే, దానికి ప్రధాన అధ్యాపకులు మోషే. అక్కడే దేవుడు వారికి తన విధివిధానాలతో కూడిన ధర్మశాస్త్రాన్నిచ్చాడు, ఒక ప్రత్యక్ష గుడారాన్నిచ్చి ఒక జన సమూహంగా ఆరాధించడం నేర్పించాడు.


ఆకాశ ధాన్యం

'మన్నా' అనే ఆకాశ ధాన్యం కురిపించి ప్రతి రోజూ తానే పోషించాడు, బండల నుండి ఉబికిన నీళ్లతో వారి దాహం తీర్చాడు. పగలు మేఘస్తంభాన్ని, రాత్రిళ్లు అగ్నిస్తంభాన్నిచ్చి వారి సుఖజీవనం కోసం మొత్తం అరణ్యాన్ని సమ శీతోష్ణం చేశాడు. దేవుడు ఇంతగా చేస్తే ఈ పాఠశాల చదువులో ఐగుప్తు నుండి వచ్చిన యెహోషువ, కాలేబు తప్ప మిగిలిన లక్షలాది మందిలో ఎవరూ ఉత్తీర్ణులు కాలేకపోయారు. ఐగుప్తు కాలుష్యమంతా సమసిపోగా అరణ్యకాలంలో పుట్టిన కొత్త ఇశ్రాయేలు తరాన్ని దేవుడు మోషే, ఆ తర్వాత యెహోషువ నాయకత్వంలో కనానులో ప్రవేశపెట్టి ఆ దేశంలో వారికి స్వాస్థ్య భూభాగాల నివ్వగా, ఆ విధంగా రక్షకుడుగా యేసుక్రీస్తు రావలసిన కాలం సమీపమయ్యింది, ఆయన ఆగమన మార్గం సుగమమయ్యింది. యేసుక్రీస్తు ఆగమన సువార్తకు చెందిన బేత్లెహేము జననం, కల్వరిలో సిలువ ప్రయాణం వంటి చాలా విశేషాల్ని దేవుడు ఇశ్రాయేలీయులకు కనాను వాసానంతరమే స్పష్టం చేశాడు.

– డా. వివేచనా డానియేల్

బ్యూటిప్స్

# చుండ్రుకు ఉసిరి



కాలానికి తగ్గట్టు వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రకృతి కొన్ని వరాల ఔషధాలను కూడా ఇచ్చింది. వాటిలో ప్రధానమైంది ఉసిరి. ఈ కాలంలో మనల్ని విసిగించే చుండ్రు సమస్యను ఉసిరితో తేలిగ్గా పరిష్కరించుకోవచ్చని ప్రకృతి వైద్యులు చెబుతున్నారు.

- రాత్రిపూట ఉసిరి ముక్కలు లేదా ఉసిరి పొడి నీళ్లలో వేసి నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం ఆ నీటిని మాడుకు పట్టించి, జుట్టును తడపాలి. పదినిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. దీని వల్ల చుండ్రు సమస్య తగ్గుతుంది.
- ఉసిరి రసంలో కొన్ని చుక్కల బాదం నూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని రాత్రి పడుకోబోయేముందు తలకు రాసుకోవాలి. దీని వల్ల వెంట్రుకలు రాలడం, చుండ్రు తగ్గుతుంది.
- ఎండిన ఉసిరి ముక్కలను కొబ్బరినూనెలో వేసి బాగా మరిగించాలి. చల్లారిన తర్వాత ఈ నూనెతో మాడుకు మసాజ్ చేసుకోవాలి. రోజూ ఈ విధంగా చేస్తూ ఉంటే చిన్నతనంలో వచ్చే తెల్ల జుట్టు నల్లబడే అవకాశాలు ఎక్కువ. చుండ్రు కూడా తగ్గుతుంది.



డైన్ మిక్ స్టోరీ

# అమ్మమ్మ పరిచిన విస్తరి


నీల్జా వాంగ్‌మో

**నలభై ఏళ్ల కశ్మీరీ మహిళ నీల్జాకి జీవితం వడ్డించిన విస్తరి ఏమీ కాదు. ప్రతి ఆకును ఏరి తెచ్చి కుట్టుకుని, తిండి గింజల్ని మోసుకొచ్చి స్వయంగా వండి వార్చి వడ్డించుకున్న విస్తరి. 'ఆల్చి కిచెన్' పేరుతో ఆమె 2016లో స్థాపించిన రెస్టారెంట్ మూడేళ్లలో మూడు బ్రాంచ్‌లకు విస్తరించింది. ఇక లధాక్ దాటి ముంబయి, ఢిల్లీలకు విస్తరించడమే తరువాయి. అమ్మమ్మ దగ్గర నేర్చుకున్న వంటలే ఆమె ఆహార వ్యాపారానికి ఆవిరి పట్టు అయ్యాయి!**

**ఆ**ల్చి మొనాస్ట్రీ ప్రముఖ బౌద్ధక్షేత్రం, ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం కూడా. ఇది లధాక్ రాష్ట్ర రాజధాని లేహ్ నగరానికి 66 కిమీల దూరంలో ఉంది. అలాంటి చోట ఒక పెద్ద వంటగది స్థాయిలో చిన్న రెస్టారెంట్‌ను ప్రారంభించింది నీల్జా. ఆల్చి ప్రజలు రోజూ చేసుకునే సంప్రదాయ వంటకాలు, స్థానికులు మర్చిపోతున్న రుచులతో రెస్టారెంట్ పెట్టాలనే ఆమె ఆలోచనకు ఒక్క ఓటు కూడా పడలేదు. 'మనవాళ్లే మన వంటకాలను మానేసి టీవీలు చూసి కొత్త వంటలు వండుకుంటున్నారు, ఇప్పుడు మన వంటలతో వ్యాపారం మొదలు పెడితే లొట్టలు వేసుకుంటూ తినేదెవ్వరు?' అని స్నేహితులు, బంధువులు కూడా భయపెట్టారు. వాళ్ల అమ్మ అయితే 'ఈ ప్రయత్నం మనల్ని గట్టెక్కిస్తుందంటావా' అని దీనంగా అడిగింది. 'గట్టెక్కి తీరుతాం అన్నది' నీల్జా ధీమాగా.

### పర్యాటకులే లక్ష్యం

లధాక్ వాసుల జీవనం అత్యంత క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల్లో సాగుతుంది. వారి ఆహారపు అలవాట్లు కూడా వాతావరణానికి అనుగుణంగానే ఉంటాయి. బార్లీ, బక్ వీట్, మిల్లెట్ ప్రధాన ఆహారం. బక్‌వీట్ గోధుమ గింజలకంటే చిన్నవిగా బార్లీ గింజలకంటే పెద్దవిగా ఉంటాయి. దేహంలో వేడిని నిలుపుతాయి. కాబట్టి పర్యాటకులు లధాక్ వాతావరణంలో పర్యటన కాలమంతా ఆరోగ్యంగా ఉండాలంటే స్థానిక ఆహారం రోజులో ఒక్కసారయినా తింటే మంచిది. ఆక్రోటు గింజల చట్నీ, బ్రెడ్‌లో మాంసాన్ని స్టఫ్ చేసిన 'ఖాంబిర్', ఇటాలియన్ పాస్తాను పోలిన 'చుతాగి' వంటి వాటిని నీల్జా తన మెనూలో చేర్చారు. ఆల్చిలో ఇతర రెస్టారెంట్‌ల వాళ్లు కూడా లధాకీ ఆహారాన్ని ఇస్తున్నప్పటికీ, నీల్జా రెస్టారెంట్‌కి ఆదరణ పెరగడానికి కారణం కామన్‌గా కొన్ని లధాకీయేతర వంటకాలను కూడా అందుబాటులో ఉంచగలగడం. అలాగే పర్యాటకులు అలసిపోకుండా ఉండడానికి మెనూలో మిల్లెట్ డ్రింక్ ఉండడం! రోజుకు వంద మంది వరకు మాత్రమే వస్తున్నప్పటికీ వంట నుంచి ప్రతిదీ స్వయంగా పర్యవేక్షించడమే తన విజయ రహస్యం అంటారు నీల్జా.

### నాకున్న ధైర్యం ఒక్కటే

బ్యాంకు నుంచి చిన్న మొత్తం లోన్ తీసుకుని ఇంటి ఆవరణలోనే రెస్టారెంట్‌లా ప్రారంభించాను. చదువుకుంటున్న రోజుల్లో టూరిస్ట్ గైడ్‌గా పార్ట్ టైమ్ ఉద్యోగం చేశాను. పర్యాటకులు ఏ ప్రాంతానికి వెళ్తే అక్కడి వంటకాలను రుచి చూడడానికి ఆసక్తి చూపిస్తారని తెలిసింది. మంచి రెస్టారెంట్ పెట్టాలనే కోరిక అప్పటి నుంచి ఉండేది. నాకున్న ధైర్యమంతా మా అమ్మమ్మ దగ్గర నేర్చుకున్న వంటలే. ఇప్పుడు ముంబయి, ఢిల్లీ నగరాల్లో కొత్తగా రెస్టారెంట్ వ్యాపారంలోకి రావాలనుకుంటున్న వాళ్లు మా ఫ్రాంచైజీ అడుగుతున్నారు.

– నీల్జా వాంగ్ మూ, ఫుడ్ ఎంటర్‌ప్రెన్యూర్

### తల్లి పడిన కష్టమే స్ఫూర్తి

నీల్జా తల్లి గర్భంలో ఉండగానే తండ్రి పోవడంతో అమ్మమ్మ గారింట్లోనే పెరిగింది. తల్లి కష్టపడి కాలేజ్ వరకు చదివించింది. నీల్జాకు ఊహ తెలిసిన తర్వాత ఒకసారి అమ్మమ్మ గారి ఊరు 'స్తాక్' నుంచి తల్లితోపాటు ఆల్చిలోని తాతగారింటికి (తండ్రి కి తండ్రి) వెళ్లడం, వాళ్లు తమను రానివ్వకపోవడం ఇంకా జ్ఞాపకమేనంటారు నీల్జా.

''అప్పుడు తాత (అమ్మ నాన్న) ధైర్యం చేసి ఆల్చిలో మా కోసం ఒక ఇల్లు కట్టించి ఇచ్చి అందులోనే వారి ఎదురుగా ఉండమని చెప్పడం కూడా ఎప్పటికీ మర్చిపోలేను'' అంటారామె.

– మంజీర

epaper.sakshi.com

సాక్షి
ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ
సోమవారం ॥ 9-12-2019



● టీజీ విశ్వప్రసాద్, సురేష్‌బాబు, రాశీఖన్నా, నాగచైతన్య, వెంకటేష్, పాయల్ రాజ్‌పుత్, బాబీ

# ఈ మామకు ఇంకేం కావాలి

**- వెంకటేష్**

''వెంకీ మామ' సినిమాలోని 'అమ్మయినా నాన్నయినా నువ్వేలే వెంకీ మామ...' పాటలా నాకంతా నా అభిమానులే. నా 30 ఏళ్ల కెరీర్‌లో మీరే నా బలం. ఈ నెల 13న కలుద్దాం'' అని వెంకటేష్ అన్నారు. కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో వెంకటేశ్, నాగచైతన్య హీరోలుగా, రాశీఖన్నా, పాయల్ రాజ్‌పుత్ హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'వెంకీ మామ'. సురేష్‌బాబు, టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న విడుదలవుతోంది. ఖమ్మంలో జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో వెంకటేష్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో చైతూకు మాత్రమే మామ.. కానీ, సినిమా విడుదల తర్వాత అందరికీ వెంకీ మామనే. ఎక్కడికి వెళ్లినా వెంకీ మామ అంటున్నారు. ఈ సినిమాలో చైతూ చించేశాడు.. నాకు చాలా గర్వంగా ఉంది. ఈ మామకు ఇంకేం కావాలి చెప్పండి. మామ–అల్లుడు సెంటిమెంట్‌ని బాబీ చాలా బాగా తీశాడు. తమన్ మంచి పాటలిచ్చాడు'' అన్నారు.

నాగ చైతన్య మాట్లాడుతూ– ''నా లైఫ్‌లో రెండే రెండు సినిమాలు.. ఒకటి 'మనం'.. రెండోది 'వెంకీ మామ'. కెమెరా వె నుక ఓ మామ(సురేష్‌బాబు).. ముందు మరో మామ (వెంకటేష్).. నన్ను చాలా బాగా చూసుకున్నారు. బాబీ కూల్ డైరెక్టర్. ఈ మూవీలో మామా అల్లుళ్ల అల్లరి మామూలుగా ఉండదు'' అన్నారు.

బాబీ మాట్లాడుతూ– ''ఇక్కడికి వచ్చిన వెంకటేష్, నాగ చైతన్య, మెగా, నందమూరి, ఘట్టమనేని అభిమానులందరికీ నమస్కారం. ఏ హీరో అభిమానులు కూడా నెగిటివ్ మాట్లాడని హీరో వెంకటేష్‌గారు. చిన్నప్పుడు వీసీఆర్ కోసం వెళ్తే వెంకీగారి సీడీలు దొరికేవి కావు.. మహిళలు తీసుకుని వెళ్లేవాళ్లు. బ్లాక్‌లో తీసుకుని రావాల్సి వచ్చేది. 'ఎఫ్ 2'లో వెంకటేష్ గారి ఫన్ చూశారు.. 'వెంకీ మామ' లో ఆయన మాస్ యాంగిల్ చూపించాను. ఎంతో కుటుంబ నేపథ్యం ఉన్నా చైతూ కొత్త హీరోగానే ఆలోచిస్తాడు. సురేష్ బాబుగారు పెద్ద పుస్తకం'' అని తెలిపారు. ''వెంకీ మామ' నాకు చాలా ప్రత్యేకం'' అన్నారు రాశీఖన్నా. ''వెంకటేష్‌గారికి నేను పెద్ద అభిమానిని. ఆయనతో ఇంత త్వరగా పని చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు పాయల్ రాజ్‌పుత్. ''అన్ని రకాల భావోద్వేగాలున్న మంచి సినిమా 'వెంకీ మామ'' అన్నారు సురేష్ బాబు. ''వెంకటేష్, నాగ చైతన్యలతో గ్రేట్ మల్టీస్టారర్ నిర్మించడం ఆనందంగా ఉంది'' అన్నారు విశ్వప్రసాద్. ''వెంకీ, చైతూల నటన మిమ్మల్ని ఆకట్టుకుంటుంది'' అన్నారు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వివేక్ కూచిభొట్ల.

# శంకర్ తర్వాత మురుగదాస్

**- రజనీకాంత్**



● రజనీకాంత్, మురుగదాస్

''నేను తమిళనాడుకి వచ్చేటప్పుడు నాపై నమ్మకంతో ఇక్కడ అడుగు పెట్టించిన వారి నుంచి.. నాపై నమ్మకంతో సినిమాలు రూపొందించిన దర్శక–నిర్మాతలందరి నమ్మకాన్ని నేను వమ్ము చేయలేదు. ఇప్పుడు 'దర్బార్'తోనూ మీ నమ్మకాన్ని వమ్ము చేయను'' అని హీరో రజనీకాంత్ అన్నారు. మురుగదాస్ దర్శకత్వంలో రజనీకాంత్, నయనతార జంటగా నటించిన చిత్రం 'దర్బార్'. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.సుభాస్కరన్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతికి విడుదలకానుంది. నిర్మాత ఎన్.వి.ప్రసాద్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. అనిరుద్ స్వరపరచిన ఈ చిత్రం పాటలను చెన్నైలో విడుదల చేశారు. రజనీకాంత్ మాట్లాడుతూ– ''సుభాస్కరన్ నాకు మంచి స్నేహితుడు. తనొక నిర్మాతగానే మనకు తెలుసు. కానీ, లండన్‌లో తను పెద్ద బిజినెస్ మేన్. తన నిర్మాణంలో శంకర్ దర్శకత్వంలో '2.0' సినిమా చేస్తున్నప్పుడు మా బ్యానర్‌లో మరో సినిమా చేయాలనడంతో సరే అన్నాను. మురుగదాస్‌గారి 'రమణ, గజినీ' చిత్రాలు బాగా నచ్చాయి. అప్పుడే ఆయనతో సినిమా చేయాలనుకున్నాను కానీ ఇప్పటికి కుదిరింది. శంకర్‌లా ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మెసేజ్ ఇచ్చే సినిమాలు చేసే మురుగదాస్‌తో పనిచేయం ఆనందంగా అనిపించింది. డిసెంబర్ 12న నా బర్త్‌డేని అభిమానులు సెలబ్రేట్ చేయవద్దు. ఆ డబ్బులతో పేదలకు, అనాథలకు సాయం చేయండి'' అన్నారు. ఏఆర్ మురుగదాస్ మాట్లాడుతూ ''నాకు ఊహ తెలిసి మా ఊరిలో థియేటర్‌లో నేను చూసిన హీరో రజనీకాంత్‌గారే. ఆయనతో సినిమా తీయడం సంతోషంగా ఉంది'' అన్నారు. ''ప్రేక్షకుల్లాగా నేను కూడా ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా'' అన్నారు డైరెక్టర్ శంకర్. ''2.0' తర్వాత రజనీకాంత్‌గారితో మా బ్యానర్‌లో చేసిన చిత్రం 'దర్బార్'' అన్నారు ఎ.సుభాస్కరన్.



● నాగార్జున, రాజమౌళి, చిరంజీవి

# సినీ చరిత్రను పరిరక్షించుకోవాలి

''మనకెంతో విలువైన సినీ వారసత్వ సంపద ఉంది. కానీ, దాన్ని ఎలా పరిరక్షించుకోవాలో తెలియకపోవడం బాధాకరం. ఆ పనిని 'ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్' ఎంతో చక్కగా నిర్వహించడంతో పాటు, వాటిని ఎలా భద్రపరచాలన్న అంశంపై శిక్షణ ఇస్తోంది. మన సినీ చరిత్రని పరిరక్షించుకోవడం ద్వారా భావి తరాలకు మన సంస్కృతిని అందించగలుగుతాం'' అని లెజెండరీ దర్శకులు శ్యామ్ బెనగల్ అన్నారు. భారతీయ, తెలుగు సినీ వారసత్వ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేసే ఉద్దేశంతో 'ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ అర్కీవ్స్) (ఎఫ్ఐఎఎఫ్) సంయుక్తంగా ఆదివారం నుంచి ఈ నెల 15 వరకు హైదరాబాద్‌లో ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహిస్తున్నాయి. ఈ ప్రారంభ వేడుకలో శ్యామ్ బెనగల్ మాట్లాడుతూ– ''సినిమాలు మన జీవితాల్లో అంతర్భాగం. వాటిని భద్రపరచడమనేది మన దృశ్యపరమైన చరిత్రను, మన వారసత్వాన్ని, జ్ఞాపకాలను భద్రపరచడంతో సమానం. ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుండాలి. దీనికి ప్రభుత్వాల నుంచి సహాయ సహకారాలు కావాలి'' అన్నారు. హీరో చిరంజీవి మాట్లాడుతూ–''నేను రాజకీయాల్లోకి వెళ్లాక ఓ నిర్మాత నాకు అరుదైన కానుక ఇచ్చారు. నన్ను స్టార్ హీరోగా నిలబెట్టిన 'ఖైదీ' నెగెటివ్ రైట్స్ నాకు కానుకగా ఇచ్చారు. కానీ, అవి నాకు ఏ ల్యాబ్‌లో దొరకక్కపోవడంతో బాధపడ్డా. ఈ తరంలో ఎంత మందికి రాజ్‌కపూర్, చిత్తూరు నాగయ్య, ఎల్వీ ప్రసాద్ వంటి వాళ్లు తెలుసు.. వాళ్లు అందించిన విలువైన సినీ సంపదను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది'' అన్నారు. హీరో నాగార్జున మాట్లాడుతూ– ''నాన్నగారు(అక్కినేని నాగేశ్వరరావు) దాదాపు 400కు పైగా చిత్రాల్లో నటించారు. కానీ, వాటిలో మేం కొన్ని కూడా భద్రపరచుకోలేక పోయాం.. ఇది చాలా బాధగా ఉంది. వాటిని దాచుకోవాలన్న ఆలోచన కూడా మాకెప్పుడూ రాలేదు. నా 'గీతాంజలి', 'శివ' చిత్రాల నెగిటివ్ రీల్స్ ఇప్పుడు లేవు. కానీ, ఇకనుంచైనా మన సినీ వారసత్వ సంపదను కాపాడుకోవాలి'' అన్నారు. డైరెక్టర్ రాజమౌళి మాట్లాడుతూ– ''ప్రస్తుతం అందరం డిజిటల్ మీడియాలో చిత్రాలు తెరకెక్కిస్తున్నాం.కానీ, వాటిని భద్రపరచుకోలేకపోతున్నాం. 'మగధీర'ను భద్రపరచమని ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్ స్థాపకులు శివేంద్రగారు నన్ను అడిగారు. నేను చేస్తా అన్నాను.. అప్పుడు డిజిటల్‌లో 4కె రిజల్యూషన్ ఉన్న ఆ చిత్రం ఇప్పుడు 2కె రిజల్యూషన్‌కి పడిపోయింది. నాణ్యతను కోల్పోకుండా ఉండాలంటే సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది'' అన్నారు. డైరెక్టర్ రాఘవేంద్రరావు, నిర్మాతలు అల్లు అరవింద్, సురేష్‌బాబు, టి.సుబ్బరామిరెడ్డి, నటి అమల పాల్గొన్నారు.

# కొత్త నిర్మాతలు లేకుంటే మనుగడ లేదు – సి.కల్యాణ్

''దర్శకుణ్ణి అవుదామని ఇండస్ట్రీకి వచ్చి, మెళకువలు నేర్చుకున్నాను. అనుకోకుండా నిర్మాత అయ్యాను. 2020లో కచ్చితంగా ఓ సినిమాకు దర్శకత్వం వహిస్తాను. హీరో ఎవరు? అంటే నేనే అవ్వొచ్చేమో!(నవ్వుతూ)" అన్నారు నిర్మాత సి. కల్యాణ్. నేడు ఆయన పుట్టినరోజు(డిసెంబరు 9) సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో పంచుకున్న విశేషాలు....



● సి.కల్యాణ్

- నెల్లూరులోని మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన నాకు సి. కల్యాణ్ అనే ట్యాగ్ సంపాదించి ఇచ్చింది ఇండస్ట్రీయే. దర్శకులకు దాసరి నారాయణరావు గారు ఎలా ఉంటారో నిర్మాతలకు డి. రామానాయుడుగారు అలా. రామానాయుడుగారే నాకు స్ఫూర్తి.
- కొత్త సినిమా నిర్మాతలు లేకపోతే ఇండస్ట్రీకి మనుగడ లేదు. ఇప్పటి వరకు ఇండస్ట్రీలో ఉన్నవారే సినిమా తీయాలి.. కొత్తవారు సినిమా తీయకూడదంటే ఆరు నెలల్లో ఇండస్ట్రీ మూతపడిపోతుంది. ఇప్పుడున్న నిర్మాతలందరూ ఒకప్పుడు కొత్తవారే. ఇండస్ట్రీకి ఒక పెద్ద కావాలని చిరంజీవిగారితో ఇటీవలే మాట్లాడాను. 'నాకు ఏదో పెద్ద బాధ్యతను ఇవ్వబోతున్నట్లుగా ఉన్నావ్' అన్నారాయన. త్వరలోనే ఆ బాధ్యతలు తీసుకుంటారనుకుంటున్నా.
- వేరే ఇండస్ట్రీల్లో నిర్మాత, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్, స్టూడియోలు, ఆర్టిస్టులు వేర్వేరుగా ఉంటారు. కానీ టాలీవుడ్‌లో వీరందరూ ఇంటర్‌లింకై ఉన్నారు. ఆ నాలుగు సెక్టార్స్‌ని అండర్‌గ్రౌండ్‌లో ప్లే చేస్తున్నారు. ఇది ఎన్ని రోజులో సాగదు. ఏదో ఒక రోజు పేలక తప్పదు. ఈ రోజుల్లో ఏడాదికి దాదాపు 280 సినిమాలు విడుదలవుతుంటే... స్టార్స్ సినిమాలు వచ్చేది కేవలం 30 నుంచి 50 సినిమాలే. ఒక పెద్ద స్టార్ ఏడాదికి ఒక సినిమా చేస్తాడు. అతను ఎన్ని సినిమాలు చేసినా వారికి పనిచేసే స్టాఫ్ ఒకరే. మ్యాగ్జిమమ్ 40 శాతం మారతారు. నేను నోరు విప్పితే చాలామందికి చెమటలు పడతాయి.
- గతంలో చిత్ర పరిశ్రమ సమస్యలను ప్రభుత్వానికి ఇండస్ట్రీ తరఫున వెళ్లి చెప్పుకునేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. గిల్డ్ ఏజెంట్ల చేతుల్లోకి వెళ్లింది. ఇక్కడ ఎవరూ శాశ్వతం కాదు. నేను కూడా. తెలంగాణలో, ఆంధ్రలో వేర్వేరు ప్రభుత్వాలు. సినిమా వాళ్లు రాజకీయాల్లోకి వెళ్లిన తర్వాత గ్రూపులయ్యాయి. చిరంజీవిగారి దగ్గరికి వెళితే ఒక ట్యాగ్.. బాలకృష్ణగారి దగ్గరికి వెళితే మరో ట్యాగ్.. పవన్ కల్యాణ్ వద్దకు వెళితో ఇంకో ట్యాగ్ కట్టేస్తున్నారు. థియేటర్స్, క్యాబ్‌లు చేతిలో పెట్టుకుని ఉండేవారంతా ఒక్కటై వ్యాపారం చేస్తున్నారు. ఆ నలుగురి చేతుల్లో థియేటర్స్ ఉన్నాయనడం తప్పు. థియేటర్స్‌ని లీజుకి తీసుకొని వ్యాపారం చేస్తుండటాన్ని తప్పు అనలేం.
- బాలకృష్ణగారితో నా మూడో సినిమా 'రూలర్'. భవిష్యత్‌లో ఇంకా సినిమాలు చేస్తాం. ఉత్తరప్రదేశ్‌లో సెటిలైన తెలుగువాళ్ల కథ 'రూలర్'. ఈ సినిమాలో పొలిటికల్ యాంగిల్ లేదు. బాలకృష్ణ– దర్శకుడు వీవీ వినాయక్ కాంబినేషన్‌లో తప్పకుండా మరో సినిమా నిర్మిస్తాను.



● జాన్వీ కపూర్

# భయపెడతా

వచ్చే ఏడాది 12 గంట కొట్టగానే హ్యాపీ న్యూ ఇయర్ అంటూ ఫుల్ జోష్‌లో ఉంటారందరూ. కానీ ఆ కేరింతల్ని భయంతో, ఊహించని థ్రిల్‌తో వచ్చే అరుపులుగా మార్చబోతున్నాం అంటున్నారు జాన్వీ కపూర్. వచ్చే ఏడాదిని 'ఘోస్ట్ స్టోరీస్'తో ప్రారంభించబోతున్నారు జాన్వీ కపూర్. నెట్‌ఫ్లిక్స్ రూపొందించిన 'లస్ట్‌స్టోరీస్' యాంథాలజీ తరహాలోనే 'ఘోస్ట్ స్టోరీస్' రూపొందించబడింది. 'లస్ట్ స్టోరీస్'ను తెరకెక్కించిన కరణ్ జోహార్, అనురాగ్ కశ్యప్, దిబాకర్ బెనర్జీ, జోయా అక్తర్ ఈ యాంథాలజీను డైరెక్ట్ చేశారు. ఇది జనవరి 1వ తారీఖున రాత్రి 12గంటలకు నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ కానుంది. కాగా కరణ్ జోహార్ డైరెక్ట్ చేసిన కథలో జాన్వీ నటించారు.



● సంజయ్, ఓబుల్ సుబ్బారెడ్డి, రాజశేఖర్, జీవిత, శివకుమార్, శ్రీనాథ్

# కథా బలం ఉన్న సినిమాలు హిట్టే

**- రాజశేఖర్**

''స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' సినిమా ట్రైలర్ చూస్తుంటే మంచి సందేశాత్మక చిత్రమని తెలుస్తోంది. ప్రొడక్షన్ విలువలు బాగున్నాయి. అందరూ బాగా నటించారు'' అని హీరో రాజశేఖర్ అన్నారు. సంజయ్ ఇదామ, శ్రీనాథ్ మాగంటి, అహల్య సురేష్, ప్రియ ముఖ్య తారలుగా జె.కరుణ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్'. రాహుల్ మూవీ మేకర్స్ పతాకంపై బి.ఓబుల్ సుబ్బారెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న విడుదలవుతోంది. ఈ సినిమా పాటల విడుదల వేడుకలో రాజశేఖర్ మాట్లాడుతూ– ''రాజమౌళిగారి దగ్గర పనిచేసిన కరుణ కుమార్ ఈ సినిమాను బాగా తెరకెక్కించారు. యాజమాన్య పాటలు బాగున్నాయి. కథా బలం ఉన్న సినిమాలు ఎప్పుడూ హిట్ అవుతుంటాయి. 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్'లో కథతో పాటు సందేశం ఉన్నందున తప్పకుండా సక్సెస్ అవుతుంది'' అన్నారు. ''ఈ సినిమాలో విద్యార్థుల గురించి ఒక మంచి సందేశం ఉంది. ప్రతి తల్లిదండ్రులు, విద్యార్థులు చూడాల్సిన సినిమా ఇది'' అన్నారు నటి జీవిత. ''ఈ చిత్రం నాకు నచ్చింది.. అందుకే స్వయంగా విడుదల చేస్తున్నా'' అన్నారు నిర్మాత మల్కాపురం శివకుమార్. ''తెలుగులో నేను తీసిన మూడో సినిమా ఇది. డబ్బు వస్తుందా?లేదా? అనే విషయాలు పక్కన పెడితే మంచి సినిమా తీశానన్న సంతృప్తి ఉంది'' అన్నారు బి.ఓబుల్ సుబ్బారెడ్డి. ''ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదని ఈ సినిమాలో చెప్పాం'' అన్నారు కరుణ కుమార్. నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, చిత్ర యూనిట్ పాల్గొన్నారు.



● విజయ్‌ధరన్, రాశీసింగ్

# పోస్టర్ కొత్తగా ఉంది

విజయ్‌ధరన్ హీరోగా, రాశీసింగ్, అక్షిత సోనావనే హీరోయిన్లుగా నటిస్తోన్న చిత్రం 'పోస్టర్'. టియంఆర్ దర్శకత్వంలో శ్రీ సాయి పుష్ప క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేసి, మాట్లాడుతూ– ''పోస్టర్' టైటిల్ కొత్తగా అనిపించింది. విజయ్‌ధరన్‌తో నాకు ఎప్పటి నుంచో మంచి పరిచయం ఉంది. తను హీరోగా నటించటం సంతోషంగా ఉంది. ఈ సినిమా చక్కని విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా'' అన్నారు. ''ఈ సినిమా కథ, కథనం చాలా సహజంగా ఉంటాయి'' అన్నారు విజయ్‌దరన్. టియంఆర్ మాట్లాడుతూ–''సాధారణంగా సినిమా అంతా పూర్తయ్యాక పోస్టర్ గురించి మాట్లాడతాం. మా సినిమా కథనే మేము 'పోస్టర్'గా తీసుకొస్తున్నాం. త్వరలోనే ట్రైలర్ విడుదల చేస్తాం'' అన్నారు.

# సినిమాల పైరసీ నేపథ్యంలో..



● గాయత్రీ సురేశ్, నవీన్‌చంద్ర

నవీన్ చంద్ర, గాయత్రీ సురేశ్ జంటగా నటించిన చిత్రం 'హీరో హీరోయిన్ '. స్వాతి పిక్చర్స్ పతాకంపై భార్గవ్ మన్నె నిర్మించిన ఈ చిత్రానికి 'అడ్డా' ఫేమ్ జి.కార్తీక్ రెడ్డి దర్శకుడు. ఈ నెల 27న సినిమా విడుదల కానుంది. భార్గవ్ మన్నె మాట్లాడుతూ– ''సినిమాల పైరసీ నేపథ్యంలో సాగే కథ ఇది. ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గ కథ ఇది. తను అనుకున్న పాయింట్‌ను చక్కగా తెరకెక్కించాడు కార్తీక్. లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం టీజర్ ఇటీవల విడుదల కాగా మంచి స్పందన వచ్చింది. నవీన్‌చంద్ర యాక్టింగ్ నెక్ట్స్ లెవల్‌లో ఉంటుంది. పైరేటెడ్ లవ్‌స్టోరీగా తెరకెక్కిన ఈ చిత్రం సెన్సార్ పూర్తయింది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్.

# ప్రేమ.. సందేశం



● విశ్వనాథ్ తన్నీరు

'యమ్ 6' వంటి హారర్ ఎంటర్‌టైనర్‌ను నిర్మించి, నిర్మాతగా మంచి పేరు తెచ్చుకున్నారు విశ్వనాథ్ తన్నీరు. తొలి సినిమాతో ప్రేక్షకులను భయపెట్టిన ఆయన మలి చిత్రంతో సమాజానికి సందేశం ఇవ్వబోతున్నారు. విజయీభవ ప్రొడక్షన్స్‌తో కలిసి విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ పతాకంపై కొత్త సినిమాకి శ్రీకారం చుట్టబోతున్నారాయన. ఈ సందర్భంగా విశ్వనాథ్ తన్నీరు మాట్లాడుతూ– ''సినిమా మీద ఉన్న ప్యాషన్‌తో ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలోకి అడుగుపెట్టాను. మొదట టీవీ సీరియల్స్‌లో నటించా. కొన్ని సినిమాలకు దర్శకత్వ శాఖలో కూడా పనిచేశాను. మరికొన్ని సీరియల్స్‌ని సొంతంగా నిర్మించాను. ఆ అనుభవంతోనే 'యమ్ 6' చిత్రాన్ని నిర్మించాను. ఈ రోజుల్లో చిన్న సినిమాలను నిర్మించి, విడుదల చేయడం చాలా కష్టంగా మారింది. తొలి సినిమా విడుదలలో నేనూ ఇబ్బందులు ఎదుర్కొన్నా. రెండో చిత్రం విషయంలో అలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాను. ఓ కాన్సెప్ట్ బేస్డ్ సినిమాను ప్లాన్ చేస్తున్నాం. లవ్, కామెడీ, సెంటిమెంట్‌తోపాటు ప్రజెంట్ జనరేషన్‌కి మంచి మెసేజ్‌ని ఈ సినిమాతో ఇవ్వబోతున్నాం. త్వరలోనే పూర్తి వివరాలు తెలియజేస్తాం'' అన్నారు.

# మహిళల స్వేచ్ఛ కోసం..



● మంగ్లీ

గాయని మంగ్లీ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'స్వేచ్ఛ'. కేపీఎన్ చౌహాన్ దర్శకత్వం వహించారు. సరస్వతి డెవలపర్స్, లచ్చురాం ప్రొడక్షన్స్ పతాకంపై ఆంగోత్ రాజునాయక్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న విడుదలవుతోంది. ఆంగోత్ రాజునాయక్ మాట్లాడుతూ– ''తండా స్థాయి నుంచి ప్రపంచస్థాయి వరకు గాయనిగా ఎదిగిన మంగ్లీ పాత్ర నేటి అమ్మాయిలకు ప్రేరణగా నిలుస్తుంది. సెంటిమెంట్, వినోదంతో రూపొందిన ఈ చిత్రం అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది. ఈ నెల 22న పాటలను విడుదల చేస్తాం'' అన్నారు.''పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంత ముఖ్యమో, ఈ సృష్టికి ఆడ పిల్లలూ అంతే ముఖ్యమని తెలిపే చిత్రమిది'' అన్నారు కేపీఎన్ చౌహాన్ . ''ఇందులో ఓ పాత్రలో నటించడంతో పాటు సంగీతం అందించడం ఆనందంగా ఉంది'' అన్నారు భోలో షావలి.

# రెండు జంటలు



● సిద్ధాంత్ చతుర్వేది



● దీపికా పదుకోన్

బాలీవుడ్‌లో తెరకెక్కనున్న ఓ మోడ్రన్ లవ్‌స్టోరీ కోసం రెండు జంటలు కావాలి. అందులో ఒక జోడీగా 'గల్లీభాయ్' ఫేమ్ సిద్ధాంత్ చతుర్వేది, దీపికా పదుకోన్ కుదిరారు. మరో జంట కోసం వెతుకుతున్నారు దర్శక–నిర్మాతలు. ఈ కొత్త ప్రేమ కథను 'ఏక్ మైన్ ఔర్ ఏక్ తు' (2012), 'కపూర్ అండ్ సన్స్' (2016) వంటి చిత్రాలను తెరకెక్కించిన షకున్ బాత్రా డైరెక్ట్ చేస్తారు. దర్శక–నిర్మాత కరణ్ జోహార్ నిర్మిస్తారు. ''నేటి తరం ప్రేమికుల ఆలోచనలు, అనుబంధాలు, నమ్మకాలు వంటి అంశాలపై ఫోకస్ పెడుతూ రెండు జంటల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతుంది. వచ్చే ఏడాది మార్చిలో చిత్రీకరణ మొదలుపెట్టాలనుకుంటున్నాం. ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. లొకేషన్స్ వెతకడం ప్రారంభించాం. ఈ సినిమా చిత్రీకరణకు ముందు కొన్ని వర్క్‌షాప్‌లు ప్లాన్ చేశాం'' అని చిత్రబృందం పేర్కొంది.



సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ సోమవారం
9-12-2019

పరిచయం **నీరజ గొడవర్తి, పారిశ్రామికవేత్త**

**నా జీవితాన్ని నాలుగు సెగ్మెంట్‌లుగా విభజించుకున్నాను. మొదటిది నా ప్రొఫెషన్, రెండు భార్యగా తల్లిగా నా ఇంటి బాధ్యత, మూడవది నన్ను నేను సంతోషంగా ఉంచుకోవడానికి దోహదం చేసే నా ప్యాషన్, నాలుగవది సాటి మహిళల కోసం స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న సామాజిక బాధ్యత. ప్రొఫెషన్‌లో మన సర్వీస్ నూటికి నూరు శాతం ఇవ్వగలగాలంటే మన పర్సనల్ స్పేస్‌ను సంతృప్తి పరుచుకుంటూ ఉండాలి. తొమ్మిది భారతీయ భాషల్లో త్యాగరాజ కృతులు పాడినా, ఇంట్లో సీతారామ కల్యాణం చేసినా అవన్నీ నా సంతోషం కోసమే. పారిశ్రామికవేత్తగా కష్టపడేది నన్ను నేను గెలిపించుకోవడం కోసం. ఇలా నన్ను నేను గెలిపించుకోవడం సాధ్యమయ్యేది నన్ను నేను సంతోషంగా ఉంచుకున్నప్పుడే. ఈ చిన్న చిట్కా తెలిస్తే జీవితంలో అసంతృప్తులు ఉండవన్నారు నీరజ గొడవర్తి. ఇటీవలే ఎమినెంట్ ఉమన్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు అందుకున్న నీరజ తన ప్రస్థానాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.**

# మన నైపుణ్యమే మనకు గుర్తింపు



''మాది మద్రాసులోని తెలుగు కుటుంబం. మా తాతగారు మద్రాసు నుంచి బాపట్ల వచ్చి స్థిరపడ్డారు. మా నాన్న అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగరీత్యా తెలంగాణలో పెరిగాను. పెళ్లితో పూర్తి స్థాయిలో హైదరాబాద్‌లో స్థిరపడ్డాను. సంగీతంలో ప్రవేశం ఉన్న కుటుంబం కావడంతో నేను కూడా కర్ణాటక సంగీతం నేర్చుకున్నాను. చిన్నప్పుడు స్కూల్లో నేర్చుకున్న క్రమశిక్షణ నాలో ఇప్పటికీ సజీవంగా ఉంది. ఆ క్రమశిక్షణే జీవితాన్ని సక్రమంగా చక్కదిద్దుకునే నైపుణ్యాన్నిచ్చింది. టైప్, షార్ట్ హ్యాండ్ అర్హతలు కూడా ఉండడంతో బీకామ్ పరీక్షలు రాసిన వెంటనే ఓ పెద్ద కంపెనీలో అకౌంట్స్ విభాగంలో ఉద్యోగం వచ్చింది. చదువు మాత్రమే సరిపోదు, లైఫ్ స్కిల్స్ కూడా ఉండాలని నాకు తెలిసిన సందర్భం అది. ఉద్యోగం చేస్తూనే కరస్పాండెన్స్‌లో పీజీ చేశాను. ఎనిమిదేళ్ల ఉద్యోగానుభవం నాకు పెళ్లి తర్వాత నా భర్త కంపెనీని నిర్వహించడంలో చాలా బాగా దోహదం చేసింది. మావారి ఏకశిలా కెమికల్స్ లిమిటెడ్‌లో మొదట కంప్యూటర్ విభాగం బాధ్యతలు తీసుకున్నాను. ఇప్పుడు అదే కంపెనీకి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ని. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే... సక్సెస్‌కి ఎప్పుడూ షార్ట్ కట్ ఉండదు. కంపెనీ మనదైనా సరే, అందులో ఉన్నత స్థాయిలో నిలదొక్కుకోవాలంటే మన శ్రమ, మనం కంపెనీకి ప్రయోజనకరంగా ఉండడం వల్లనే సాధ్యమవుతుంది. అంతే తప్ప మనలో అంకితభావం, పట్టుదల, నైపుణ్యం లేకపోతే పెద్ద బాధ్యతలు అప్పగించే సాహసాన్ని భర్త కూడా చేయడు.

**మొక్కలు పెంచాను**

మా బాబు కోసం మూడేళ్లపాటు నా కెరీర్‌లో గ్యాప్ తీసుకున్నాను. అప్పుడు నాకు టైమ్ వృథా చేస్తున్నానా అనిపించేది. అప్పుడు హిందూస్తానీ సంగీతం నేర్చుకున్నాను. బాబు స్కూల్‌కెళ్లడం మొదలైన తర్వాత బంజరుగా పడి ఉన్న రెండెకరాల పొలాన్ని సాగులోకి తెచ్చే బాధ్యత తీసుకున్నాను. అమెరికా వెళ్లినప్పుడు న్యూయార్క్‌లో చూసిన బటర్ ఫ్లై పార్క్‌ను దృష్టిలో పెట్టుకుని పొలం మధ్యలో వాకింగ్ ట్రాక్ నిర్మాణంతోపాటు సీతాఫలం, గోరింటాకు, అశ్వత్థ, రుద్రాక్ష, ఖర్జూరం, అంజూర్ చెట్లు వేశాను. హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ నుంచి రెండేళ్లు అవార్డు అందుకున్నాను. హార్టికల్చర్ అవార్డుకి గీటురాయి ప్రధానంగా ఒక్కటే. మనం పెంచిన ప్రతి చెట్టుకీ ఏదో ఒక ప్రయోజనం ఉండి తీరాలి. చూడడానికి అందంగా కనిపించడం కోసం క్రోటన్స్ నాటానంటే ఒప్పుకోరు. పువ్వులు, కాయలు, ఔషధ గుణాల వంటి ఉపయోగకరమైనవే అయి ఉండాలి. గార్డెన్‌కి నేను రోజూ చేయాల్సిందేమీ లేదిప్పుడు. కంపెనీ పనులు చూసుకుంటున్నాను.

**ఒకప్పటి పురుష సామ్రాజ్యం**

పరిశ్రమ నిర్వహణలో ఉన్న మహిళలు సక్సెస్ బాట పట్టిన తమ విజయాలను చూసుకుని సంతోషపడితే సరిపోదు. తమ వంతుగా సామాజిక బాధ్యతను చేపట్టి తీరాలి. ఎందుకంటే ఓ దశాబ్దం వరకు కూడా ఇది పూర్తిగా మగవాళ్ల సామ్రాజ్యం. ఇప్పుడు మహిళలు ముందుకు వస్తున్నారు. ముందుతరం మహిళాపారిశ్రామిక వేత్తలు తాము నడిచిన దారితో కొత్తవారికి మార్గదర్శనం చేయగలగాలి. పరిశ్రమ నిర్వహణలో దాగిన మెళకువలను కొత్త వారికి నేర్పించాలి. కేవలం అందుకోసమే కోవే (కన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా) లో మెంబర్‌గా చేరాను. ఇందులో వందల సంఖ్యలో మహిళలున్నారు. తమ పరిశ్రమలను విజయవంతంగా నడిపించుకుంటున్న వాళ్లు దాదాపుగా ఎనభై మంది ఇందులో క్రియాశీలకంగా ఉన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు పెట్టి కొత్తవాళ్లకు దిశానిర్దేశం చేయడం, కుటీర పరిశ్రమలు నడుపుతున్న వాళ్ల ఉత్పత్తులను మార్కెట్ చేయడం కోసం కోవే మార్ట్‌లు నిర్వహించడం నాకు చాలా సంతృప్తినిస్తున్నాయి. సమాజంలో ఒకింత విస్తృతమైన పరిచయాలు ఉండడంతో నోటి మాట ద్వారా మా కోవే నెట్‌వర్క్‌లో ఉన్న మహిళలకు ఆర్డర్‌లు ఇప్పించగలుగుతాం. అవసరం ఉన్న వాళ్లకు– సర్వీస్ ఇవ్వగలిగిన వాళ్లకు మధ్య వారధిగా పని చేయడం అన్నమాట. ఇందుకోసం ఓ పది నిమిషాల ఫోన్ కాల్ మినహా మాకు ఖర్చయ్యేది ఏమీ ఉండదు. సక్సెస్ బాటలో ఉన్న మహిళా పారిశ్రామికవేత్తలను నేను కోరేది ఒక్కటే... మీరు ఎక్కిన నిచ్చెన మెట్లు మిమ్మల్ని మీ లక్ష్యానికి చేర్చాయి. తొలి అడుగు ఎలా వేయాలో తెలియక దిక్కులు చూస్తున్న మహిళలెందరో ఉన్నారు. వారికి చేయి అందించండి.

**ఏదో ఒక నైపుణ్యం ఉంటుంది**

కొత్త తరం యువతులు ఉత్సాహంగా ఉంటున్నారు. కానీ చదువుకుని కూడా గృహిణిగా ఉండిపోయిన వాళ్లలో చాలా మంది పిల్లలు పెద్దయ్యే కొద్దీ జీవితంలో తెలియని వెలితి ఫీలవడాన్ని చూస్తున్నాం. ఈ వ్యాక్యూమ్ అనేది ఎవరికి వాళ్లు ఏర్పరుచుకునేదే. వాళ్లకు నేను చెప్పగలిగిన చిన్న సలహా ఏమిటంటే... ప్రతి ఒక్కరిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుంది. దానిని గుర్తించి, దానినే మీకు గుర్తింపుగా మలుచుకోండి. ఇంటిని అందంగా అలంకరించడం, చక్కగా చీర కట్టుకోవడం, రుచి వంట చేయడం... ప్రతిదీ ఇప్పుడు మార్కెట్ వస్తువులే. స్నేహితులకు, బంధువులకు హాబీగా చేసివ్వచ్చు. ఆర్థిక అవసరాలుంటే వీటినే ఉపాధిగా మార్చుకోవచ్చు. ఏ పనినీ తక్కువగా చూడకూడదు. గడచిన తరం మహిళలకు ఇన్ని అవకాశాల్లేవు. ఇప్పుడు అవకాశాలకు ఆకాశమే హద్దు''.

– ఇంటర్వ్యూ: **వాకా మంజులారెడ్డి**
ఫొటోలు : **గాలి అమర్**

## పూలకు పాట

ఇకబెనా ఫ్లవర్ అరేంజ్‌మెంట్ ఆర్ట్ గురించి ఒక ఫ్రెండ్ చెప్పింది. ఆ కళను నేర్చుకోవడమే కాకుండా అందులో అడ్వాన్స్ కోర్సు కూడా చేశాను. ఇకబెనా మీద పాట రాసి, స్వయంగా మ్యూజిక్ కంపోజ్ చేసి రెండేళ్ల కిందట హాంగ్ కాంగ్‌లో జరిగిన ఏషియన్ రీజనల్ కాన్ఫరెన్స్‌లో పాడాను. కోవే మహిళలను ఉత్తేజితం చేయడానికి కూడా పాట రాశాను. మార్కులు తక్కువగా వచ్చాయని ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నప్పుడు, దిశ సంఘటన మీద కూడా పాట రాశాను. మనసులో అలజడి రేగినప్పుడు పాట రాయడం, మనసు బాగున్నప్పుడు పూలు అలంకరించుకోవడం, కీర్తనలు పాడడం ఇవన్నీ నాకు జీవితం మీద ఇష్టాన్ని పెంచే పనులు. ఏ ఉద్వేగాన్నీ అణుచుకోకూడదు. ఉద్వేగం ఏదో ఒక కళ రూపంలో బయటకు తీసుకురావాలి. అప్పుడే జీవితంలో ప్రతి క్షణాన్నీ ఫలవంతంగా జీవించగలుగుతాం.

– **నీరజ గొడవర్తి,**
ఎమినెంట్ ఉమన్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు గ్రహీత



పరి పరిశోధన

## జలుబు చేసిందా... పాప్‌కార్న్ తిని చూడండి!

ఈసారి మీకు జలుబు చేసినట్లు అనిపించగానే ఏ ట్యాబ్లెట్ కోసమో మందులషాపుకు పరుగులు తీయకండి. ఆన్‌కౌంటర్ మెడిసిన్ కొని ఆరోగ్యాన్ని పాడుచేసుకోకండి.

ఈసారి జలుబు చేసినప్పుడు పాప్‌కార్న్ తిని చూడండి. ఇలా చేయడం వల్ల జలుబు తగ్గుతుందనేది పెన్సిల్వేనియాలోని 'యూనివర్సిటీ ఆఫ్ స్క్రాంటన్'కు చెందిన అధ్యయనవేత్తలు చెబుతున్న మాట.



పాప్‌కార్న్‌లో పాలీఫినాల్స్ అనే యాంటీ ఆక్సిడెంట్ పాళ్లు ఎక్కువగా ఉంటాయనీ, అవి జలుబును తగ్గిస్తాయని వాళ్లు పేర్కొంటున్నారు. మరో విషయం ఏమిటంటే ఇలా పాప్‌కార్న్‌లో లభ్యమయ్యే ఈ యాంటీఆక్సిడెంట్స్ మోతాదులు కొన్ని పండ్ల నుంచి లభ్యమయ్యే వాటి కంటే కూడా చాలా ఎక్కువని వారు అంటున్నారు. పనిలో పనిగా మరో జాగ్రత్త కూడా చెబుతున్నారు. ఇలా పాప్‌కార్న్ తినే సమయంలో అందులో ఉప్పు వేసుకోకపోవడం చాలా మంచిదని సూచిస్తున్నారు. ఉప్పు వేయడం వల్ల పాప్‌కార్న్ వల్ల ఒనగూరే ప్రయోజనాలు తగ్గిపోతాయని, పైగా దేహానికి కూడా కొత్త సమస్యలు వస్తాయని కూడా వారు హెచ్చరిస్తున్నారు.

ప్రోస్టేట్ & కిడ్నీ కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్

# ప్రోస్టేట్‌తో పాటు కిడ్నీ క్యాన్సర్ అంటున్నారు...

**మా అన్నయ్య వయసు 48 ఏళ్లు. కొద్దికాలంగా ప్రోస్టేట్ సమస్యతో బాధపడుతున్నాడు. ఈమధ్య తరచూ యూరిన్ సమస్యలు ఎక్కువకావడం, జ్వరం కూడా ఎక్కువగా రావడంతో పెద్దాసుపత్రిలో చూపించాం. అన్ని రకాల పరీక్షలు చేసి ప్రోస్టేట్ క్యాన్సర్ అని చెప్పారు. ఎడమ కిడ్నీలోని కొంతభాగానికి కూడా క్యాన్సర్ సోకిందరి పరీక్షల్లో తేలింది. రొబోటిక్ వైద్య విధానంలో 'ప్రోస్టెక్టమీ', 'నెఫ్రెక్టమీ' శస్త్రచికిత్స చేయించాలని ఇక్కడి డాక్టర్లు చెప్పారు. దయచేసి మాకు ఈ వ్యాధి గురించి, దాంతో పాటు ఈ శస్త్రచికిత్సల గురించి వివరంగా తెలియజేయండి. మా అన్నయ్యకు ఇంకా చాలా జీవితం ఉంది. ఈ వయసులోనే ప్రోస్టేట్ గ్రంథిని తొలగిస్తే తర్వాత వచ్చే దుష్ఫలితాలు, వ్యంధ్వత్వం వంటివి ఏమైనా వస్తాయా? అలాగే ఇంత పెద్ద సర్జరీ చేయడం వల్ల ప్రాణహాని ఏదైనా ఉంటుందా అని మా కుటుంబం మొత్తం చాలా ఆందోళన పడుతున్నాం. దయచేసి అన్నీ వివరంగా తెలపగలరు.**

– కె.ఎమ్. కృష్ణంరాజు, భీమవరం



ముందుగా మీరు అడిగిన వివరాల ప్రకారం వరసగా మీకు సమాధానం ఇస్తాను. మీరు సర్జరీ విషయంలో ఎక్కువగా ఆందోళన చెందవద్దు. మీ కుటుంబసభ్యులకు కూడా భయపడొద్దని చెప్పండి. ప్రోస్టేట్ క్యాన్సర్, కిడ్నీ క్యాన్సర్‌లకు ఇప్పుడు అత్యాధునికమైన వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

ప్రోస్టేట్ గ్రంథిలో సమస్యలున్నప్పుడు... మరీ ముఖ్యంగా క్యాన్సర్ ఉన్నప్పుడు దాన్ని తొలగించాల్సి వస్తుంది. ఈ శస్త్రచికిత్సను 'రాడికల్ ప్రోస్టెక్టమీ' అంటారు. లాపరోస్కోపీ ద్వారా ప్రోస్టేట్‌ను తొలగించేసమయంలో దాని చుట్టుపక్కల ఉన్న చిన్న నాడులు సరిగా కనిపించక పొరబాటున అవి తెగిపోయేందుకు అవకాశం ఉంటుంది. అందువల్ల వ్యంధత్వం వచ్చే అవకాశాలుంటాయి. ప్రోస్టేట్ క్యాన్సర్ తొలగిపోయి, ప్రాణాపాయం తప్పిపోయినప్పటికీ వాళ్లు ఇంపొటెంట్ కావడం చాలా బాధాకరంగా ఉంటుంది. అలాంటపుపడు ఈ సమస్య రాకుండా సర్జరీ చేయడం రొబోటిక్స్ ద్వారా సాధ్యమవుతుంది. లోపల ఉన్న శరీర భాగాలు పదివంతులు ఎక్కువ పెద్దగా కనిపించడం వల్ల చిన్న చిన్న నాడులు సైతం స్పష్టంగా కనిపిస్తుంటాయి. కాబట్టి అవి తెగిపోకుండా జాగ్రత్తగా సర్జరీ చేయడం సాధ్యమవుతుంది.

ఇక కిడ్నీ ట్యూమర్లు / క్యాన్సర్లు / పెద్ద పెద్ద ట్యూమర్లు ఉంటే కొన్ని సందర్భాల్లో కిడ్నీ మొత్తాన్ని తీసేయాల్సి వస్తుంది. ఇలా తొలగించే ప్రక్రియను 'రాడికల్ నెఫ్రెక్టమీ' అంటారు. కానీ చిన్నసైజు ట్యూమర్లు ఉన్నప్పుడు కణితి వరకు మాత్రమే తీసేసి, మిగిలిన కిడ్నీని కాపాడవచ్చు. దీన్ని 'పార్షియల్ నెఫ్రెక్టమీ' అంటారు. ఓపెన్, లాపరోస్కోపీ, రొబోటిక్ సర్జరీ ఇలా అన్ని ప్రక్రియల ద్వారా కూడా పార్షియల్ నెఫ్రెక్టమీ చేయవచ్చు. కానీ రొబోటిక్స్ ద్వారా మరింత సమర్థంగా ఈ శస్త్రచికిత్స చేయడం సాధ్యమవుతుంది. ట్యూమర్‌ను తొలగించే సమయంలో కిడ్నీని కట్ చేయాల్సి వస్తుంది. ఇలాంటప్పుడు రక్తం ఎక్కువగా పోతుంది. ఇది అరగంట కన్నా ఎక్కువ సేపు జరిగితే కిడ్నీ డ్యామేజీ అవుతుంది. కానీ రొబోటిక్స్ ద్వారా కిడ్నీ కట్ చేయడం, కుట్లు వేయడం చాలా తొందరగా అయిపోతాయి. కాబట్టి అధిక రక్తస్రావం ఉండదు. కిడ్నీ దెబ్బతినేందుకు ఆస్కారం ఉండదు.

ఇప్పుడు రొబోటిక్స్ శస్త్రచికిత్సల గురించి సవివరంగా చెబుతాను. ఇప్పుడు ఎన్నో రకాల కిడ్నీ సమస్యలకు సురక్షితమైన పరిష్కారం చూపిస్తున్నది రొబోటిక్ సర్జరీ. వైద్యరంగంలో ఎన్ని మార్పులు వచ్చినా పేషెంట్ సేఫ్టీయే చివరి లక్ష్యంగా ఉంటుంది. మొదట్లో సర్జరీ అంటే పెద్ద కోత పెట్టి చేసే ఓపెన్ సర్జరీయే. గుండె, ఊపిరితిత్తులకు సంబంధించివైతే ఛాతీ తెరచి సర్జరీ చేయాలి. పొట్టలోని అవయవాలకు సంబంధించినదైతే పొట్టపై గాటు పెట్టాలి. కానీ లాపరోస్కోపిక్ సర్జరీ అందుబాటులోకి వచ్చిన తర్వాత పెద్ద కోత అవసరం లేకుండానే మూడు, నాలుగు రంధ్రాలు మాత్రమే పెట్టి చేసే కీహోల్ సర్జరీ రోగులకు వరప్రదాయని అయ్యింది. కిడ్నీకి సంబంధించిన ఆపరేషన్లకు కూడా లాపరోస్కోపీ చేసేవారు. ఇలా లాపరోస్కోపీ అందుబాటులోకి వచ్చిన తర్వాత శరీరాన్ని కోసే బాధ తప్పింది. కేవలం చిన్న చిన్న గాట్లతో రంధ్రాలు చేసి లోపలికి కెమెరా, లాపరోస్కోపిక్ పరికరాన్ని పంపి సర్జరీ చేయవచ్చు. లోపలి అవయవాలను స్క్రీన్ మీద స్పష్టంగా చూడవచ్చు. వాటిని తెర మీద చూస్తూ లోపల సర్జరీ చేయవచ్చు. లాపరోస్కోపిక్ పరికరం 2డి విజన్‌ను కలిగి ఉంటుంది. అందువల్ల లోపలి అవయవాలను 2 డైమన్షనల్‌గా చూపిస్తుంది. కోత ఉండదు కాబట్టి రక్తస్రావమై రక్తం నష్టపోయే అవకాశం ఉండదు. హాస్పిటల్ కూడా మూడు, నాలుగు రోజులుంటే చాలు. త్వరగా కోలుకుంటారు. అయితే కొన్ని ప్రొసిజర్లలో లాపరోస్కోపీ చేయడం కష్టం. కిడ్నీలో ట్యూమర్ ఉంటే కణితి వరకే తీసేసి మిగిలింది కుట్లు వేయాలి. ఇది లాపరోస్కోపీలో కష్టం. దీనికి చాలా నైపుణ్యం అవసరం. ఎంతో అనుభవం కావాలి. స్థూలకాయం ఉన్నవాళ్లలో కూడా లాపరోస్కోపీతో ఆపరేషన్ ఇంకా కష్టమవుతుంది.

ఇక రోబోతో చేసే సర్జరీకి రోబో చేతుల సహాయంతోనే డాక్టర్లు సర్జరీ చేయిస్తారు. తెరమీద లోపలి అవయవాలను చూస్తూ రోబో పరికరాన్ని ఎటు ఎలా తిప్పాలనేది డాక్టర్ కంట్రోల్ చేస్తుంటారు. అందుకు అనుగుణంగా రోబో చేతులు చకచకా ఆపరేషన్ చేసేస్తుంటాయి. రొబోటిక్ సర్జరీకి కూడా పెద్ద కోత పెట్టాల్సిన అవసరం ఉండదు. దీనికి కూడా లాపరోస్కోపీ లాగానే కేవలం ఒక సెం.మీ. గాట్లు... మూడ్నాలుగు పెట్టాల్సి ఉంటుంది. లాపరోస్కోపీ ద్వారా చేయలేని సర్జరీలను రోబోతో చేయవచ్చు. పైగా రోబో యంత్రానికి 3డి విజన్ ఉంటుంది. అందుకే లోపలి అవయవాలను 3 డైమన్షనల్‌గా చూడవచ్చు. ఓపెన్ సర్జరీలో డాక్టర్ తన చేతులతో చేసినట్లు ఇక్కడ రోబో చేతులు ఆపరేషన్ చేస్తాయి. మన చేతులను ఎలా పడితే అలా తిప్పగలిగినట్లే, రోబో చేయి కూడా 360 డిగ్రీలలో తిప్పవచ్చు. ఒకరకంగా చెప్పాలంటే మానవ హస్తం కంటే మరింత మిన్నగా ఆపరేషన్ జరుగుతుంది. అంటే ఉదాహరణకు ఒక్కోసారి మానవహస్తం కాస్తంతైనా వణికే అవకాశమైనా ఉందేమోగానీ రోబో చేయి అలా వణకదు. లాపరోస్కోపీ అయితే ఒకరు కెమెరా పట్టుకొని ఉండాలి. కానీ ఇందులో రోబో యంత్రానికే కెమెరా ఉంటుంది. ఈ సర్జరీలు చాలా సురక్షితం. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవు. లోతుగా ఉండే అవయవాలకు చేయాల్సిన సర్జరీలు కూడా చాలా సులువుగా జరిగిపోతాయి. స్థూలకాయులకు కూడా చాలా సులువుగా సర్జరీలు చేయవచ్చు. కాబట్టి మీరు ఏమాత్రం ఆందోళన పడకండి.



**డా. వి. సూర్యప్రకాశ్,**
సీనియర్ యూరాలజిస్ట్ అండ్ రొబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్,
యశోద హాస్పిటల్స్,
సోమాజిగూడ, హైదరాబాద్

# కింది నుంచి గ్యాస్‌పోతోందా?

కింది నుంచి గ్యాస్ పోయే సమస్య కేవలం ఆరోగ్యపరమైనది మాత్రమే కాదు. ఇది సామాజికంగా కూడా చాలా ఇబ్బందికరమైనదే. సమాజంలో గౌరవనీయమైన వ్యక్తులను సైతం నలుగురిలో నవ్వుల పాలు చేస్తుంది. కొన్ని కొన్ని చిన్న సూచనలతో దీన్ని చాలావరకు నివరించవచ్చు. ఆ సూచనలివే...

- **సరిపడని ఆహారాలకు దూరంగా ఉండాలి :** మనకు సరిపడని ఆహారాల కారణంగా కూడా కింది నుంచి గ్యాస్ పోతుంటంది. ఉదాహరణకు కొందరికి పాలతో అలర్జీ ఉంటుంది. వారు పాలు తాగగానే కింది నుంచి గ్యాస్ పాస్ కావడం మొదలవుతుంది. మనకు సరిపడని ఆహారపదార్థాలను గుర్తించి, వాటికి దూరంగా ఉండటం వల్ల ఈ ముప్పు తప్పిపోతుంది.
- **కొన్ని రకాల కూరలకు దూరంగా ఉండండి :** చాలామందికి క్యాబేజీ, బీన్స్, కాలీఫ్లవర్ వంటివి తిన్నప్పుడు కడుపులో గ్యాస్ నిండుతుంది. కింది నుంచి గ్యాస్ పోయేవారు మాత్రం ఇలాంటి ఆహారాలకు కాస్తంత దూరంగా ఉండటం లేదా బాగా తగ్గించి తినడం అవసరం. మిగతావారికి ఈ ఆహారాలు చాలా ఆరోగ్యకరమని గుర్తించండి. కేవలం గ్యాస్ ఇబ్బందిని తగ్గించుకోవడం కోసం మాత్రమే వీటిని చాలా పరిమితంగా తీసుకోవాలి.
- **ఉప్పు తగ్గించాలి :** ఆహారంలో ఉప్పు ఎక్కువగా వాడటం కూడా కింది నుంచి గ్యాస్‌పోయే సమస్యకు ఒక కారణం. ఆహారంలో ఉప్పు ఎక్కువగా వాడినప్పుడు అది కడుపు ఉబ్బరం ఎక్కువ కావడానికి దారితీస్తుంది. అందుకే ఉప్పు పాళ్లు ఎక్కువగా ఉండే పచ్చళ్లు, అప్పడాలవంటివి తగ్గించాలి. అలాగే కూరల్లో, పెరుగులో వేసుకునే ఉప్పు కూడా తగ్గించడం మంచిది.
- **మలబద్ధకం నివారణతో :** తగినన్ని పీచు పదార్థాలు ఉండే ఆహారాన్ని తీసుకోవడం మంచిది. ఇందుకోసం పొట్టుతీయని కాయ ధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం అవసరం. అలాగే నీళ్లు ఎక్కువగా తాగుతుండాలి. రోజూ కనీసం అరగంటకు తగ్గకుండా వ్యాయామం చేయడం వల్ల మలబద్ధకం తగ్గి కింది నుంచి గ్యాస్ పాస్ కావడం కూడా తగ్గుతుంది.
- **చ్యూయింగ్‌గమ్ నమలడం మానేయండి :** చ్యూయింగ్‌గమ్ నమిలే అలవాటు ఉన్నవారిలో అది నమిలే సమయంలో గాలిని ఎక్కువగా మింగడమూ జరుగుతుంటుంది. ఇలా మింగిన గాలే చాలాసందర్భాల్లో గ్యాస్ రూపంలో కింది నుంచి పోతూ ఉంటుంది. అలాగే మనం ఆహారాన్ని నమిలి మింగే సమయంలోనూ గాలిని మింగుతూ ఉంటాం. అయితే ఇలా మింగే గాలితో పోలిస్తే చ్యూయింగ్ గమ్ నమిలే సమయంలో మింగే గాలి మరీ ఎక్కువ. అందుకే చ్యూయింగ్ గమ్ నమిలే అలవాటు ఉన్నవారిలో గ్యాస్ ఎక్కువగా పోతుంటే... వారు ఆ అలవాటు తగ్గించుకోవాలి.
- **కృత్రిమ చక్కెరలు / గ్యాస్ ఉండే కార్బొనేటెడ్ డ్రింక్‌లతో :** కృత్రిమ చక్కెరలు/గ్యాస్ నిండి ఉండే కూల్‌డ్రింక్స్ వంటి శీతలపానియాల వల్ల కూడా కింది నుంచి గ్యాస్ పోవడం ఎక్కువగా జరుగుతుంటుంది. మనం శీతలపానియాలు తాగగానే కడుపు ఉబ్బరంగా ఉండటం చాలామంది గమనించే ఉంటారు. ఇలా చేరిన గాలి కూడా చాలా సందర్భాల్లో కింది నుంచి పోతూ ఉంటుంది. అందుకే కింది నుంచి గ్యాస్‌పోయేవారిలో శీతలపానియాలు తాగుతుంటే... ఆ అలవాటును బాగా పరిమితం చేసుకుంటే మంచిది.
- **బాగా నమిలి మింగాలి :** వేగంగా నమిలి మింగడం కంటే... నెమ్మదిగా, నింపాదిగా నమిలి మింగేవారిలో గాలి లోపలికి చాలా తక్కువగా ప్రవేశిస్తుంది. అదే గబగబా నమిలి మింగుతుంటే కడుపులోకి గాలి ఎక్కువగా వెళ్లి... అది కింది నుంచి పోయే అవకాశం ఉంది. అందుకే మనం తినే ఆహారాన్ని వీలైనంత నెమ్మదిగా, నింపాదిగా నమిలి మింగాలి. అలాగే ఒకేసారి ఎక్కువగా తినడం కంటే... తక్కువ (చిన్న చిన్న) మోతాదుల్లో ఎక్కువ సార్లు తింటుండాలి.
- ఇక ఆహారంలో కొవ్వులు జీర్ణం కావడానికి చాలా ఎక్కువ సమయమే పడుతుంది. అందుకే జీర్ణమయ్యే వ్యవధి పెరుగుతున్న కొద్దీ కింది నుంచి గ్యాస్‌పోయే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి ఆహారంలో కొవ్వులను తగ్గించాలి. కొవ్వులు తీసుకున్నప్పుడు ఎక్కువగా నీళ్లు తాగడం వల్ల కూడా ఈ సమస్యను తగ్గించవచ్చు.
- స్థూలకాయం ఉన్నవారిలో, ఒంటి బరువు ఎక్కువగా ఉన్నవారిలో కింది నుంచి గ్యాస్ పోవడం ఎక్కువ. అందుకే బరువును అదుపులో ఉంచుకోవాలి.

ఆహారంలో అల్లం, పుదీనా వంటివి గ్యాస్ సమస్యను తగ్గిస్తాయి. అందుకే కింది నుంచి గ్యాస్‌పోయే వారు వాటిని ఎక్కువగా వాడటం మంచిది.



హెల్త్ టిప్స్

- రోజూ ఒక ఆపిల్ తింటే అనారోగ్యం దరిచేరదని డాక్టర్లు చెబుతున్నారు. దీనిలో ఉండే ప్రోటీన్లు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఊపిరి తిత్తుల సామర్థ్యాన్ని పెంచుతాయి.
- క్యాన్సర్ కణాల ఉత్పత్తిని అదుపు చేసి, రక్తపోటును నియంత్రించి, కంటిచూపును బాగుపరిచే గుణాలు ఏప్రికాట్‌లో పుష్కలంగా ఉన్నాయి.
- అరటిపండు గుణాల గురించి మనకు తెలిసిందే. ఇందులో ఉండే పొటాషియం మెదడును చురుగ్గా ఉంచుతుంది. అతిసార వ్యాధిని నియంత్రిస్తుంది. అంతేకాదు ఇనుము ధాతువులను శరీరానికి అందిస్తుంది.
- గుండెపోటును నియంత్రించి, అధిక బరువుని తగ్గించడంలో ద్రాక్ష మహత్తరంగా పనిచేస్తుంది. ఇది మూత్రపిండాల్లో రాళ్లను అరికడుతుంది. వ్యాధులను దరిచేరనివ్వని శక్తి రోగనిరోధక వ్యవస్థకు ఉంటుంది. దీనిని బలోపేతం చేసే గుణాలు ఆరెంజ్‌లో పుష్కలంగా ఉన్నాయి. 'సి' విటమిన్ సమృద్ధిగా ఉండే ఆరెంజ్ శరీరానికి హాని కలిగించే కణజాలాన్ని నియంత్రిస్తుంది.





సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
సోమవారం 9-12-2019

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

## ఉద్యోగ సమాచారం

### బీహెచ్ఈఎల్-6

హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 6 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** సూపర్ స్పెషలిస్ట్-2, స్పెషలిస్టు-1, ఎంబీబీఎస్-3.
- **విభాగాలు:** జనరల్ సర్జరీ, యూరాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ.
- **అర్హత:** పోస్టును బట్టి ఎంబీబీఎస్, సంబంధిత విభాగంలో ఎంఎస్/డీఎన్‌బీ/డీఎం ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, డిసెంబర్ 1నాటికి 65 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 27, 2019.
- **వెబ్‌సైట్:** https://web.bhelhyd.co.in

### ఎన్ఐఈఎల్ఐటీ-328

ఢిల్లీలోని భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నీలిట్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఐటీ ట్రైనింగ్ అండ్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్-30, ప్రోగ్రామర్ అసిస్టెంట్-30, ఐటీ మేనేజర్-3, సీనియర్ ప్రోగ్రామర్-120, సీనియర్ ప్రోగ్రామర్ కేటఎల్-15, సిస్టమ్ అనలిస్ట్-6, అసిస్టెంట్ ప్రోగ్రామర్ -100, ప్రోగ్రామర్-15, ప్రాజెక్ట్/టీమ్ లీడ్-3, నెట్‌వర్క్ స్పెషలిస్ట్-6.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంసీఏ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.600.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 16, 2019.
- **వెబ్‌సైట్:** http://nielit.gov.in

### ఎన్‌సీఎల్-19

మహారాష్ట్ర (పుణె)లోని సీఎస్ఐఆర్-నేషనల్ కెమికల్ లాబొరేటరీ (ఎన్‌సీఎల్).. 19 సైంటిస్ట్, సీనియర్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** సైంటిస్ట్-11, సీనియర్ సైంటిస్ట్-8.
- **అర్హత:** పోస్టులను బట్టి ఇంజనీరింగ్ డిగ్రీ, సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** సైంటిస్టు పోస్టులకు 32 ఏళ్లు; సీనియర్ సైంటిస్టు పోస్టులకు 37 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 6, 2020.
- **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** జనవరి 24, 2020.
- **వెబ్‌సైట్:** www.ncl.res.in

ఎమర్జింగ్ కెరీర్



# మీడియాలో డిజిటల్ జాబ్స్

» విస్తరిస్తున్న డిజిటల్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగం
» రానున్న అయిదేళ్లలో లక్షల ఉద్యోగాలకు వేదిక
» పుట్టుకొస్తున్న సరికొత్త జాబ్ ప్రొఫైల్స్

మీడియా.. ఎంటర్‌టైన్‌మెంట్.. ప్రస్తుతం సమాచారం కోసం, వినోదం కోసం ప్రతి ఒక్కరి వ్యాపకం. నిరంతరం వార్తల కోసం న్యూస్ అప్‌డేట్స్ మొదలు వీడియో గేమ్స్ వంటి ఎంటర్‌టైన్‌మెంట్ వరకూ... అందరూ ఆసక్తి చూపుతున్న వైనం! ఇదే ఇప్పుడు యువతకు సరికొత్త కొలువులకు వేదికగా మారుతోంది!! పలు సర్వేల ప్రకారం- రానున్న అయిదేళ్లలో దేశంలో.. మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగం 13.10 శాతం వృద్ధి సాధించనుంది. ఫలితంగా ఈ రంగంలో యువతకు భారీ స్థాయిలో రకరకాల ఉద్యోగాలు అందివచ్చే అవకాశముందని అంచనా. ఈ నేపథ్యంలో.. మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో లభించే కొలువులు, అర్హతలు, కెరీర్ స్కోప్ గురించి తెలుసుకుందాం..

ఒకప్పుడు.. మీడియా (ప్రింట్, ఎలక్ట్రానిక్) అంటే వార్తల ప్రచురణ, ప్రసార సాధనాలు మాత్రమే. టీవీలు, రేడియోలు, దినపత్రికల ద్వారా వార్తలు అందించే మార్గాలనే మీడియాగా భావించిన వైనం. కాని ఇప్పుడు టెక్నాలజీ ప్రవేశంతో మీడియా కొత్త పుంతలు తొక్కుతోంది. ముఖ్యంగా ప్రస్తుత స్మార్ట్‌ఫోన్స్ యుగంలో ప్రధాన మీడియాతోపాటు డిజిటల్ మీడియా కీలకంగా మారింది. అంతే కాకుండా మీడియా అంటే కేవలం వార్తలే కాదు.. ఇంకా ఎన్నో..! అనే పరిస్థితి నెలకొంది. టీవీ, వార్తా పత్రికలతోపాటు యూట్యూబ్ ఛానెల్స్, న్యూస్ యాప్స్, సోషల్ మీడియా వంటివి తెరపైకి వస్తున్నాయి. మరోవైపు ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో.. యానిమేషన్, గేమింగ్‌కు విస్తృతంగా ఆదరణ లభిస్తోంది. ఇది ఈ రంగం శరవేగంగా వృద్ధి బాటలో పయనించడంతోపాటు సదరు విభాగాల్లో వినూత్న ఉద్యోగాల కల్పనకు ఊతమిస్తోంది.

### మీడియా.. డిజిటల్ రూపం

ప్రస్తుతం మీడియా రంగంలో డిజిటల్ విస్తృతి పెరుగుతోంది. న్యూస్ వెబ్‌సైట్స్, న్యూస్ యాప్స్, బ్లాగ్స్ వంటి వాటి వినియోగం అధికమైంది. అలాగే వెబ్ ఆధారంగా ఉండే సోషల్ మీడియా సైతం విస్తరిస్తోంది. గతేడాది మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగం 13 శాతానికిపైగా వృద్ధి సాధిస్తే.. ఇందులో సింహభాగం డిజిటల్ మీడియా విభాగాలదే! ఆయే సర్వేల ప్రకారం-2020 చివరి నాటికి డిజిటల్ మీడియా మూడు రెట్లు వృద్ధి సాధించనుంది. రానున్న అయిదేళ్లలో మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో దాదాపు ఎనిమిది లక్షల మందికి ఉపాధి లభించనుందని బీసీజీ (బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్)-సీఐఐ (కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ)లు సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో తేలింది. ఇందులో దాదాపు 40శాతం ఉద్యోగాలు డిజిటల్, వెబ్ మీడియాలోనే లభించనుండటం విశేషం. ఇప్పటికే ఈ రంగంలో దాదాపు 50లక్షల మంది ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి పొందుతున్నట్లు అంచనా.

### డిజిటల్ మీడియా అడ్వర్టయిజింగ్

ప్రస్తుతం మంచి అవకాశాలు కల్పిస్తున్న విభాగం.. డిజిటల్ మీడియా అడ్వర్టయిజింగ్. ఆన్‌లైన్ విధానంలో ప్రకటనలు సేకరించడాన్ని డిజిటల్ మీడియా అడ్వర్టయిజింగ్ లేదా న్యూమీడియా అడ్వర్టయిజింగ్‌గా పేర్కొంటున్నారు. వీటికి సంబంధించి వెబ్‌సైట్స్, ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్స్ ప్రధాన ఉపాధి వేదికలు.

### వెబ్ డెవలపర్స్

న్యూస్ వెబ్‌సైట్స్‌ను వీక్షకులను ఆకట్టుకునే రీతిలో రూపొందించడం, సంస్థల్లో వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్ ఆధారంగా వెబ్ డెవలప్‌మెంట్ చేయడం వెబ్ డవలపర్స్ ప్రధాన విధి. ఇందులో టెక్నికల్ నైపుణ్యాలతోపాటు వెబ్ డెవలప్‌మెంట్‌లో సర్టిఫికేషన్ ఉన్న వారికి ప్రాధాన్యం లభిస్తోంది. ప్రారంభంలో నెలకు రూ.20వేల వరకు వేతనం అందుతోంది. అనుభవం, నైపుణ్యాలతో ఫ్రీ లాన్సింగ్ విధానంలోనూ పని చేసే అవకాశం ఉంది.

### సోషల్ మీడియా మేనేజర్

ప్రస్తుతం విస్తృతంగా వినియోగంలోకి వస్తున్న విభాగం.. సోషల్ మీడియా. ప్రధాన మీడియా సంస్థలు సైతం సోషల్ మీడియా లింక్స్ ఆధారంగా వార్తలను అందిస్తున్నాయి. ఈ విభాగంలో సోషల్ మీడియా మేనేజర్ పోస్టులకు మంచి డిమాండ్ ఉంది. వార్తలను సోషల్ మీడియా వెబ్‌సైట్స్‌లో ప్రాధాన్యత క్రమంలో ముందుగా కనిపించేలా చేయడం సోషల్ మీడియా మేనేజర్స్ ప్రధాన విధి. ఎస్ఈఓ, ఎస్ఈఎం నైపుణ్యాలున్న వారు సోషల్ మీడియా మేనేజర్లుగా రాణించొచ్చు.

### ఎస్ఈఓ స్పెషలిస్ట్

డిజిటల్ మీడియా విస్తరణతోపాటే వెబ్‌సైట్స్, బ్లాగ్స్ అనేకం తెరపైకి వస్తున్నాయి. తాజా వార్తలను వేగంగా అందిస్తున్నాయి. కానీ సదరు వెబ్‌సైట్స్, బ్లాగ్స్‌కు ఆదరణ లభించాలంటే.. సెర్చ్ ఇంజన్‌లో ముందు వరుసలో నిలవాలి. అందుకోసం సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్(ఎస్ఈఓ) స్పెషలిస్ట్‌ల సేవలకు ప్రాధాన్యం పెరుగుతోంది. సదరు వెబ్‌సైట్ ప్రత్యేకతలు తెలియజేస్తూ ఆకట్టుకునే రీతిలో కంటెంట్ రూపొందించడం.. ఒక వార్తకు సంబంధించి కీ వర్డ్స్‌ను, ట్యాగ్స్‌ను విభిన్నంగా రాసి.. సదరు వార్తను సెర్చ్ చేసే క్రమంలో ముందంజలో నిలిపేలా చేయడం ఎస్ఈఓ స్పెషలిస్ట్ ప్రధాన విధులు.

### వీరికి ప్రాధాన్యం

డిజిటల్ మీడియా విభాగంలో కంటెంట్ డెవలపర్స్, కంటెంట్ రైటర్స్, వెబ్ డెవలపర్స్‌కు ప్రాధాన్యం లభిస్తోంది.

### కొత్త తరం కొలువులు

ప్రస్తుతం మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో లభిస్తున్న కొత్త తరం ఉద్యోగాలు.. » సోషల్ ఎంగేజ్‌మెంట్ మేనేజర్ » సోషల్ మీడియా లిజనర్స్ » యూఐ/యూఎక్స్ డిజైనర్స్ » సెన్సార్ ఆర్కిటెక్ట్స్ » టెస్టింగ్ ఇంజనీర్ » యాప్ డెవలపర్ » వీఆర్ డిజైనర్ » 3డి మోడలింగ్ ఇంజనీర్/3డి మోడలింగ్ గ్రాఫిక్ ఆర్టిస్ట్ » డేటా ఆర్కిటెక్ట్ » డేటా అనలిస్ట్ » క్లౌడ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.

### ముఖ్యాంశాలు

- మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ప్రస్తుతం 40 లక్షల మందికి ఉపాధి లభిస్తోంది.
- సేవల రంగంలో ఉపాధి పరంగా ప్రస్తుతం మీడియా అండ్ ఎంటర్‌టెయిన్‌మెంట్ రంగం మూడో స్థానంలో ఉంది.
- 2023 నాటికి ఈ రంగంలో దాదాపు రెట్టింపు కానున్న ఉద్యోగాల సంఖ్య. వీటిలో 40 శాతం మేరకు డిజిటల్ మీడియా ఉద్యోగాలే!
- ఎస్ఈఓ, ఆన్‌లైన్ అడ్వర్టయిజింగ్ ఎగ్జిక్యూటివ్స్, వెబ్ డెవలపర్స్‌కు పెరగనున్న డిమాండ్.
- యాప్ డెవలప్‌మెంట్, గేమింగ్ విభాగాల్లోనూ పెరుగుతున్న అవకాశాలు.
- అర్హతలు, హోదాలను బట్టి ప్రారంభంలో సగటున నెలకు కనిష్టంగా రూ.15 వేలు; గరిష్టంగా రూ.40 వేల వరకు వేతనం.
- మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలోనూ ఏఐ, డేటా అనలిటిక్స్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం.
- ప్రధానంగా ఓటీటీ సెగ్మెంట్‌లో యాభై శాతం మేరకు ఏఐ, డేటా అనలిటిక్స్ ఉద్యోగాలు.

### ఎంటర్‌టైన్‌మెంట్‌లో ఇలా

ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో.. గేమింగ్, యానిమేషన్, యూట్యూబ్ ఛానెల్స్, ఎఫ్ఎం రేడియో తదితర విభాగాల్లో కొలువులకు కొదవ లేదు. సృజనాత్మకత, తాజా పరిస్థితులకు అనుగుణంగా వీక్షకుల ఆసక్తులను గమనిస్తూ.. ఆయా విభాగాలకు సంబంధించిన సేవలను అందించే నైపుణ్యం ఉంటే చాలు.. అవకాశాలు పుష్కలం. యూట్యూబ్ ఛానెల్స్, రేడియో విభాగాల్లో.. కంటెంట్ రైటర్స్, కంటెంట్ అప్‌లోడర్స్, రేడియో జాకీ(వ్యాఖ్యాత), కెమెరామెన్, వీడియో ఎడిటర్స్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి. గేమింగ్‌లో... గేమ్ డిజైనర్, గేమ్ ప్రోగ్రామర్, యానిమేటర్, సౌండ్ ఇంజనీర్, వీఎఫ్ఎక్స్ ఆర్టిస్ట్, 3-డి డిజైనర్స్ వంటి జాబ్స్ సొంతం చేసుకోవచ్చు.

#### టెక్నికల్ ఉద్యోగాలు

ప్రస్తుతం మీడియా,ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో.. కోర్ టెక్నికల్ ఉద్యోగాలు సైతం సొంతం చేసుకోవచ్చు. సౌండ్ ఇంజనీర్, 3-డి డిజైన్ ఎక్స్‌పర్ట్స్, గేమ్ ప్రోగ్రామర్స్, వెబ్ ప్రోగ్రామర్స్ వంటి కొలువులకు ఆయా విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ, డిప్లొమా స్థాయిలో సాంకేతిక కోర్సులు పూర్తి చేసి ఉండాలి.



#### కంటెంట్ రైటర్స్

కంటెంట్ రైటర్, కంటెంట్ డెవలపర్ వంటి ఉద్యోగాలకు జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్‌లో డిప్లొమా, పీజీ డిప్లొమా, బ్యాచిలర్, పీజీ డిగ్రీలు పూర్తి చేయాలి. ఈ అర్హతలు ఉంటే... తేలిగ్గానే ఉద్యోగాలు లభిస్తున్నాయి.

#### కోర్సులు

» ఎంటర్‌టైన్‌మెంట్, యానిమేషన్ తదితర విభాగాల్లో ఉద్యోగాలు కోరుకునే వారు.. » బీఏ (గ్రాఫిక్స్ అండ్ మేనేజ్‌మెంట్) » బీఏ(డిజిటల్ ఫిలిం మేకింగ్ అండ్ యానిమేషన్) » బీఏ(యానిమేషన్ అండ్ కంప్యూటర్ గ్రాఫిక్స్) » బీఎస్సీ(యానిమేషన్, గేమ్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్) వంటి కోర్సులు పూర్తి చేసుకోవచ్చు.

- పీజీ స్థాయిలో పలు యూనివర్సిటీల్లో ఎంఏ, ఎమ్మెస్సీ కోర్సుల్లో మల్టీ మీడియా, యానిమేషన్ స్పెషలైజేషన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు పలు ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్ వీఎఫ్ఎక్స్ డిజైన్, యానిమేషన్, గ్రాఫిక్స్ విభాగాల్లో సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నాయి.

### డిజిటల్ మీడియా కోర్సులు.. ఇన్‌స్టిట్యూట్‌లు

- **ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్**
  **కోర్సులు:** ఎస్ఈఓ, ఎస్ఈఎం, సోషల్ మీడియా అండ్ డిజిటల్ మార్కెటింగ్
  **వెబ్‌సైట్:** www.aima.in
- **Thedmti**
  **(డిజిటల్ మార్కెటింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్)**
  **కోర్సు:** డిజిటల్ మీడియా మార్కెటింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఎస్ఈఓ తదితర కోర్సులు.
  **వెబ్‌సైట్:** www.thedmti.com
- **ఎడ్యుకార్ట్**
  **కోర్సులు:** డిజిటల్ మీడియాలో పలు ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు
  **వెబ్‌సైట్:** www.edukart.com
- **ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ మార్కెటింగ్ ఇండియా**
  **కోర్సులు:** ఎస్ఈఓ, ఎస్ఈఎం, డిజిటల్ మార్కెటింగ్ తదితర కోర్సులు
  **వెబ్‌సైట్:** www.digitalmarketing.ac.in
- **డిజిటల్ మార్కెటింగ్ అకాడమీ**
  **కోర్సులు:** ఎస్ఈఓ, ఎస్ఎంఓ, సెర్చ్ ఇంజన్ మార్కెటింగ్ తదితర కోర్సులు
  **వెబ్‌సైట్:** www. digitalmarketingacademy.co.in

# ఇంటర్‌తోనే కేంద్ర కొలువు

» కేంద్ర ప్రభుత్వ శాఖల్లో అసిస్టెంట్ ఉద్యోగాలకు నోటిఫికేషన్
» ఇంటర్ అర్హతతో కేంద్రంలో ఉద్యోగం ఖాయం చేసుకోవచ్చు
» మూడంచెల్లో(టైర్-1, టైర్-2, టైర్-3) ఎంపిక ప్రక్రియ
» ఎంపికైతే నెలకు రూ.40వేలకు పైగా వేతనం.
» జనవరి 10,2020 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ




కేంద్ర ప్రభుత్వ శాఖల్లో అసిస్టెంట్, డేటాఎంట్రీ ఆపరేటర్, పోస్టల్ అసిస్టెంట్, దిగువ స్థాయి క్లర్క్ ఉద్యోగాల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ)... కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్(సీహెచ్ఎస్ఎల్)-2020కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్ అర్హతతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం ఖాయం చేసుకునే చక్కటి అవకాశం సీహెచ్ఎస్ఎల్ ద్వారా లభిస్తుంది. ఎంపికైతే ప్రారంభంలోనే నెలకు రూ.41వేల వరకూ వేతనం పొందొచ్చు. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ-సీహెచ్ఎస్ఎల్-2020 నోటిఫికేషన్ వివరాలు.. ఎంపిక ప్రక్రియ.. ప్రిపరేషన్ గైడెన్స్..

### అర్హత

- ఎస్ఎస్‌సీ-సీహెచ్ఎస్ఎల్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హత..ఇంటర్మీడియెట్/10+2 ఉత్తీర్ణత
- కాగ్ కార్యాలయంలో డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు మాత్రం ఇంటర్మీడియెట్/10+2 స్థాయిలో మ్యాథ్స్ తప్పనిసరి సబ్జెక్టుగా సైన్స్ స్ట్రీమ్ చదివి ఉండాలి.

### పోస్టులు- వేతనాలు

- **లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్డీసీ)/ జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్:** పే స్కేల్ 2 - రూ.19,900 - రూ.63,200.
- **పోస్టల్ అసిస్టెంట్/సార్టింగ్ అసిస్టెంట్; డేటాఎంట్రీ ఆపరేటర్(డీఈవో); డేటాఎంట్రీ ఆపరేటర్(డీఈవో) గ్రేడ్ ఎ:** పేస్కేల్ 4-రూ.25,500-రూ. 81,100.

### వయసు

2020, జనవరి1 నాటికి 18-27 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయో సడలింపు ఉంటుంది.

### ఎంపిక విధానం

ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో మూడంచెల విధానంలో(టైర్-1, టైర్-2, టైర్-3) జరుగుతుంది. మొదట టైర్-1 కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధిస్తే.. టైర్-2కు అర్హత లభిస్తుంది. టైర్-2 డిస్క్రిప్టివ్ పరీక్ష. ఇది పెన్, పేపర్ విధానంలో 100 మార్కులకు జరుగుతుంది. ఇక తుదిగా టైర్-3లో భాగంగా టైపింగ్ టెస్ట్/స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇది అర్హత పరీక్ష మాత్రమే. టైర్-1, 2ల్లో వచ్చిన మార్కుల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది.

### టైర్-1 చాలా కీలకం

- తొలి దశలో జరిగే టైర్-1 కంప్యూటర్ ఆధారిత పరీక్ష. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు-50 మార్కులకు; జనరల్ ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు-50 మార్కులకు; క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్(బేసిక్ అర్థమెటిక్ స్కిల్స్) 25 ప్రశ్నలు-50 మార్కులకు; జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు-50 మార్కులకు ఉంటాయి. మొత్తంగా టైర్-1 పరీక్ష 100 ప్రశ్నలు-200 మార్కులకు జరుగుతుంది. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ప్రశ్న పత్రం ఇంగ్లిష్/ హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. నెగెటివ్ మార్కులు ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికి అర మార్కు కోత విధిస్తారు. ఈ పరీక్ష సమయం 60 నిమిషాలు.

### టైర్-2: డిస్క్రిప్టివ్

- టైర్-2 పరీక్ష గంట వ్యవధిలో 100 మార్కులకు ఉంటుంది. 200-250 పదాల్లో ఎస్సే, 150-200 పదాల్లో లెటర్/అప్లికేషన్ రాయాలి. ఈ పరీక్షలో ఉత్తీర్ణతకు కనీసం 33 శాతం మార్కులు సాధించాలి. సమాధానాలను ఇంగ్లిష్/హిందీలో మాత్రమే రాయాలి. టైర్-2 మార్కులను కూడా మెరిట్ లిస్ట్ రూపకల్పనలో పరిగణనలోకి తీసుకుంటారు.
- ఎస్సే రైటింగ్‌లో సామాజిక సమస్యలు, రాజకీయాలు, ప్రభుత్వ పథకాలు, పరిపాలన, ఫైనాన్స్, ఎకానమీ, పర్యావరణ సమస్యలు, క్రీడలు, దేశంతో ముడిపడి ఉన్న ముఖ్యమైన, వివాదాస్పదమైన సమస్యల నుంచి ప్రశ్నలు అడగవచ్చు. అప్లికేషన్, లెటర్ రైటింగ్ టాపిక్స్‌లో.. మన చుట్టూ నిత్యం ఎదురయ్యే ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేయడం.. మన దగ్గరి వారికి ఏదైనా ఒక అంశంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ లెటర్ రాయడం.. అవేర్‌నెస్ కల్పించే విధంగా అప్లికేషన్ రాయడం.. తదితర వాటిని ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది.

### టైర్-3: ఇది అర్హత పరీక్ష మాత్రమే

ఇందులో వచ్చిన మార్కులను మెరిట్ లిస్ట్ రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోరు. పోస్టల్/సార్టింగ్ అసిస్టెంట్, ఎల్‌డీసీ, కోర్టు క్లర్క్ పోస్టులకు అభ్యర్థి టైపింగ్ స్పీడ్‌ను పరీక్షిస్తారు. స్కిల్ టెస్ట్ మీడియం 'ఇంగ్లిష్' అని పేర్కొన్న అభ్యర్థుల టైపింగ్ స్పీడ్ నిమిషానికి 35 పదాలు; హిందీ అభ్యర్థుల టైపింగ్ స్పీడ్ నిమిషానికి 30 పదాలు ఉండాలి. ఇచ్చిన అంశాన్ని 10 నిమిషాల వ్యవధిలో కంప్యూటర్‌పై ఎంత కచ్చితంగా టైపింగ్ చేశారనే దాన్ని బట్టి టైపింగ్ స్పీడ్‌ను పరీక్షిస్తారు. డీఈవో పోస్టులకు అభ్యర్థుల డేటా ఎంట్రీ స్పీడ్‌ను పరీక్షిస్తారు.

### ముఖ్య సమాచారం

» **ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేది:** 2020, జనవరి 10
» **టైర్-1 పరీక్ష తేదీలు:** 2020, మార్చి 16 నుంచి మార్చి 27 వరకు
» **టైర్-2 పరీక్ష తేదీ(డిస్క్రిప్టివ్ పరీక్ష తేదీ):** 2020, జూన్ 28
» **వెబ్‌సైట్:** https://ssc.nic.in

## ప్రిపరేషన్.. పటిష్టంగా..

### ఇంగ్లిష్ కాంప్రెహెన్షన్

- సీహెచ్ఎస్ఎల్‌లో ఇంగ్లిష్ సబ్జెక్టుకు ప్రాధాన్యత ఎక్కువ. టైర్-1తోపాటు టైర్ 2లోనూ రైటింగ్ పార్ట్ ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌లో ఇంగ్లిష్‌పై కొంత ఎక్కువ దృష్టిపెట్టడం లాభిస్తుంది. అంతేకాకుండా ఇంగ్లిష్ ప్రిపరేషన్ భిన్నంగా ఉండాలి. సబ్జెక్టును ఆబ్జెక్టివ్ విధానంలో కాకుండా.. డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో నేర్చుకోవాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ ఇంగ్లిష్‌లో రాయాల్సి ఉంటుంది. కాబట్టి ప్రాథమిక కాన్సెప్టులను బాగా అర్థం చేసుకోవాలి. గ్రామర్‌పై పట్టు సాధించడం తప్పనిసరి.
- స్పాటింగ్ ద ఎర్రర్స్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, సెంటెన్స్ రీ అరెంజ్‌మెంట్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, డైరెక్ట్/ఇన్‌డైరెక్ట్ స్పీచ్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్ మొదలైన విభాగాల్లో రాణించేలా కృషి చేయాలి. ఇంగ్లిష్‌లో పట్టుకోసం ప్రతి రోజూ ఏదో ఒక ప్రామాణిక ఇంగ్లిష్ దినపత్రిక చదువుతూ కొత్త పదాలు నేర్చుకోవాలి. ఇంగ్లిష్ పేపర్ చదివేటప్పుడు ఎడిటోరియల్స్ చదవడం వల్ల వొకాబ్యులరీ తోపాటు టైర్-2కు అవసరమైన నాలెడ్జ్‌ను కూడా పెంచుకోవచ్చు.

### జనరల్ ఇంటెలిజెన్స్

తక్కువ సమయంలో మంచి మార్కులు పొందేందుకు వీలున్న విభాగం ఇది. ఇందులో గరిష్టంగా స్కోర్ చేసేందుకు కృషి చేయాలి. వెర్బల్, నాన్ వెర్బల్‌పై ప్రశ్నలు వస్తున్నాయి. ఇందులో సిరీస్(నంబర్/ఆల్ఫా న్యూమరిక్) విభాగం, అనాలజీస్, ఆడ్ మెన్ ఔట్, సిలాయిజమ్, మాట్రిక్స్, దిశలు, వర్డ్ ఫార్మేషన్, బ్లడ్ రిలేషన్స్, నాన్‌వెర్బల్ (వాటర్ ఇమేజ్, మిర్రర్ ఇమేజ్), కోడింగ్- డీకోడింగ్ మొదలైన టాపిక్స్ మీద ప్రశ్నలు అడుగుతున్నారు. ఏదైనా ఒక ప్రామాణిక పుస్తకం తీసుకొని ప్రాక్టీస్ చేస్తే సరిపోతుంది. తక్కువ సమయంలోనే ప్రిపరేషన్ పూర్తి చేసుకోవడంతోపాటు కచ్చితంగా స్కోరు చేసుకునేందుకు అవకాశం ఉన్న సెక్షన్ ఇది. బేసిక్స్ నేర్చుకోవడానికి యూట్యూబ్‌లో ఎన్నో వీడియోలు అందుబాటులో ఉన్నాయి.

### క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఇందులో నంబర్ సిస్టమ్స్, శాతాలు, రేషియో అండ్ ప్రపోర్షన్, స్క్వేర్ రూట్స్, యావరేజెస్, సింపుల్ ఇంట్రెస్ట్, కాంపౌండ్ ఇంట్రెస్ట్, లాభనష్టాలు, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్, మిక్చర్ అండ్ అలిగేషన్స్, భాగస్వామ్యాలు చాప్టర్ల నుంచి కనీసం ఒక ప్రశ్న చొప్పున వచ్చే అవకాశం ఉంది. అలాగే త్రికోణమితి, ఆల్జీబ్రా, క్షేత్రగణితం, రేఖాగణితం, డేటా ఇంటర్‌ప్రిటేషన్ సెక్షన్ల నుంచి ప్రశ్నలు ఉంటాయి. మ్యాథమెటిక్స్‌లో సర్కిల్స్, ట్రిగనోమెట్రీ, జామెట్రీ, ఆల్జీబ్రా, మెన్సురేషన్ తదితర అంశాలు చాలా కీలకం. వీటి నుంచే దాదాపు సగం ప్రశ్నలు వస్తుంటాయి. వీటిలో స్కోరు కోసం తొలుత బేసిక్స్‌పై దృష్టిసారించాలి. ఈజీ టు హార్డ్ క్రమంలో సమస్యల సాధన అలవరచుకోవాలి. ఈ సెక్షన్‌కు సంబంధించి స్కోరు చేయడానికి ఏకైక మార్గం ప్రాక్టీస్.

### జనరల్ అవేర్‌నెస్

జనరల్ అవేర్‌నెస్‌లో తక్కువ సమయంలో ఎక్కువ స్కోరు చేయడానికి వీలుంది. బాగా ప్రిపేర్ అయితే 10 నిమిషాల లోపే ప్రశ్నలకు సమాధానాలు గుర్తించవచ్చు. ఈ విభాగంలో జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలు, జనరల్ సైన్స్, ఎకానమీ, హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ అంశాల నుంచి ప్రశ్నలు వస్తున్నాయి. ఏదైనా ఒక ప్రామాణిక పుస్తకాన్ని తీసుకొని ప్రిపరేషన్ సాగించడం మేలు!!

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
9-12-2019



## వాహ్ క్యాచ్... వారెవ్వా కోహ్లి!

మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా కోహ్లి పట్టిన క్యాచ్ హైలైట్‌గా నిలిచింది. జడేజా ఇన్నింగ్స్ 14వ ఓవర్లో హెట్‌మైర్ 2 వరుస సిక్సర్లు బాదేశాడు. మరుసటి బంతికీ భారీ షాట్‌నే బాదాడు. లాంగాన్‌లో ఉన్న కోహ్లి మెరుపు వేగంతో పరుగెత్తుకుంటూ వచ్చి బౌండరీ దగ్గర అద్భుతంగా క్యాచ్‌ను అందుకున్నాడు. లిప్తపాటు కాలంలోనే క్యాచ్‌ను పట్టేయడం... అసాధారణ వేగాన్ని నియంత్రించుకొని... బౌండరీ లైన్‌కు తగిలే సమయంలో చేతిని తాకకుండా చేయడం అన్నీ కళ్లు మూసి తెరిచేలోపే జరిగిపోయాయి. వారెవ్వా క్యాచ్ అంటూ స్టేడియం చప్పట్లతో మోగిపోయింది.

## శభాష్ మానస్

### ఎడ్డీ హెర్ ఐటీఎఫ్ టోర్నీ టైటిల్ నెగ్గిన తొలి భారతీయ ప్లేయర్‌గా ఘనత



**ఫ్లోరిడా (అమెరికా):** అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) సర్క్యూట్‌లో జూనియర్ గ్రాండ్‌స్లామ్ టోర్నీగా పరిగణించే ఎడ్డీ హెర్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో సింగిల్స్ టైటిల్ నెగ్గిన తొలి భారతీయ ప్లేయర్‌గా మానస్ ధామ్నె చరిత్ర సృష్టించాడు. ఫ్లోరిడాలో శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన అండర్–12 బాలుర సింగిల్స్ ఫైనల్లో పుణేకి చెందిన 11 ఏళ్ల మానస్ 3–6, 6–0, 10–6తో 'సూపర్ టైబ్రేక్'లో మాక్స్‌వెల్ ఎక్స్‌టెడ్ (అమెరికా)పై విజయం సాధించాడు. డబుల్స్ విభాగంలో మానస్ రన్నరప్‌గా నిలిచాడు. ఫైనల్లో మానస్ (భారత్)–ఆరవ్ హడా (నేపాల్) జంట 6–7 (5/7), 2–6తో సెహ్యూక్ చో–మిన్సెక్ మాయెంగ్ (కొరియా) జోడీ చేతిలో ఓడిపోయింది.

జూనియర్స్ విభాగంలో ఎడ్డీ హెర్ ఓపెన్, ఆరెంజ్ బౌల్ ఓపెన్ టోర్నీలను గ్రాండ్‌స్లామ్ టోర్నీలుగా భావిస్తారు. 2008లో యూకీ బాంబ్రీ ఆరెంజ్ బౌల్ ఓపెన్ విజేతగా నిలిచాడు. అదే ఏడాది ప్రపంచ జూనియర్ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. ఎడ్డీ హెర్ టోర్నీలో 90 దేశాల నుంచి 2 వేల మంది జూనియర్ ఆటగాళ్లు అండర్–12, అండర్–14, అండర్–16 బాలబాలికల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీపడ్డారు. గతంలో షరపోవా (రష్యా), ఆండీ రాడిక్ (అమెరికా) తదితరులు ఈ టోర్నీలో విజేతలుగా నిలిచి ఆ తర్వాత సీనియర్స్ విభాగంలోనూ మెరిపించారు.

## చాంప్ మానవ్



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) చాలెంజ్ సిరీస్ నార్త్ అమెరికన్ ఓపెన్ టోర్నమెంట్‌లో భారత ప్లేయర్ మానవ్ ఠక్కర్ విజేతగా నిలిచాడు. కెనడాలో జరిగిన ఈ టోర్నీలో మానవ్ పురుషుల అండర్–21 సింగిల్స్ విభాగంలో టైటిల్ సాధించాడు. ఫైనల్లో మానవ్ 11–3, 11–5, 11–6తో మార్టిన్ బెన్‌టాన్‌కోర్ (అర్జెంటీనా)పై విజయం సాధించాడు. అండర్–21 విభాగంలో ఐటీటీఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్ సాధించిన నాలుగో భారతీయ ప్లేయర్‌గా మానవ్ గుర్తింపు పొందాడు. గతంలో సత్యన్ జ్ఞానశేఖరన్ (2012–బ్రెజిల్ ఓపెన్), హర్మీత్ దేశాయ్ (2012–ఈజిప్ట్ ఓపెన్), సౌమ్యజిత్ ఘోష్ (2011–చిలీ ఓపెన్) ఈ ఘనత సాధించారు.

## హైదరాబాద్ ఓటమి

**సాక్షి, హైదరాబాద్:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) తాజా సీజన్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ పరిస్థితి మారలేదు. ఆదివారం ఇక్కడి జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 1–0తో గోవా ఎఫ్‌సీ చేతిలో ఓడింది. దీంతో సీజన్‌లో ఐదో ఓటమిని నమోదు చేసుకుంది. గోవా తరఫున 68వ నిమిషంలో ఫెర్నాండెస్ కార్నర్ కిక్‌ను హెడర్‌తో గోల్‌గా మలిచిన మన్‌వీర్ సింగ్ జట్టుకు 1–0 ఆధిక్యాన్నిచ్చాడు. అనంతరం గోల్ కోసం హైదరాబాద్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నేడు జరిగే మ్యాచ్‌లో చెన్నైయిన్ ఎఫ్‌సీతో జమ్‌షెడ్‌పూర్ ఆడుతుంది.

# భారత్‌కు భంగపాటు

- రెండో టి20లో టీమిండియా ఓటమి
- శివమ్ దూబే మెరుపులు వృథా
- విండీస్‌ను గెలిపించిన సిమన్స్
- సిరీస్ 1–1తో సమం
- 11న ముంబైలో ఆఖరి పోరు

*ఎదురులేదనుకున్న బ్యాటింగ్ ఆర్డర్ చెల్లాచెదురైంది. ప్రభావం చూపెట్టాల్సిన బౌలింగ్ తేలిపోయింది. మొత్తానికి భారత్ ఆట గాడి తప్పింది. వేగం పెంచాల్సిన చోట వికెట్లను కోల్పోవడం... ఆ తర్వాత ఏమాత్రం జోరందుకోలేకపోవడం... టీమిండియా భారీస్కోరుకు కళ్లెం వేసింది. విండీస్ ముందుగా బౌలింగ్‌తో ప్రత్యర్థిని నిలువరించింది. అనంతరం బ్యాటింగ్ మెరుపులతో సులువుగా నెగ్గింది. కీలకదశలో భారత ఫీల్డర్లు క్యాచ్‌లు వదిలేయడం కూడా వారికి కలిసొచ్చింది.*

**తిరువనంతపురం:** ప్రత్యర్థి జోరు ముందు భారత్ తలవంచింది. బ్యాటింగ్‌లో ఎదురుదాడి, బౌలింగ్‌లో వాడి లేక రెండో టి20లో టీమిండియా ఓడింది. ఆదివారం జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో వెస్టిండీస్ 8 వికెట్ల తేడాతో విరాట్ కోహ్లి బృందాన్ని ఓడించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–1తో నిలిచింది. ముందుగా భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 170 పరుగులు చేసింది. శివమ్ దూబే (30 బంతుల్లో 54; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధశతకం సాధించగా, పంత్ (22 బంతుల్లో 33 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన వెస్టిండీస్ 18.3 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసి గెలిచింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' సిమన్స్ (45 బంతుల్లో 67 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) జట్టు గెలిచేదాకా భారత బౌలర్లతో తలపడ్డాడు. లూయిస్ (35 బంతుల్లో 40; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు.

**ఓపెనర్ల వైఫల్యం...**

టాస్ నెగ్గిన విండీస్ బౌలింగ్ ఎంచుకుంది. భారత్ మార్పుల్లేకుండా బరిలోకి దిగగా... విండీస్ తుది జట్టులో రామ్‌దిన్ స్థానంలో నికోలస్ పూరన్‌ను తీసుకుంది. అయితే భారత ఇన్నింగ్స్ ఆరంభించిన ఓపెనర్లు రాహుల్ (11; 1 ఫోర్), రోహిత్ శర్మ (15; 2 ఫోర్లు) శుభారంభం అందించలేకపోయారు. నాలుగో ఓవర్లోనే రాహుల్‌ను పియరీ పెవిలియన్ చేర్చగా... మరో నాలుగు ఓవర్లకు హోల్డర్ బంతిని అంచనా వేయడంలో విఫలమైన రోహిత్ క్లీన్‌బౌల్డయ్యాడు. దీంతో 56 పరుగులకే ఓపెనర్లిద్దరూ పెవిలియన్ చేరారు.

**జోరుకు బ్రేకులు...**

భారత్ 8వ ఓవర్లో 50 పరుగుల్ని పూర్తిచేసుకుంది. కానీ దూబే తాండవంతో 11వ ఓవర్లోనే వందకు చేరింది. రాకెట్ వేగాన్ని అందుకున్నాక విండీస్ బౌలర్లు పట్టుబిగించడంతో వెనక్కి తగ్గింది. దూబే ఔటైన కాసేపటికే కోహ్లి, శ్రేయస్ అయ్యర్ స్వల్ప వ్యవధిలోనే పెవిలియన్ చేరడంతో పరుగుల వేగం ఒక్కసారిగా మందగించింది. విలియమ్స్ బౌలింగ్‌లో ఫ్రంట్‌ఫుట్ ఆడేందుకు వచ్చి... ఆఖరి క్షణాల్లో కట్ చేయబోయిన కోహ్లి (17 బంతుల్లో 19; 2 ఫోర్లు) షార్ట్ థర్డ్ మ్యాన్ వద్ద సిమన్స్ చేతికి చిక్కాడు. అయ్యర్ (10; 1 ఫోర్)ను వాల్ష్ ఔట్ చేశాడు. మెరుపులు మెరిపించాల్సిన ఆఖరి ఓవర్లలో జడేజా (9), సుందర్ (0)ల వికెట్లు రాలడంతో భారత్ చేసేదేమీ లేకపోయింది. 11 ఓవర్లలో 100 పరుగులు చేసిన భారత్ ఆఖరి 9 ఓవర్లలో 70 పరుగులకే పరిమితమైంది.



లూయిస్ / సిమన్స్

**చకచకా ఛేదన...**

విండీస్ ఓపెనర్లు సిమన్స్, లూయిస్ విజయానికి అవసరమైన ఆరంభానిచ్చారు. లూయిస్ చెలరేగుతుంటే ఓపిక పట్టిన సిమన్స్ లక్ష్యఛేదనకు అవసరమైన రన్‌రేట్ పడిపోకుండా జాగ్రత్తపడ్డాడు. వ్యక్తిగత స్కోరు 6 పరుగుల వద్ద సిమన్స్ ఇచ్చిన క్యాచ్‌ను వాషింగ్టన్ సుందర్ వదిలేశాడు. 9 ఓవర్లయినా భారత బౌలర్లెవరూ ఈ జోడీని విడగొట్టలేకపోయారు. పదో ఓవర్ వేసిన సుందర్ బౌలింగ్‌లో భారీ షాట్ కొట్టేందుకు క్రీజ్ వదిలిన లూయిస్ స్టంపౌట్ అయ్యాడు. దీంతో 73 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత సిమన్స్‌కు హెట్‌మైర్ (14 బంతుల్లో 23; 3 సిక్స్‌లు) జతయ్యాడు. భారీ సిక్సర్లు బాదిన హెట్‌మైర్... కోహ్లి పట్టిన అద్భుతమైన క్యాచ్‌కు వెనుదిరిగాడు. తర్వాత పూరన్ (18 బంతుల్లో 38 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అండతో సిమన్స్ 38 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. చేతిలో పుష్కలంగా వికెట్లు ఉండటంతో సిమన్స్ బ్యాట్‌కు పనిచెప్పాడు. అవతలి వైపు పూరన్ దూకుడు పెంచడంతో లక్ష్యఛేదనలో విండీస్ చకచకా సాగిపోయింది. భారత్ చేతిలో వరుసగా ఏడు పరాజయాల తర్వాత తొలి విజయం సాధించింది.

### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్ (బి) హోల్డర్ 15; రాహుల్ (సి) హెట్‌మైర్ (బి) పియరీ 11; శివమ్ దూబే (సి) హెట్‌మైర్ (బి) వాల్ష్ 54; కోహ్లి (సి) సిమన్స్ (బి) విలియమ్స్ 19; పంత్ (నాటౌట్) 33; శ్రేయస్ (సి) కింగ్ (బి) వాల్ష్ 10; జడేజా (బి) విలియమ్స్ 9; సుందర్ (సి అండ్ బి) కాట్రెల్ 0; దీపక్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 170. వికెట్ల పతనం:** 1–24, 2–56, 3–97, 4–120, 5–144, 6–164, 7–167. **బౌలింగ్:** కాట్రెల్ 4–0–27–1, పియరీ 2–0–11–1, హోల్డర్ 4–0–42–1, విలియమ్స్ 4–0–30–2, పొలార్డ్ 2–0–29–0, వాల్ష్ 4–0–28–2.

**వెస్టిండీస్ ఇన్నింగ్స్:** లెండిల్ సిమన్స్ (నాటౌట్) 67; ఎవిన్ లూయిస్ (స్టంప్డ్) పంత్ (బి) సుందర్ 40; హెట్‌మైర్ (సి) కోహ్లి (బి) జడేజా 23; పూరన్ (నాటౌట్) 38; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (18.3 ఓవర్లలో 2 వికెట్లకు) 173. **వికెట్ల పతనం:** 1–73, 2–112. **బౌలింగ్:** దీపక్ చాహర్ 3.3–0–35–0, భువనేశ్వర్ 4–0–36–0, సుందర్ 4–0–26–1, చహల్ 3–0–36–0, దూబే 2–0–18–0, జడేజా 2–0–22–1.



సుందర్

### శివమ్... తాండవం

బ్యాటింగ్ ఆర్డర్‌లో కోహ్లి స్థానంలో ప్రమోషన్‌లో వచ్చిన శివమ్ దూబే ఆరంభంలో కాస్త ఇబ్బంది పడినా... తర్వాత విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. పొలార్డ్ వేసిన ఇన్నింగ్స్ 9వ ఓవర్లో అయితే ఒక్కసారిగా చెలరేగాడు. కెప్టెన్ బౌలింగ్‌లో దూబే మూడు భారీ సిక్సర్లు బాదాడు. బౌన్సర్లు వేస్తే మిడ్‌వికెట్ మీదుగా రెండు సిక్సర్లు కొట్టిన శివమ్... ఆఫ్‌స్టంప్ ఆవల పడిన ఫుల్‌టాస్ బంతిని పాయింట్ వైపు ఫ్లాట్ సిక్స్‌గా మలిచాడు. 3 వైడ్లతో సుదీర్ఘంగా సాగిన ఈ ఓవర్లో 26 పరుగులొచ్చాయి. దూబే 27 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో కెరీర్‌లో తొలి ఫిఫ్టీ బాదాడు. మొదటి 14 బంతులకు 12 పరుగులే చేసిన శివమ్ మరో 13 బంతులెదుర్కొనేసరికి అర్ధసెంచరీ పూర్తయ్యింది. వాల్ష్ వేసిన 11వ ఓవర్లో భారీషాట్‌కు ప్రయత్నించి హెట్‌మైర్ చేతికి చిక్కాడు.



శివమ్ దూబే

# అదే జోరు...

- దక్షిణాసియా క్రీడల్లో ఎదురులేని భారత్
- టెన్నిస్ డబుల్స్‌లో సౌజన్య, సాకేత్, విష్ణువర్ధన్‌లకు స్వర్ణాలు
- రెజ్లింగ్, ఫెన్సింగ్‌లోనూ ఆధిపత్యం



సౌజన్య / శ్రీరామ్ బాలాజీ



విష్ణు / సాకేత్



సాక్షి

**కఠ్మాండు (నేపాల్):** తొలి రోజు మొదలైన పతకాల వేటను కొనసాగిస్తూ దక్షిణాసియా క్రీడల్లో భారత క్రీడాకారులు ముందుకు సాగుతున్నారు. ఈ క్రీడల ఎనిమిదో రోజు భారత్‌కు 22 స్వర్ణాలు, 10 రజతాలు, 6 కాంస్యాలతో కలిపి మొత్తం 38 పతకాలు లభించాయి. ప్రస్తుతం భారత్ 132 స్వర్ణాలు, 79 రజతాలు, 41 కాంస్యాలతో కలిపి మొత్తం 252 పతకాలతో 'టాప్'లో ఉంది.

ఆదివారం టెన్నిస్ డబుల్స్ విభాగాల్లో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. మిక్స్‌డ్, పురుషుల, మహిళల డబుల్స్ విభాగాల్లో భారత్‌కే స్వర్ణాలు, రజతాలు లభించాయి. పతకాలు నెగ్గిన టెన్నిస్ క్రీడాకారుల జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన సౌజన్య బవిశెట్టి, కాల్వ భువన, శ్రావ్య శివాని (తెలంగాణ)... సాకేత్ మైనేని (ఆంధ్రప్రదేశ్), విష్ణువర్ధన్ (తెలంగాణ) ఉన్నారు. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో సౌజన్య బవిశెట్టి–శ్రీరామ్ బాలాజీ (భారత్) ద్వయం 6–3, 6–7 (4/7), 10–7తో 'సూపర్ టైబ్రేక్'లో టాప్ సీడ్ జీవన్ నెడుంజెళియన్–ప్రార్థన తొంబారే (భారత్) జోడీని ఓడించింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో సాకేత్ మైనేని–విష్ణువర్ధన్ (భారత్) జంట 7–5, 3–6, 10–5తో 'సూపర్ టైబ్రేక్'లో శ్రీరామ్ బాలాజీ–జీవన్ నెడుంజెళియన్ ద్వయంపై నెగ్గింది. మహిళల డబుల్స్ ఫైనల్లో ప్రేరణ బాంబ్రీ–ప్రార్థన తొంబారే (భారత్) ద్వయం 6–3, 6–3తో కాల్వ భువన–చిలకలపూడి శ్రావ్య శివాని (భారత్) జంటను ఓడించింది. కోచ్, భర్త అయిన సురేశ్ కృష్ణ శిక్షణలో రాటుదేలిన సౌజన్య నేడు జరిగే మహిళల సింగిల్స్‌లో పసిడి పతకం కోసం పోరాడనుంది. తెలంగాణకే చెందిన సామ సాత్వికతో సౌజన్య ఫైనల్లో ఆడుతుంది. పురుషుల సింగిల్స్ పసిడి పోరులో వైజాగ్ ప్లేయర్ సాకేత్ మైనేని భారత్‌కే చెందిన మనీశ్ సురేశ్ కుమార్‌తో తలపడతాడు.

రెజ్లింగ్‌లో భారత్‌కు నాలుగు స్వర్ణాలు లభించాయి. మహిళల 62 కేజీల విభాగంలో రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మలిక్... అన్షు (59 కేజీలు)... పురుషుల 61 కేజీల విభాగంలో రవీందర్... పవన్ కుమార్ (86 కేజీలు) బంగారు పతకాలు గెలిచారు. ఇక బాక్సింగ్‌లో మొత్తం 15 మంది భారత బాక్సర్లు ఫైనల్లోకి దూసుకెళ్లి ఏకంగా 15 స్వర్ణాలపై గురిపెట్టారు. ఫెన్సింగ్‌లో పురుషుల ఇపీ, సాబ్రే... మహిళల ఫాయిల్ టీమ్ ఈవెంట్స్‌లో భారత్‌కు పసిడి పతకాలు వచ్చాయి. స్విమ్మింగ్‌లో ఏడు స్వర్ణాలు వచ్చాయి.

జూడోలో భారత్ 'కనకా'రంభం చేసింది. సుశీలా దేవి (48 కేజీలు), విజయ్ కుమార్ యాదవ్ (60 కేజీలు), జస్లీన్ సింగ్ సైని (66 కేజీలు), సుచిక తరియాల్ (57 కేజీలు), నిరుపమా దేవి (63 కేజీలు) పసిడి పతకాలు గెలిచారు. షూటింగ్‌లో భారత్ ఖాతాలో రెండు స్వర్ణాలు చేరాయి. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో శ్రవణ్ కుమార్, రవీందర్ సింగ్, సుమీత్‌లతో కూడిన భారత బృందం స్వర్ణం నెగ్గింది. వ్యక్తిగత విభాగంలో శ్రవణ్ బంగారు పతకం సొంతం చేసుకోగా... రవీందర్‌సింగ్ కాంస్యం గెలిచాడు.

## విజేత భారత్

**కాన్‌బెర్రా (ఆస్ట్రేలియా):** మూడు దేశాల జూనియర్ మహిళల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన చివరి రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లో భారత్ 1–2 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. దీంతో భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో భారత్, ఆసీస్ 7 పాయింట్లతో సంయుక్తంగా తొలి స్థానంలో నిలిచాయి. అయితే మెరుగైన గోల్స్ సగటు ఆధారంగా భారత్‌కు (+4) టైటిల్ ఖాయంకాగా... ఆసీస్ (+1) రన్నరప్‌గా నిలిచింది. ఈ టోర్నీలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో రెండింటిలో గెలిచిన భారత్... ఒకదాంట్లో ఓడి మరొక మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. న్యూజిలాండ్ మూడో స్థానంలో నిలిచింది. టోర్నీ మొత్తం అదరగొట్టిన యువ భారత్ చివరి మ్యాచ్‌లో మాత్రం ఆస్ట్రేలియా చేతిలో 1–2తో ఓడిపోయింది. ఆసీస్ తరఫున ఎబిగైల్ విల్సన్ రెండు గోల్స్ చేయగా... భారత్‌కు గగన్‌దీప్ ఒక గోల్ అందించింది.



# రంజీ సమరానికి వేళాయె

- నేటి నుంచి దేశవాళీ క్రికెట్ టోర్నీ
- టైటిల్ బరిలో 38 జట్లు



**మూలపాడు (విజయవాడ):** విజయ్ హజారే వన్డే ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ టి20 ట్రోఫీ వంటి పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ధనాధన్ ఇన్నింగ్స్‌లతో అలరించిన భారత యువ క్రికెటర్లను ఇక నాలుగు రోజులపాటు సాగే మ్యాచ్‌లు సవాళ్లు విసరనున్నాయి. వారిలోని నిజమైన టెక్నిక్‌ను, ఓపికను, ఫిట్‌నెస్‌ను పరీక్షించేందుకు నేటి నుంచి రంజీ ట్రోఫీ వేదిక కానుంది. ఇప్పటికే పరిమిత ఓవర్ల దేశవాళీ టోర్నీల్లో ఆకట్టుకున్న యువ ఆటగాళ్లు ఇక్కడ కూడా మెరిసి భారత టెస్టు జట్టులో స్థానం సంపాదించాలని చూస్తుండగా... పునరాగమనం కోసం మరికొందరు ఈ రంజీ సీజన్‌ను ఉపయోగించుకోవాలని పట్టుదలతో ఉన్నారు. ఇక గత రెండు సీజన్‌ల్లో టైటిల్ గెలిచి డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలో దిగుతున్న విదర్భ మరోసారి టైటిల్ గెలిచి హ్యాట్రిక్‌ను పూర్తి చేయాలని చూస్తోంది. అదే గనుక జరిగితే ముంబై తర్వాత హ్యాట్రిక్ టైటిల్స్‌ను గెలిచిన జట్టుగా నిలుస్తుంది. తొలి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో ఆంధ్రతో విదర్భ... హైదరాబాద్‌తో గుజరాత్ జట్లు తలపడనున్నాయి.

**సీజన్ జరిగే తీరు...**

గత సీజన్‌లో 37 జట్లు బరిలో దిగగా... ఈసారి చండీగఢ్ రూపంలో కొత్త జట్టు ఎంట్రీ ఇవ్వనుంది. దీంతో మొత్తం 38 జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాక గ్రూప్ 'ఎ'–'బి'లను కలిపి 'టాప్–5' స్థానాల్లో నిలిచిన జట్లు, గ్రూప్ 'సి' నుంచి 'టాప్–2' జట్లు, ప్లేట్ గ్రూప్ నుంచి ఒక జట్టు క్వార్టర్స్‌కు అర్హత సాధిస్తాయి. మార్చి 9 నుంచి ఫైనల్ జరుగుతుంది.

**ఎలైట్ గ్రూప్ 'ఎ':** ఆంధ్ర, హైదరాబాద్, విదర్భ, కేరళ, ఢిల్లీ, గుజరాత్, రాజస్తాన్, పంజాబ్, బెంగాల్. **ఎలైట్ గ్రూప్ 'బి':** ముంబై, బరోడా, హిమాచల్ ప్రదేశ్, సౌరాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, రైల్వేస్, మధ్యప్రదేశ్. **ఎలైట్ గ్రూప్ 'సి':** త్రిపుర, జమ్మూ కశ్మీర్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, ఒడిశా, సర్వీసెస్, హరియాణా, జార్ఖండ్, అస్సాం. **ప్లేట్ గ్రూప్:** గోవా, మేఘాలయ, మణిపూర్, మిజోరం, చండీగఢ్, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, పుదుచ్చేరి, సిక్కిం, బిహార్.

### కల్యాణ వైభోగమే...



భారత బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్, హైదరాబాద్ షట్లర్ భమిడిపాటి సాయిప్రణీత్ ఓ ఇంటివాడయ్యాడు. ఆదివారం కాకినాడలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్వేత జయంతితో సాయిప్రణీత్ వివాహం జరిగింది. ఈ ఏడాది సాయిప్రణీత్ అంతర్జాతీయస్థాయిలో అద్భుత ప్రదర్శన చేశాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 36 ఏళ్ల తర్వాత పురుషుల సింగిల్స్‌లో కాంస్యం గెలిచిన భారత ప్లేయర్‌గా నిలిచాడు. కొన్నేళ్లుగా నిలకడగా రాణిస్తున్న సాయిప్రణీత్‌ను ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం 'అర్జున అవార్డు'తో సత్కరించింది.

## సరైన వయసు చెప్పండ్రా బాబు..!

### పాక్ ఆటగాళ్లకు రషీద్ లతీఫ్ సూచన



**లాహోర్:** పాకిస్తాన్ ఆటగాళ్లు సరైన వయసును వెల్లడించాలని, తప్పుడు వయో ధ్రువీకరణతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పరువు తీయరాదని ఆ దేశ మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్ కోరాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో 16 ఏళ్ల నసీమ్ షా అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. అతనిప్పుడు అండర్–19 ప్రపంచకప్ ఆడే జట్టుకు ఎంపికయ్యాడు. దీనిపై లతీఫ్ ట్విట్టర్‌లో స్పందించాడు. 'పాక్ ఆటగాళ్లు అండర్–19 జట్టుకు ఆడతారు. అండర్–19 వాళ్లేమో అండర్–16లో ఆడతారు. అండర్–16 కుర్రాళ్లేమో అండర్–13 జట్టులో ఉంటారు. ఈ అండర్–13 పిల్లలు తల్లి ఒడిలో ఉంటారు. ఇదంతా ఓ ప్రహసనంలా మారింది. పీసీబీ దీనిపై ప్రధానంగా దృష్టి సారించి వయసు ధ్రువీకరణపై నిక్కచ్చిగా వ్యవహరిస్తేనే బోర్డు నవ్వులపాలు కాకుండా ఉంటుంది' అని ట్వీట్ చేశాడు.

**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 334 ▼ | 97 ▼ |
| 40,445 | 11,922 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

| | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,656 | ▲ 85 |
| డోజోన్స్ | 28,015 | ▲ 337 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,240 | ▲ 102 |
| డాక్స్ | 13,167 | ▲ 112 |
| షాంఘై | 2,912 | ▲ 13 |
| నికాయ్ | 23,354 | ▲ 54 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.55 | 72.19 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 92.28 | 95.54 |
| యూరో | ఎస్‌బీఐ | 77.82 | 80.74 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 64.46 | 66.90 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.80 | 49.96 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.57 | 53.38 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.20 | 19.80 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.92 | 19.92 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.51 | 10.91 |

# ‘మనీ’ మాట.. బంగారు బాట



- చిన్న నాటి నుంచే సరైన దిశగా అడుగులు
- ద్రవ్య నిర్వహణ, ఖర్చులు, పొదుపు, ఇన్వెస్టింగ్ నేర్పాలి
- తల్లిదండ్రుల్లో తగిన అవగాహన అవసరం
- పిల్లలతో చర్చించడం మంచి అలవాటు
- డబ్బుకు వారిని దూరం పెట్టడం మంచేమీ కాదు

**చిన్నారులకు ఎన్నో విషయాలు నేర్పుతాం. కానీ, డబ్బు (మనీ) దగ్గరకొచ్చేసరికి వారిని దూరం పెడతాం. ఆదాయం, పొదుపు, పెట్టుబడులు.. ఇవేవీ వారికి అంత చిన్న వయసులో అవసరం లేదన్నది ఎక్కువ మంది అభిప్రాయం. కానీ, చిన్న వయసులోనే కదా వారికి ఈత నేర్పిస్తాం. మరి భవిష్యత్తులో ఆర్థిక సాగరాన్ని ఈదే అద్భుత పునాది చిన్నప్పుడే ఎందుకు వేయకూడదు? ఆలోచించండి. ఆందోళనకు గురికాకుండా, సంక్షోభ సమయాల్లో మనీ వ్యవహారాలను ఎలా పరిష్కరించాలన్న కిటుకులను పెద్దలు తమ అనుభవ పాఠాల నుంచి చిన్నారులకు నేర్పించడం ఎంతో మేలు చేస్తుంది.**

•••

**ఆర్థిక విషయాల పట్ల సరైన అవగాహన కలిగిన తల్లిదండ్రులు వాటి గురించి తమ పిల్లలతో చర్చించడం మంచి చేస్తుందంటున్నారు నిపుణులు. అంతేకానీ, మనీ వ్యవహారాలకు వారిని దూరం పెట్టడం మంచి కంటే నష్టానికే అవకాశం ఉందంటున్నారు. పూర్తిగా అర్థం చేసుకునే వయసులో లేనప్పుడు పిల్లలకు ఆర్థిక విషయాల గందరగోళం ఎందుకు? అన్న ప్రశ్న సహేతుకమే. కానీ, అర్థం చేసుకోలేకపోవడం అన్ని విషయాల్లోనూ కాదు కదా?.. ఈ ప్రశ్న ప్రతి ఒక్క తల్లిదండ్రీ వేసుకోవాలి. కనుక పిల్లలు అర్థం చేసుకోతగిన విషయాల గురించి వారితో చర్చించడం, మనీ వ్యవహారాల గురించి ఇంట్లో చర్చించడం చిన్నారులకు మేలు చేస్తుందని, పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలన్న అవగాహన వారిలో కల్పిస్తుందన్న అభిప్రాయాన్ని ఆర్థిక నిపుణులు వ్యక్తీకరిస్తున్నారు.**

### వయసు, అవగాహన

ఒక విషయాన్ని అర్థం చేసుకునే శక్తి తమ పిల్లల్లో ఉందా? దాన్ని పరిష్కరించే నైపుణ్యం ఉందా? అన్నది తల్లిదండ్రులకు సాధారణంగా తెలుస్తుంది. ఏడేళ్లలోపు పిల్లలతో ఆర్థిక విషయాల గురించి మాట్లాడడానికి చాలా మంది సుముఖత చూపరు. కానీ, వారితో మాట్లాడడమే మంచి ఆలోచన అవుతుంది. కొన్ని సందర్భాల్లో పిల్లలు తప్పుగా అర్థం చేసుకోవచ్చు. ఇది వారిలో అనవసర ఆందోళనకు కారణమవ్వడంతోపాటు, ఫలితంగా ఈ విషయాలను ఎవరితోనూ వ్యక్తీకరించేందుకు ధైర్యం చేయకపోవచ్చు. ఇదే ఒత్తిడి వారు పెద్దయిన తర్వాత కూడా కొనసాగుతుంది. ఉదాహరణకు తండ్రి రుణ చెల్లింపుల్లో విఫలమై బ్యాంకు నుంచి వేధింపులకు లోనైతే, దాన్ని చూసిన పిల్లలు పెద్దయ్యాక రుణాలు తీసుకునేందుకు ధైర్యం చేయలేకపోవచ్చు. అందుకే పిల్లలతో ఆర్థిక విషయాల గురించి మాట్లాడడం, వారిలో సానుకూల దృక్పథాన్ని కలిగించడం మంచి ఫలితాన్నే ఇస్తుంది.

### సానుకూల అభిప్రాయం

ఆర్థిక సమస్య ఏదైనా కానీయండి.. దాని పట్ల సానుకూల దృక్పథం అన్నది పిల్లల్లో ఆందోళనను పారదోలుతుంది. ఏదైనా ఒక సమస్య లేదా సంక్షోభాన్ని పెద్దలు ఎదుర్కొంటున్నట్టు అయితే అది.. బడ్జెట్ గురించి, పరిమిత వ్యయాలు, ఆర్థిక క్రమశిక్షణ గురించి పిల్లలకు నేర్పేందుకు అనుకూల సమయం అవుతుంది. ఉదాహరణకు వ్యాపారంలో ఎన్నో నష్టాలను ఎదుర్కొంటున్నట్టు అయితే, దానికి దారి తీసిన పరిస్థితుల గురించి వారికి వివరించడం మేలు చేసినట్టు అవుతుంది. ఒకవేళ ఆ సమస్యను పరిష్కరించే విషయంలో చిన్నారుల సలహాలను కోరడం వారికి ఎంతో ప్రోత్సాహం ఇచ్చినట్టు అవుతుంది. వ్యయాలను నియంత్రించుకోవడం ఎలా? అంటూ వారి నుంచి సూచనలను రాబట్టడంలో తప్పు లేదు. అయితే, వారి నుంచి ఎటువంటి సూచన, స్పందన రాకపోతే మాత్రం నిందించొద్దు. ఆలోచన తట్టినప్పుడు వచ్చి చెప్పాలని వారిని వెన్ను తట్టాలి.

### దాచడం అన్ని వేళలా సరికాదు..

పిల్లలకు ఆర్థిక సమస్యల గురించి తెలియకుండా జాగ్రత్తపడడం కూడా మంచి ఆలోచన కాదంటారు నిపుణులు. ముఖ్యంగా 12 ఏళ్ల వయసు నాటికి పిల్లలు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితుల గురించి, మనీ వ్యవహారాల గురించి తెలుసుకోగల సామర్థ్యం కలిగి ఉంటారు. తల్లిదండ్రుల్లో ఎవరైనా తమ ఉద్యోగాన్ని కోల్పోతే పిల్లల ముందు ఆందోళన చెందకూడదు. మరో ఉద్యోగం సంపాదించి, కుదురుకునే మార్గాన్ని వారికి తెలియజేయడం వల్ల.. భవిష్యత్తు పట్ల వారిలో నమ్మకాన్ని పెంచిన వారవుతారు.

### గొడవ పడొద్దు..

ఆర్థికంగా ఎటువంటి సమస్యల్లో అయినా జీవిత భాగస్వామితో పిల్లల ముందు గొడవపడకూడదు. ఇది సమస్యను పరిష్కరించే విషయంలో ప్రతికూల ప్రభావం వారిపై పడేలా చేస్తుంది. అంతే కాదు, భవిష్యత్తులో వారి, వారి జీవిత భాగస్వామితో అనుబంధాలను ప్రభావితం చేస్తుంది. సమస్యను వివరించి, జీవిత భాగస్వామితో కలసి (తల్లిదండ్రి సంయుక్తంగా) దాన్ని పరిష్కరించడం ద్వారా పిల్లలకు మంచి సందేశాన్ని పంపొచ్చు. అలాగే, ఆర్థిక సమస్యలకు పిల్లలను నిందించడం కూడా తప్పే. ఆర్థిక అంశాల పట్ల పరస్పర అవగాహన పెంపొందించుకోవడం ప్రధానం.

### పెట్టుబడి అలవాటు



ఆర్థికపరమైన ఒక మంచి సలహా పిల్లల జీవితాలను గొప్పగా తీర్చిద్దడానికి సాయపడొచ్చు. ముఖ్యంగా ఇన్వెస్ట్‌మెంట్ అన్నదానిని పిల్లలు యుక్తవయసు నాటికే అలవాటు చేయడం భవిష్యత్తులో వారికి ఎంతో మేలు చేస్తుంది. ఇందుకు ఉదాహరణ ముంబైకి చెందిన శాలినీ రెడ్డి. ఆమె కూడా ఒక మిలీనియల్. కానీ, తోటివారిలా రెస్టారెంట్లలో ఖరీదైన విందులు, ఖరీదైన గ్యాడ్జెట్లపై ఖర్చు చేయడానికి అంత ప్రాధాన్యం ఇవ్వదు. బదులుగా బ్యాంకు ఉద్యోగంలో చేరిన మొదటి నుంచే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్ ఆరంభించింది. అలాగే, రికరింగ్ డిపాజిట్‌ను కూడా ప్రారంభించింది. తనకు పెద్దగా ఖర్చుల్లేవని, దాంతో వచ్చే పదేళ్ల మరింత అధికంగా ఇన్వెస్ట్ చేస్తానన్నది ఆమె మాట. ఈమె మాత్రమే కాదు.. బెంగళూరుకు చెందిన 19 ఏళ్ల కామర్స్ విద్యార్థి మానవ్ కూడా ఆర్థిక జ్ఞానం కలిగిన వాడే. పర్సనల్ ఫైనాన్స్ పుస్తకాలను ఎన్నింటినో చిన్న వయసులోనే చదివేసిన అతడు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్ ప్రారంభించే ఆలోచనతో ఉన్నట్టు చెప్పాడు.

### ముందు నేర్పితే ఎంతో లాభం..

ఆర్థిక అక్షరజ్ఞానాన్ని పిల్లలకు విద్యాలయాలు ఇవ్వడం లేదు. చివరికి వారి తల్లిదండ్రులు కూడా ఈ విషయాల గురించి నేర్పడం లేదు. దీంతో అధిక శాతం మంది పర్సనల్ ఫైనాన్స్ (వ్యక్తిగత ఆర్థిక విషయాలు, బడ్జెట్) గురించి ఏ మాత్రం అవగాహన లేకుండానే సంపాదన జీవితాన్ని ఆరంభిస్తున్నారు. ‘‘డ్రైవింగ్ నేర్పుకోకుండా మీ పిల్లలను బైక్ నడిపేందుకు అనుమతించరు కదా. మరి వారికి కనీస సూత్రాలు కూడా తెలియకుండా ఇన్వెస్టింగ్ ప్రపంచం వైపు అడుగులు ఎలా వేయించగలుగుతాం’’ అని ఆల్ఫా క్యాపిటల్‌కు చెందిన అసోసియేట్ పార్ట్‌నర్ దీప్తి గోయల్ ప్రశ్నించారు. చాలా ఇళ్లలో మనీ వ్యవహారాలను పిల్లలతో చర్చించేందుకు ఇష్టపడని వాతావరణం కనిపిస్తుంది. కొన్ని చోట్ల అరుదుగా చర్చించడాన్ని చూడొచ్చు. కానీ, చిన్నప్పుడు నేర్చుకున్న పాఠాలు జీవితాంతం వారిని నడిపిస్తాయని తెలిసిందే. డబ్బులను నిర్వహించడం గురించి పిల్లలకు తల్లిదండ్రులు నేర్పించినది వారి ఆర్థిక జీవితాలపై ఎంతో ప్రభావితం చూపిస్తుందని ప్లాన్ రూపీ వ్యవస్థాపకుడు అమోల్‌జోషి పేర్కొన్నారు.



### తప్పుదోవ

ముఖ్యంగా మన దేశంలో ఎక్కువ మంది తల్లిదండ్రుల్లో ద్రవ్య నిర్వహణ విధానం గురించి తగినంత అవగాహన ఉండడం లేదు. ఆర్థిక అక్షరాస్యత తక్కువగా ఉండడం వల్ల వారిచ్చే సూచన తప్పుదోవ పట్టించే ప్రమాదం కూడా లేకపోలేదు. హైదరాబాద్‌కు చెందిన అర్థయంత్ర నిర్వహించిన అధ్యయనం చెబుతున్నది ఏమిటంటే.. 21–25 వయసు మధ్యనున్న యువ నిపుణుల్లో ప్రతీ ముగ్గురిలోనూ ఇద్దరి నిర్ణయాలు వారి తల్లిదండ్రుల సూచనల మేరకే ఉంటున్నాయని తెలిసింది. సంప్రదాయ బీమా పథకాలను పెట్టుబడి సాధనంగా చూసే ధోరణి కొనసాగుతూనే ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లల పేరిట ఎండోమెంట్ లేదా బైబ్యాక్ పాలసీ తీసుకుని బహుమతిగా ఇవ్వడం చేస్తున్నారు. దీంతో ఆరంభంలో కొన్ని సంవత్సరాల పాటు తల్లిదండ్రులు ప్రీమియం చెల్లించగా, మిగిలిన కాలానికి దాన్ని పిల్లలపై రుద్దుతున్నారు. పైగా తమ పిల్లలకు గొప్ప కానుక ఇస్తున్నామని వారు సంతోషపడుతున్న పరిస్థితి ఉంది. అంతేకానీ, వారి భవిష్యత్తుకు సరిపోలని ఓ పెట్టుబడి సాధనాన్ని వారి చేతిలో పెడుతున్నామని అర్థం చేసుకోవడం లేదు. బీమా పాలసీలు, పీపీఎఫ్‌లో పెట్టుబడుల దిశగా పిల్లలను నడిపించడం, ఒత్తిడి చేయడం ఆశించిన ఫలితాలను ఇవ్వదని నిపుణులు సూచిస్తున్నారు.

### సరైన బాట..

పిల్లలు హైస్కూల్ విద్యకు వచ్చిన నాటి నుంచే వారి పేరిట ఓ బ్యాంకు ఖాతా ప్రారంభించి, డెబిట్ కార్డు ఇవ్వడం ద్వారా ప్లాస్టిక్ మనీని వారికి పరిచయం చేయడం మంచిది. వారు సాధించే ప్రతీ విజయాన్ని ప్రోత్సహిస్తూ కొంత నగదు ప్రోత్సాహకం ఇవ్వాలి. ఆ నగదును వారు బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేసుకునేలా వెన్నుతట్టాలి. కార్డు నుంచి రోజువారీ ఖర్చుకు పరిమితులు విధించాలి. ముఖ్యంగా డబ్బు విలువ గురించి వారికి అర్థమయ్యే విధంగా తెలియజేయడం వల్ల ఎన్నో సానుకూల ఫలితాలను చూస్తారు. పిల్లలు ప్రారంభంలో తప్పటడుగులు వేసినా, వారిని వారు సరిదిద్దుకుంటారు. ‘‘కాలేజీ వయసులో బడ్జెట్ గురించి మూల విషయాలు తెలుసుకోవడం మంచిది. కొంచెం, కొంచెం కలిస్తేనే పెద్ద నిధిగా మారే క్రమం, కాంపౌండింగ్ ప్రయోజనం గురించి వారికి వివరంగా తెలియజేయాలి. అధికంగా ఖర్చు చేయడం సమస్యలకు ఎలా దారితీస్తుందన్నదీ వివరించాలి’’ అని మనీమంత్రా ఎండీ రాజ్‌ఖోస్లా సూచించారు. ఆర్థిక విషయాల పట్ల సరైన అవగాహన లేని తల్లిదండ్రులు, ఈ విషయంలో నిపుణుల సాయాన్ని తీసుకోవాలి. ఆర్థిక మోసగాళ్ల బారిన పడకుండా వారికి జాగ్రత్తలూ తెలియజేయాలి. టెక్నాలజీ ఎంతో అత్యాధునికతను సంతరించుకుంటున్న ఈ రోజుల్లో సైబర్ నేరాలపై కనీస అవగాహనను పిల్లల్లో కల్పించాలి.

---

## స్టాక్స్ వ్యూ

### యాక్సిస్ బ్యాంక్ | బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

**ప్రస్తుత ధర:** రూ.718 **టార్గెట్ ధర:** రూ.870

**ఎందుకంటే:** రుణాల పరంగా చూస్తే, దేశంలో అతి పెద్ద మూడవ ప్రైవేట్ బ్యాంక్ ఇది. ఈ బ్యాంక్ 4,284 బ్రాంచ్‌లు, 12,191 ఏటీఎంలతో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అన్ని రకాలైన రుణాలను ఈ బ్యాంక్ అందిస్తోంది. భారీ, మధ్య తరహా కంపెనీలకే కాకుండా లఘు, చిన్న తరహా వాణిజ్య సంస్థలకు, వ్యవసాయ, రిటైల్ రుణాలను కూడా ఇస్తోంది. అధిక మార్జిన్‌లు వచ్చే రుణాలపైననే ఈ బ్యాంక్ అధికంగా దృష్టి సారిస్తోంది. అంతే కాకుండా పటిష్టమైన వ్యయ నియంత్రణ పద్ధతులను పాటించడం ద్వారా రాబడి నిష్పత్తులను మెరుగుపరచుకోవాలని కూడా చూస్తోంది. 2014–19 కాలానికి రుణ వృద్ధి 17 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి సాధించింది. ఇది బ్యాంకింగ్ రంగం సగటు కంటే అధికం. ఇదే కాలానికి రిటైల్ రుణాలు మాత్రం 23 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందాయి. 2014–15 ఆర్థిక సంవత్సరంలో 38 శాతంగా ఉన్న రిటైల్ రుణాలు ఈ ఆర్థిక సంవత్సరంలో 52 శాతానికి ఎగియనున్నాయి. 2014–19 కాలానికి డిపాజిట్లు 14 శాతం చొప్పున చక్రగతి వృద్ధిని సాధించాయి. రెండేళ్లలో రుణాలు 17 శాతం, డిపాజిట్లు కూడా 17 శాతం చొప్పున చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలవని అంచనా. .రుణ నాణ్యత మెరుగుకు ఈ బ్యాంక్ తీసుకున్న పటిష్టమైన చర్యల కారణంగా ఈ ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్‌లో స్థూల మొండి బకాయిలు 5 శాతం, నికర మొండి బకాయిలు 2 శాతానికి తగ్గాయి. దాదాపు 35గా ఉన్న అనుబంధ సంస్థల పనితీరు మెరుగ్గానే ఉండటం సానుకూలాంశం. ఎమ్‌డీ, సీఈఓగా కొత్తగా అమితాబ్ చౌధురిని నియమించడం... బ్యాంక్ సంస్థాగత మార్పునకు సంకేతంగా భావించవచ్చు.




### టెక్ మహీంద్రా | బ్రోకరేజ్ సంస్థ: ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ | కొనొచ్చు

**ప్రస్తుత ధర:** రూ.758 **టార్గెట్ ధర:** రూ.937

**ఎందుకంటే:** టెలికం కంపెనీలకు ఐటీ సేవలందించే అగ్రస్థాయి ఐటీ కంపెనీల్లో ఇది కూడా ఒకటి. సత్యం కంప్యూటర్స్ విలీనం కారణంగా టెక్ మహీంద్రా కంపెనీ భారత్‌లో ఐదవ అతి పెద్ద ఐటీ కంపెనీగా అవతరించింది. గత మూడేళ్లుగా ఎలాంటి ఎదుగు, బొదుగూ లేని టెలికం విభాగం ఇటీవలనే వృద్ధి బాటలోకి ప్రవేశించింది. 5జీ సేవలు త్వరలోనే అందుబాటులోకి రానుండటంతో ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను 5జీకి అనుగుణంగా మార్చుకోవడం టెలికం కంపెనీలకు తప్పనిసరి. దీంతో ఈ కంపెనీ టెలికం సేవల విభాగం మరింత వృద్ధిని సాధించే అవకాశాలున్నాయి. క్లయింట్ల నుంచి టెక్నాలజికల్ సొల్యూషన్స్‌కు డిమాండ్ పెరగడం వల్ల ఆర్థిక మందగమనం సమయంలోనూ టెక్ మహీంద్రా మంచి పనితీరునే చూపించింది. గత మూడేళ్లలో మార్జిన్లు మెరుగుపడుతున్నప్పటికీ, డీల్స్ పునర్వ్యవస్థీకరణ వ్యయాలు పెరగడంతో మార్జిన్లు ఈ ఆర్థిక సంవత్సరంలో 1.3 శాతం మేర తగ్గే అవకాశాలున్నాయి. అయితే నిర్వహణ పరంగా సామర్థ్యాలను మెరుగుపరచుకోవడం, ఆటోమేషన్, తదితర కారణాల వల్ల వచ్చే ఆర్థిక సంవత్సరంలో మార్జిన్లు మెరుగుపడవచ్చు. కంపెనీ మొత్తం ఆదాయంలో 59 శాతం ఆదాయన్ని సమకూర్చే ఎంటర్‌ప్రైజ్ విభాగం నిలకడగా ఉండటంతో ఆదాయం జోరుగా పెరిగే అవకాశాలున్నాయి. కమ్యూనికేషన్స్ విభాగం డీల్స్ పెరుగుతుండటం, టెలికం విభాగం పుంజుకోవడం.. సానుకూలాంశాలు. ఈ కంపెనీ డీల్స్‌లో అధిక భాగం యూరప్ నుంచే రావడం, కరెన్సీ మారకం ఒడిదుడుకులు.. ప్రతికూలాంశాలు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అంచనా ఈపీఎస్‌కు 15 రెట్ల ధరకు ప్రస్తుతం ఈ షేర్ ట్రేడవుతోంది.




**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

---

## ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (డిసెంబర్-3-2019 అంకెలు శాతాల్లో)

| బ్యాంకులు | 6 నెలలు- ఏడాది | 1–2 ఏళ్లు | 3–5 ఏళ్లు |
|---|---|---|---|
| ఆంధ్రా బ్యాంక్ | 6 | 6.6 | 6.5 |
| యాక్సిస్ బ్యాంక్ | 6.5 | 6.7 | 6.7 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 5.9 | 6.3 | 6.25 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.4 | 6.25 |
| కెనరా బ్యాంక్ | 5.95 | 6.4 | 6.25 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.4 | 6.25 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 6.3 | 6.65 | 6.5 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 6.05 | 6.3 | 6.3 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 6 | 6.6 | 6.6 |
| ఐడీబీఐ బ్యాంక్ | 6 | 6.45 | 6.25 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 6.5 | 7.25 | 7.15 |
| కోటక్ మహీంద్రా బ్యాంక్ | 6.05 | 6.3 | 6.2 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 5.8 | 6.25 | 6.25 |
| పీఎన్‌బీ | 6.1 | 6.3 | 6.25 |
| ఎస్‌బీఐ | 5.8 | 6.25 | 6.25 |
| సిండికేట్ బ్యాంక్ | 5.75 | 6.6 | 6.25 |
| యస్ బ్యాంక్ | 7.15 | 7.5 | 7.25 |

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

## బాండ్లలో స్థిరమైన రాబడుల కోసం..

### ఐడీఎఫ్‌సీ బాండ్ ఫండ్ – మీడియం టర్మ్ ప్లాన్




ఆర్‌బీఐ ఇప్పటి వరకు 135 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించి, తాజా పాలసీలో యథాతథ స్థితికి మొగ్గు చూపించింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు నియంత్రణ తప్పొచ్చన్న ఆందోళనలు, అంతర్జాతీయంగా అనిశ్చితి ఇవన్నీ దేశీయ బాండ్ మార్కెట్‌పై ప్రభావం చూపించేవే. కనుక ఈ రిస్కులను అధిగమించేందుకు ఇన్వెస్టర్లు (తక్కువ నుంచి మోస్తరు రిస్క్ తీసుకునే వారు) షార్ట్, మీడియం టర్మ్ డెట్ ఫండ్స్ (స్వల్ప కాలం నుంచి మధ్య కాల ఫండ్స్)ను పెట్టుబడుల కోసం పరిశీలించొచ్చు. ఈ విభాగంలో ఐడీఎఫ్‌సీ బాండ్ ఫండ్ – మీడియం టర్మ్ ప్లాన్ (ఎంటీపీ) మంచి పనితీరుతో అగ్ర స్థానంలో ఉంది.

**రాబడులు..:** ఐడీఎఫ్‌సీ బాండ్ ఫండ్ ఎంటీపీ గత ఐదేళ్ల పనితీరును గమనించినట్టయితే.. వార్షికంగా 8 శాతం చొప్పున రాబడులను ఇచ్చింది. కానీ, మీడియం టర్మ్ డెట్ విభాగం సగటు రాబడులు ఇదే కాలంలో 7.5 శాతంగా ఉన్నాయి. మూడేళ్ల కాలంలో ఐడీఎఫ్‌సీ బాండ్ ఫండ్ ఎంటీపీ వార్షికంగా 7.2 శాతం రాబడులను ఇవ్వగా, ఈ విభాగం సగటు రాబడులు కేవలం 5.9 శాతంగానే ఉన్నాయి. ముఖ్యంగా గడిచిన ఏడాది కాలంలో ఈ పథకం 11 శాతం రాబడులతో అద్భుత పనితీరు చూపించింది. కానీ, ఈ విభాగం రాబడులు 5.9 శాతం వద్దే ఉన్నాయి. ఏడాది నుంచి ఐదేళ్ల కాలంలో మీడియం టర్మ్ బాండ్ ఫండ్ విభాగం కంటే ఐడీఎఫ్‌సీ బాండ్ ఫండ్- ఎంటీపీ పనితీరు ఎంతో మెరుగ్గా ఉన్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**పెట్టుబడుల విధానం**

సెబీ మార్గదర్శకాల ప్రకారం మీడియం టర్మ్ బాండ్ ఫండ్స్ మూడు నుంచి నాలుగేళ్ల కాల వ్యవధి కలిగిన డెట్ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ ఫండ్స్ వడ్డీ రేట్ల రిస్క్‌ను అధిగమించే విధంగా ఉంటాయి. దీర్ఘకాలిక బాండ్లతో పోలిస్తే మీడియం టర్మ్ బాండ్లు వడ్డీ రేట్ల పరంగా తక్కువ అస్థిరతలతో ఉంటుంటాయి. ఐడీఎఫ్‌సీ బాండ్ ఫండ్ ఎంటీపీ ప్రధానంగా ఏఏఏ రేటింగ్ కలిగిన సార్వభౌమ బాండ్లలో ఇన్వెస్ట్ చేస్తుంది. క్రెడిట్ రిస్క్ వాతావరణం అననుకూలంగా ఉన్న సమయాల్లో అధిక రేటింగ్ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసే ఈ తరహా మ్యూచువల్ ఫండ్ పథకాలను పెట్టుబడుల పరంగా భద్రతగా భావించొచ్చు. మ్యూచువల్ ఫండ్స్ విభాగాల పునర్వ్యవస్థీకరణకు ముందు ఈ పథకం ఐడీఎఫ్‌సీ సూపర్ సేవర్ ఇన్‌కమ్ ఫండ్ – మీడియం టర్మ్ ప్లాన్ పేరుతో కొనసాగింది. రెండు నుంచి నాలుగేళ్ల కాల వ్యవధి కలిగిన సెక్యూరిటీల్లోనే ఈ పథకం ఇన్వెస్ట్ చేయడం వల్ల అస్థిర మార్కెట్లలోనూ మంచి పనితీరు చూపించగలిగింది. ప్రస్తుతం ఈ పథకం పోర్ట్‌ఫోలియోలో 42.8 శాతం కేంద్ర ప్రభుత్వం బాండ్లు, 50.4 శాతం మేర ఏఏఏ రేటింగ్ కార్పొరేట్ బాండ్లు ఉన్నాయి.

### టాప్ హోల్డింగ్స్

| కంపెనీ | ఇన్‌స్ట్రుమెంట్ | పెట్టుబడులు(%) |
|---|---|---|
| 7.59%జీవోఐ2026 | జీవోఐసెక్యూరిటీ | 42.82 |
| 7.17%రియలన్స్‌ఇండస్ట్రీస్2022 | ఎన్‌సీడీ | 8.55 |
| 7.24%ఎల్‌ఐసీ హౌసింగ్2021 | ఎన్‌సీడీ | 6.06 |
| 6.98%నాబార్డ్2020 | డిబెంచర్ | 4.17 |
| 7.35%పీఎఫ్‌సీ2022 | డిబెంచర్ | 3.48 |
| 8.14%ఎల్‌ఐసీహౌసింగ్2020 | డిబెంచర్ | 3.14 |
| 8.5%నాబార్డ్ | డిబెంచర్ | 2.75 |
| 7.43%హెచ్‌డీబీఫైనాన్షియల్2020 | డిబెంచర్ | 2.60 |
| 8.3%రిలయన్స్‌ఇండస్ట్రీస్2022 | డిబెంచర్ | 2.45 |
| 7.9%నాబార్డ్2022 | ఎన్‌సీడీ | 2.13 |

IDFC MUTUAL FUND



విజయవంతమైన వ్యాపారవేత్తలందరూ ఆశావాదులే...
వారు చేసే పనిలో ఆశావహం ఒక భాగంగా ఉంటుంది!
- కేథరినా ఫేక్, ఫ్లికర్ సహ వ్యవస్థాపకురాలు

## బొమ్మ-బొరుసు



## నేరాలను గుర్తించేందుకు సెబీ వినూత్న వ్యూహాలు

**మ్యాట్రిమోనియల్ సైట్లో వివరాలతో ఓ ట్రేడరుపై నిషేధం**

**న్యూఢిల్లీ:** స్టాక్ మార్కెట్లలో అవకతవకలకు పాల్పడే వారిని గుర్తించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అన్ని మార్గాల్లో నుంచి సమాచారం సేకరిస్తోంది. తాజాగా ఫ్రంట్ రన్నింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న వైభవ్ ధడ్డా అనే ట్రేడరు ఆనుపానులను ఓ మ్యాట్రిమోనియల్ సైట్ ద్వారా గుర్తించింది. వైభవ్‌తో పాటు అతని కుటుంబం క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలు జరపకుండా నిషేధం విధించింది. వివరాల్లోకి వెడితే ఫిడిలిటీ గ్రూప్‌లో పనిచేస్తున్న వైభవ్‌కు.. కీలకమైన ఆర్డర్లకు సంబంధించి ముందస్తు సమాచారం ఉండేది. దీని ఆధారంగా అతను, అతని తల్లి అల్కా, సోదరి ఆరుషి ట్రేడింగ్ చేసేవారు. వైభవ్‌కి సంబంధించిన



ఇతర వివరాలను సేకరించే క్రమంలో జైన్‌శుభ్‌బంధన్‌డాట్‌కామ్‌లో పొందుపర్చిన సమాచారం ఆధారంగా ఈ ముగ్గురి మధ్య బంధుత్వాన్ని సెబీ గుర్తించింది. వీరు అక్రమంగా ఆర్జించిన రూ. 1.86 కోట్ల లాభాలను 15 రోజుల్లోగా ఎస్క్రో ఖాతాలో జమచేయాలంటూ ఆదేశించింది. నిధులను దారి మళ్లించకుండా వారి ఖాతాలను స్తంభింపచేసింది. కొన్నాళ్ల క్రితం దీప్ ఇండస్ట్రీస్ .. ఇన్‌సైడర్ ట్రేడింగ్ వ్యవహారంలో ఫేస్‌బుక్ అకౌంట్ల ఆధారంగా అనుమానితులను పట్టుకుంది సెబీ.

## ఈసారి 5 శాతంలోపే వృద్ధి

**ఐహెచ్‌ఎస్ మార్కిట్ నివేదిక**

**న్యూఢిల్లీ:** ఉద్దీపన చర్యల ప్రభావం పూర్తి స్థాయిలో ప్రతిఫలించడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 5 శాతానికన్నా కాస్త తక్కువగానే ఉండవచ్చని కన్సల్టెన్సీ సంస్థ ఐహెచ్‌ఎస్ మార్కిట్ ఒక నివేదికలో పేర్కొంది. బలహీన ఆర్థిక రంగ పరిస్థితులు.. భారత వృద్ధి వేగంపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయని తెలిపింది. మొండిబాకీల భారంతో కుదేలవుతున్న ప్రభుత్వ రంగ బ్యాంకులు కొత్తగా రుణాలివ్వలేని పరిస్థితి కూడా ఇందుకు కారణం కానుందని పేర్కొంది. అటు బ్యాంకింగ్‌యేతర ఆర్థిక సంస్థల్లో నెలకొన్న సంక్షోభం .. వాటికి రుణాలిచ్చిన బ్యాంకులకు కూడా వ్యాపించే రిస్కులు పొంచి



ఉన్నాయని, రుణ వృద్ధిపై ఇవి కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఐహెచ్‌ఎస్ మార్కిట్ తెలిపింది. ఆర్థిక వృద్ధి మందగించడం వల్ల తయారీ రంగానికి, పెట్టుబడులకు ప్రోత్సాహమిచ్చే చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుందని వివరించింది. 2019-20 వృద్ధి అంచనాలను ఇటీవలే ఆర్‌బీఐ 6.1% నుంచి 5%కి కుదించిన నేపథ్యంలో తాజా ఐహెచ్‌ఎస్ మార్కిట్ నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది.

# అంతర్జాతీయ అంశాలే దిక్సూచి..!

**న్యూఢిల్లీ:** భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) కేవలం 4.5 శాతం వృద్ధి రేటుకే పరిమితంకావడం, ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించడం వంటి ప్రతికూల అంశాల నేపథ్యంలో గతవారం దేశీయ స్టాక్ మార్కెట్ ఒక శాతం నష్టాలను నమోదుచేసింది. నిఫ్టీ 12,000 పాయింట్ల సైకలాజికల్ మార్కును కోల్పోయింది. ఇక ఈ వారంలో మార్కెట్ ట్రెండ్ ఏ విధంగా ఉండనుందనే అంశానికి వస్తే.. ఒడిదుడుకులకే ఆస్కారం ఉందని, మరింత కరెక్షన్‌కు ఆస్కారం ఉందని అధిక శాతం విశ్లేషకులు అంచనావేస్తున్నారు. బలహీనమైన వృద్ధి, క్షీణిస్తున్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, ప్రస్తుత ప్రీమియం వాల్యుయేషన్ నిలబెట్టుకునే అవకాశం లేదని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం చీఫ్ వినోద్ నాయర్ విశ్లేషించారు. ప్రపంచవ్యాప్తంగా సులభమైన ద్రవ్య విధానాన్ని అనుసరిస్తే మాత్రం మన మార్కెట్లలో పతనానికి అడ్డుకట్ట

- అమెరికా-చైనాల వాణిజ్య ఒప్పందంపై పెరిగిన ఆశావాదం
- మంగళ, బుధవారాల్లో అమెరికా ఎఫ్‌ఓఎంసీ సమావేశం
- గురువారం యూకేలో సాధారణ ఎన్నికలు
- ఐఐపీ, ద్రవ్యోల్బణం డేటా ఈవారంలోనే...

పడుతుందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిఫ్టీ 11,750-12,100 స్థాయిలో ఉండేందుకు అవకాశం ఉందని అంచనా వేశారు.

**ట్రేడ్ డీల్‌పై ఆశలు**

నవంబర్‌లో అమెరికాలోని నిరుద్యోగుల రేటు 3.5 శాతానికి తగ్గడం, వాణిజ్య ఒప్పందంపై



పెరిగిన ఆశావాదం కారణంగా శుక్రవారం అక్కడి స్టాక్ సూచీలు ఒక శాతం లాభాలను నమోదుచేశాయి. అమెరికా అనేక విడతల్లో చైనా వస్తువులపై సుంకాలు విధించిన విషయం తెలిసిందే కాగా, ఈ నెల 15 నుంచి 156 బిలియన్ డాలర్ల కొత్త టారిఫ్‌లు అమలులోకి రానున్నాయి. ఈ గడువుతేదీ కంటే ముందుగానే అమెరికా-చైనాల మధ్య తొలి విడత వాణిజ్య ఒప్పందాలు పూర్తయ్యే సూచనలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఇదే జరిగితే మన మార్కెట్ కూడా సానుకూలంగా స్పందించనుందని దలాల్ స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి.

**ఫెడ్ సమావేశంపై దృష్టి**

వడ్డీ రేట్లను సమీక్షించేందుకు అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్‌ఓఎంసీ) మంగళ, బుధవారాల్లో సమావేశం కానుంది. ఈ ఏడాదిలో చివరిసారిగా జరిగే ఈ సమావేశం నుంచి వెలువడే నిర్ణయాలు భారత మార్కెట్‌కు అత్యంత కీలకం కానున్నాయని సామ్కో సెక్యూరిటీస్ సీఈఓ జిమీత్ మోదీ అన్నారు. ఇక గురువారం యూకేలో జరిగే సాధారణ ఎన్నికలు బ్రెగ్జిట్‌కు ఒక దిశను ఇవ్వనున్న నేపథ్యంలో ఈ అంశంపై కూడా మార్కెట్ వర్గాలు దృష్టిసారించాయి. మరోవైపు పెరిగిన ముడిచమురు ధరలు ఈవారం మార్కెట్ గమనానికి మరో కీలక అంశంగా మారాయి.

**ఆర్థికాంశాల ప్రభావం**

అక్టోబర్ నెలకు సంబంధించిన పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ), నవంబర్ నెల రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) డేటా గురువారం వెల్లడికానున్నాయి. శుక్రవారం డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం డేటా విడుదలకానుంది.

### ఎఫ్‌ఐఐల నికర విక్రయాలు..

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) ఈనెల్లో ఇప్పటివరకు రూ. 244 కోట్లను భారత మార్కెట్ నుంచి ఉపసంహరించుకున్నారు. డిపాజిటరీల సమాచారం మేరకు.. గడిచిన వారంలో వీరు రూ. 1,669 కోట్లను ఈక్విటీ మార్కెట్ నుంచి వెనక్కు తీసుకున్నారు. అయితే, డెట్ మార్కెట్‌లో రూ.1,424 కోట్లను పెట్టుబడి పెట్టడం ద్వారా వీరి నికర ఉపసంహరణ రూ. 244 కోట్లుగా నిలిచింది.



## నవంబర్‌లో పెరిగిన మారుతీ సుజుకీ ఉత్పత్తి



**న్యూఢిల్లీ:** దేశీ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్‌ఐ).. నవంబర్‌లో వాహనాల ఉత్పత్తిని పెంచింది. గత నెలలో మొత్తం వాహనాల ఉత్పత్తి 1,41,834 యూనిట్లుగా నమోదైనట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో పేర్కొంది. అంతక్రితం ఏడాది నవంబర్‌లోని 1,35,946 యూనిట్లతో పోల్చితే ఈసారి ఉత్పత్తి 4.33 శాతం మేర పెరిగినట్లు వెల్లడించింది. ప్రయాణికుల వాహనాల ఉత్పత్తి గతనెల్లో 1,39,084 యూనిట్లు కాగా, అంతకుముందు ఏడాది ఇదే కాలంలోని 1,34,149 యూనిట్లతో పోల్చితే 3.67 శాతం వృద్ధి ఉందని కంపెనీ వివరించింది. అక్టోబర్ నెల కార్ల ఉత్పత్తిలో 20.7 శాతం కోతను విధించి 1,19,337 యూనిట్లకే పరిమితం చేసిన సంస్థ.. గతనెల్లో పెంపును ప్రకటించింది.

### కోడిగుడ్డు

(హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 09-12-2019

| | |
|---|---|
| విశాఖ | 460-00 |
| చిత్తూరు | 453-00 |
| వరంగల్ | 431-00 |
| విజయవాడ | 452-00 |
| గోదావరి | 452-00 |
| 08-11-2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 428-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 5.50 |

# భారత్‌లో వృద్ధి మాంద్యం..

**న్యూఢిల్లీ:** పాలనాధికారాలన్నీ ప్రధాని కార్యాలయంలోనే కేంద్రీకృతమై ఉన్నాయని, మంత్రులంతా నిమిత్తమాత్రులుగానే ఉంటున్నారని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ వ్యాఖ్యానించారు. ఇలాంటి పాలనతో ఎకానమీ తీవ్ర రుగ్మతలతో సతమతమవుతోందని .. దేశం 'వృద్ధి మాంద్యం' పరిస్థితుల్లో చిక్కుకుందని పేర్కొన్నారు. ఒక వార్తాపత్రికకు రాసిన వ్యాసంలో ఆయన ఈ విషయాలు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దేశాన్ని గట్టెక్కించాలంటే పెట్టుబడులు, భూ.. కార్మిక చట్టాలపరమైన సంస్కరణలు మరిన్ని చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. దీంతో పెట్టుబడులతో పాటు వృద్ధికి కూడా ఊతం లభించగలదని రాజన్ తెలిపారు. దేశ సమర్థతను మెరుగుపర్చుకోవడానికి, పోటీ దేశాలకు దీటుగా ఎదగడానికి .. ఉపయుక్తంగా ఉండే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడంపై భారత్ దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. 'ప్రస్తుత ప్రభుత్వంతో సమస్యేమిటంటే .. అధికారాలన్నీ ఒకే చోట కేంద్రీకృతమై ఉంటాయి. నిర్ణయాలే కాదు.. ఆలోచనలు, ప్రణాళికలు.. అన్నీ కూడా ప్రధాని చుట్టూ ఉండే కొద్ది మంది, ప్రధాని కార్యాలయం నుంచి వస్తుంటాయి. ఒక పార్టీ రాజకీయ, సామాజిక ఎజెండాను అమలు చేయడానికి ఇలాంటి విధానం పనికొస్తుంది కానీ.. ఆర్థిక సంస్కరణల విషయంలో ఇది పనిచేయదు. ఇందుకు రాష్ట్రాల స్థాయిలో కాకుండా జాతీయ స్థాయిలో ఎకానమీ ఎలా పనిచేస్తుందన్న దానిపై

- అధికారాలన్నీ పీఎంవోలోనే కేంద్రీకృతం
- దేశానికి ఇది శ్రేయస్కరం కాదు
- విమర్శిస్తే రాజకీయ దురుద్దేశాలు అంటగట్టొద్దు
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

అపార పరిజ్ఞానం అవసరమవుతుంది' అని రాజన్ పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు సంకీర్ణంగా నడిచినప్పటికీ.. ఆర్థిక విధానాల సరళీకరణను స్థిరంగా ముందుకు తీసుకెళ్లాయన్నారు. 'తీవ్ర స్థాయిలో అధికార కేంద్రీకరణ, మంత్రులకు అధికారాలు లేకపోవడం తదితర అంశాల కారణంగా.. పీఎంవో దృష్టి పెట్టినప్పుడు మాత్రమే సంస్కరణలు జోరందుకుంటున్నాయి. పీఎంవో దృష్టి మిగతా అంశాలవైపు మళ్లిన మరుక్షణం.. సంస్కరణల జోరూ తగ్గిపోతోంది' అని రాజన్ అన్నారు.

**ముందుగా సమస్యను గుర్తించాలి ..**

ఆర్థిక మందగమనానికి మందు కనుగొనాలంటే.. ముందుగా సమస్య తీవ్రతను గుర్తించడం దగ్గర్నుంచి మొదలుపెట్టాల్సి ఉంటుందని రాజన్ తెలిపారు. 'సమస్య పరిమాణాన్ని గుర్తించాలి. సమస్య తాత్కాలికమేనని.. ప్రతికూల వార్తలు, అననుకూల సర్వేలను తొక్కి పెట్టి ఉంచితే అది పరిష్కారమైపోతుందనే ఆలోచనల నుంచి బైటికి రావాలి. విమర్శించే ప్రతి ఒక్కరికీ రాజకీయ దురు



ద్దేశాలు ఆపాదించడం మానుకోవాలి. దేశం వృద్ధి మాంద్య పరిస్థితుల మధ్యలో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో గణనీయమైన ఒత్తిడి ఉంది' అని ఆయన పేర్కొన్నారు. భారత జీడీపీ వృద్ధి రేటు.. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఆరేళ్ల కనిష్టమైన 4.5%కి పడిపోయిన నేపథ్యంలో రాజన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**సంస్కరణలు తేవాలి..**

రియల్ ఎస్టేట్, నిర్మాణ, ఇన్‌ఫ్రా రంగాలు.. వాటికి రుణాలిచ్చిన నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు సంక్షోభంలో ఉన్నాయని రాజన్ చెప్పారు. బ్యాంకుల్లో మొండి బాకీలు కూడా తోడవడంతో రుణ వితరణ వృద్ధి ఉండటం లేదన్నారు. సామాన్యుల నుంచి కార్పొరేట్ల దాకా అందరి రుణభారం, యువతలో నిరుద్యోగిత పెరిగిపోతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భూ సమీకరణ, కార్మిక చట్టాలపరమైన సంస్కరణలు, స్థిరమైన పన్నులు.. నియంత్రణా వ్యవస్థల విధానాలు అమలు చేయాలని రాజన్ సూచించారు.

### రూ.3,500 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్న హైన్స్

**న్యూఢిల్లీ:** అమెరికాకు చెందిన రియల్టీ సంస్థ, హైన్స్ భారత్‌లో 50 కోట్ల డాలర్లు (రూ.3,500 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నది. భారత్‌లో కొత్త వాణిజ్య, నివాసిత ప్రాజెక్ట్‌ల్లో ఈ రేంజ్‌లో పెట్టుబడులు పెట్టాలని హైన్స్ యోచిస్తోంది. ప్రస్తుతం ప్రాపర్టీ మార్కెట్లో మందగమనం ఉన్నా, భవిష్యత్తులో వృద్ధికి మంచి అవకాశాలున్నాయని ఈ కంపెనీ భావి



స్తోంది. ఆఫీస్‌స్పేస్ లీజింగ్‌కు భారత్‌లో మంచి డిమాండ్ ఉందని కంపెనీ పేర్కొంది. ప్రస్తుతం హైన్స్ కంపెనీ 23 దేశాల్లోని 219 నగరాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 2006లో భారత్‌లో ప్రవేశించిన ఈ కంపెనీ ఇప్పటి దాకా 40 కోట్ల డాలర్ల మేర పెట్టుబడులు పెట్టింది. ఈ కంపెనీ చేపట్టిన ఆరు ప్రాజెక్ట్‌ల్లో రెండు ప్రాజెక్ట్‌లు ఇప్పటికే పూర్తయ్యాయి.

### ఇద్దరు కీలక అధికారుల్లేకుండానే బడ్జెట్ తయారీ

**న్యూఢిల్లీ:** ఈ విడత కేంద్ర ఆర్థిక బడ్జెట్ ఇద్దరు పూర్తి స్థాయి అధికారుల్లేకుండానే తయారుకానుంది. 2020-21 బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌కు మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించనున్నారు. దేశ వృద్ధి రేటు ఆరేళ్ల కనిష్టానికి చేరిన సమయంలో వచ్చే బడ్జెట్ ముఖ్య సంస్కరణలు లేదా కీలక ప్రకటనలకు వేదిక అవుతుందని అంచనాలున్నాయి.



అయితే, బడ్జెట్లో ముఖ్య పాత్ర వహించే.. వ్యయ విభాగం సెక్రటరీ పోస్ట్‌లో తాత్కాలిక అధికారి ఉన్నారు. వ్యయ విభాగం కార్యదర్శిగా ఉన్న జీసీ ముర్మును నూతన కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ కశ్మీర్‌కు లెఫ్టినెంట్ గవర్నర్‌గా కేంద్రం పంపించింది. ఆ తర్వాత ఈ విభాగం బాధ్యతలను ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అతను చక్రవర్తికి కేంద్రం అప్పగించింది.

### అక్టోబర్‌లో విదేశీ రుణాలు 3.41 బిలియన్ డాలర్లు

**న్యూఢిల్లీ:** భారత కార్పొరేట్ సంస్థల విదేశీ రుణ సమీకరణ అక్టోబర్‌లో 3.41 బిలియన్ డాలర్లు(రూ.24,211 కోట్లు)గా నమోదైంది. ఇందులో 2.87 బిలియన్ డాలర్లు ఆటోమేటిక్ ఈసీబీ రూపంలో, 538 మిలియన్ డాలర్లు అనుమతితో కూడిన ఈసీబీ మార్గంలో సమీకరించినవి. అంతక్రితం సెప్టెంబర్ నెలతో పోలిస్తే రెండింతలు పెరిగాయి. సెప్టెంబర్‌లో దేశీయ



కంపెనీలు విదేశీ మార్కెట్ల నుంచి 1.41 బిలియన్ డాలర్లు సమీకరించాయి. ముత్తూట్ ఫైనాన్స్ 400 మిలియన్ డాలర్లు, హెచ్‌పీసీఎల్ మిట్టల్ ఎనర్జీ 300 మిలియన్ డాలర్లు, వార్ధా సోలార్ 251 మిలియన్ డాలర్లు, ఎల్‌అండ్‌టీ 200 మిలియన్ డాలర్లు, డెక్కన్ ఫైన్ కెమికల్స్ 140 మిలియన్ డాలర్లు, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 400 మిలియన్ డాలర్లు సమీకరించాయి.

## వచ్చే ఏడాదిలో సిట్రోయెన్ 'సీ5 ఎయిర్‌క్రాస్'..!

**న్యూఢిల్లీ:** యూరోపియన్ ఆటో దిగ్గజం గ్రూప్ పీఎస్‌ఏ.. వచ్చే ఏడాదిలో తన సిట్రోయెన్ బ్రాండ్ కార్లను ఇక్కడి మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా తొలుత 'సీ5 ఎయిర్‌క్రాస్' స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ (ఎస్‌యూవీ)ని విడుదలచేయనున్నట్లు వెల్లడించింది. కంపెనీ ప్రణాళిక ప్రకారం.. ఈ ఏడాదే ఎస్‌యూవీ విడుదల కావాల్సి ఉన్నా, తొలికారు విషయంలో రాజీలేకుండా ఉండటానికే మరింత సమయం తీసుకున్నట్లు సంస్థ భారత సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సేల్స్ అండ్ మార్కెటింగ్ రోలాండ్ బౌచారా అన్నారు.



## 40,250 దిగువన సెన్సెక్స్ మరింత బలహీనం

**మార్కెట్ పంచాంగం**

సెప్టెంబర్ క్వార్టర్లో జీడీపీ వృద్ధి రేటు ఆరేళ్ల కనిష్టస్థాయి 4.5 శాతానికి దిగజారినప్పటికీ, ఆ ప్రతికూలాంశాన్ని ఇప్పటికే డిస్కౌంట్ చేసుకున్నందున, గత వారం తొలిరోజున స్టాక్ మార్కెట్ స్థిరంగానే ముగిసింది. ఆర్థిక వ్యవస్థకు ప్రతిబింబాలుగా ఇన్వెస్టర్లు పరిగణిస్తున్న కొన్ని ప్రధాన బ్యాంకింగ్ షేర్లు కొత్త రికార్డుస్థాయికి చేరవయ్యాయి కూడా. ఇంతలో రిజర్వుబ్యాంక్ నిర్ణయం మార్కెట్ సెంటిమెంట్‌ను ఒక్కసారిగా మార్చివేసింది. వృద్ధి రేటును వేగవంతం చేసేదిశగా వడ్డీ రేట్లు మరింత తగ్గుతాయన్న నిపుణుల అంచనాలకు భిన్నంగా ఆర్‌బీఐ రేట్లలో ఎటువంటి మార్పూ చేయకపోగా, పూర్తి సంవత్సరానికి జీడీపీ అంచనాల్ని 5 శాతానికి కుదించి, ద్రవ్యోల్బణ అంచనాల్ని 5 శాతానికి మించి పెంచేసింది. దీంతో మార్కెట్ కరెక్షన్ బాట పట్టింది. ఇక డిసెంబర్ 15లోపున కుదురుతుందని భావిస్తున్న అమెరికా-చైనాల ట్రేడ్‌డీల్‌పైన ఆశలు, కొత్త ఏడాదిలో కేంద్ర బడ్జెట్‌పైనే మార్కెట్‌కు వున్న అంచనాలే...భారీ కరెక్షన్ రాకుండా మార్కెట్‌ను పరిరక్షించవచ్చు. ఇక సూచీల స్వల్పకాలిక సాంకేతికాలు ఇలా వున్నాయి.

**సెన్సెక్స్ సాంకేతికాంశాలు...**




డిసెంబర్ 6తో ముగిసినవారం తొలిరోజున 41,094 పాయింట్ల గరిష్టస్థాయి వరకూ చేరిన బీఎస్‌ఈ సెన్సెక్స్ తర్వాత వారాంతంలో బాగా తగ్గింది. చివరకు అంతక్రితం వారం ముగింపుతో పోలిస్తే 349 పాయింట్ల నష్టంతో 40,445 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారంలో క్షీణత కొనసాగితే సెన్సెక్స్‌కు 40,275 పాయింట్ల సమీపంలో తొలి మద్దతు లభిస్తున్నది. ఈ స్థాయిని కోల్పోతే వేగంగా మరింత బలహీనపడి 40,000 పాయింట్ల వద్దకు క్షీణించవచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే 39,680 పాయింట్ల వరకూ తగ్గవచ్చు. అంతర్జాతీయ సానుకూల సంకేతాల ప్రభావంతో ఈ సోమవారం సెన్సెక్స్ పాజిటివ్‌గా మొదలైతే తొలుత 40,560 పాయింట్ల వద్దకు పెరగవచ్చు. అటుపైన 40,890 పాయింట్ల వరకూ పెరగవచ్చు. ఈ స్థాయిని సైతం అధిగమిస్తే 40,950-41,160 పాయింట్ల శ్రేణిని అందుకునే చాన్సుంటుంది.

**నిఫ్టీ తక్షణ మద్దతు 11,880**




ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ గతవారం 12,131 పాయింట్ల గరిష్టస్థాయి నుంచి 11,888 పాయింట్ల కనిష్టస్థాయికి తగ్గింది. చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 134 పాయింట్ల నష్టంతో 11,922 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ సోమవారం మార్కెట్ పాజిటివ్‌గా మొదలైతే నిఫ్టీ 11,970 పాయింట్ల సమీపంలో తొలి నిరోధం కలగవచ్చు. ఈ అవరోధస్థాయిని దాటితే 12,055 పాయింట్ల వరకూ పెరగవచ్చు. అటుపై మరోదఫా 12,100-12,160 పాయింట్ల శ్రేణిని అందుకోవొచ్చు. ఈ వారం తొలి నిరోధాన్ని నిఫ్టీ దాటలేకపోతే 11,880 పాయింట్ల సమీపంలో తొలి మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతు దిగువన నిఫ్టీ మరింత బలహీనపడి 11,800 పాయింట్ల వరకూ తగ్గవచ్చు. ఆ లోపున క్రమేపీ 11,680 పాయింట్ల వరకూ కరెక్షన్ కొనసాగవచ్చు.

– పి. సత్యప్రసాద్

# వేల్యూ ఫండ్స్‌ను కొనసాగించవచ్చా?

**Q & A**



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



**నేను సీనియర్ సిటిజెన్‌ను. గత ఏడాది కాలం నుంచి మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్)మార్గంలో ఇన్వెస్ట్ చేస్తున్నాను. నా పోర్ట్‌ఫోలియోలో టాటా డిజిటల్ ఇండియా ఫండ్, ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ డిజిటల్ ఇండియా ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ టెక్నాలజీ ఫండ్, ఫ్రాంక్లిన్ ఇండియా టెక్నాలజీ ఫండ్, యాక్సిస్ బ్లూచిప్ ఫండ్‌లు ఉన్నాయి. వీటిల్లో ఇన్వెస్ట్‌మెంట్స్‌కు కొనసాగించదగ్గ ఫండ్స్ ఏవి?**

-రవీందర్, కాకినాడ

మీ పోర్ట్‌ఫోలియోలో ఉన్న మొత్తం ఐదు ఫండ్స్‌ల్లో నాలుగు ఫండ్స్ టెక్నాలజీ ఫండ్సే ఉన్నాయి. డైవర్సిఫికేషన్ ప్రయోజనాలు పొందాలంటే పోర్ట్‌ఫోలియోలో ఒక టెక్నాలజీ ఫండ్ ఉంటే సరిపోతుంది. కానీ మీ పోర్ట్‌ఫోలియోలో ఏకంగా నాలుగు టెక్నాలజీ ఫండ్స్ ఉన్నాయి. ఇది సరైన ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహం కాదు. ముఖ్యంగా మీలాంటి సీనియర్ సిటిజన్‌కు ఇది పూర్తిగా సరైనది కాదు. మీలాంటి వాళ్లకు నిలకడైన ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ ఉండాలి. దీని కోసం హైబ్రిడ్ ఫండ్‌ను గానీ, మల్టీ క్యాప్ ఫండ్‌ను గానీ ఎంచుకోవాలి. అయితే గత రెండేళ్లుగా టెక్నాలజీ/డిజిటల్ ఫండ్స్ మంచి రాబడులను ఇచ్చాయి. కాబట్టి ఇప్పుడు ఇతర ఫండ్స్‌తో పోల్చితే టెక్నాలజీ ఫండ్సే మెరుగని అనిపిస్తూ ఉండొచ్చు. ఈ విషయంలో ఇప్పుడు మీరు అదృష్టవంతులు. అలాగని ఎప్పుడూ ఇదే అదృష్టం కొనసాగుతుందని చెప్పలేం. అందుకని నాలుగు టెక్నాలజీ ఫండ్స్‌ను ఒకటికి తగ్గించుకోండి. యాక్సిస్ బ్లూచిప్ ఫండ్‌ను కొనసాగించవచ్చు. మరో హైబ్రిడ్ ఫండ్‌ను గానీ, మల్టీ క్యాప్ ఫండ్‌ను గానీ మీ పోర్ట్‌ఫోలియోలో చేర్చుకోండి.

**నేను రిటైరవ్వడానికి మరో 13 ఏళ్ల సమయం ఉంది. రిటైర్మెంట్ అవసరాల కోసం కొన్ని మ్యూచువల్ ఫండ్స్‌లో నెలకు కొంత మొత్తం సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేస్తున్నాను. నా పోర్ట్‌ఫోలియోలో ఐదు మల్టీ-క్యాప్ ఫండ్స్ ఉన్నాయి. ఇవి కాకుండా రెండు వేల్యూ ఫండ్స్-క్వాంటమ్ ఇండియా వేల్యూ ఫండ్, ఐసీఐసీఐ ప్రు వేల్యూ డిస్కవరీ ఫండ్స్ కూడా ఉన్నాయి. మల్టీ క్యాప్ ఫండ్స్ పనితీరు సంతృప్తికరంగా ఉన్నా, ఈ వేల్యూ ఫండ్స్ పనితీరు అంతంతమాత్రంగానే ఉంది. వీటిల్లో ఇన్వెస్ట్‌మెంట్స్ కొనసాగించవచ్చా ?**

-సుచిత్ర, హైదరాబాద్

మీరు రిటైరవ్వడానికి మరో 13 సంవత్సరాల సమయం ఉంది. అంటే మీరు మరో 13 ఏళ్ల పాటు ఇన్వెస్ట్ చేయగలరు. కాబట్టి ఈ వేల్యూ ఫండ్స్‌లో మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కొనసాగించవచ్చు. ఈ ఫండ్స్ పనితీరు ప్రస్తుతం అంతంతమాత్రంగానే ఉండొచ్చు కానీ మరీ తీసికట్టుగా ఏమీ లేదనే చెప్పవచ్చు. ఈ ఫండ్స్‌ల్లో 13 ఏళ్ల పాటు ఇన్వెస్ట్‌మెంట్స్ కొనసాగిస్తే, కనీసం రెండు మార్కెట్ సైకిల్స్‌ను ఈ ఫండ్స్ చూస్తాయి. ఈ కాలంలో ఈ ఫండ్స్ పనితీరు మెరుగు పడే అవకాశాలే చాలా అధికంగా ఉన్నాయి. మార్కెట్ నష్టాల్లో ఉన్నప్పుడు ఈ ఫండ్స్ మరీ అంతగా నష్టపోకుండా ఉండటం, మీ పోర్ట్‌ఫోలియోకు ఒకింత స్థిరత్వం ఇచ్చి ఉండటం మీరు గమనించే ఉండాలి. మల్టీ క్యాప్ ఫండ్స్‌తో పాటు వేల్యూ ఫండ్స్ ఉండటం వల్ల మీ పోర్ట్‌ఫోలియో.. డైవర్సిఫికేషన్ పరంగా చూస్తే, మంచి స్థితిలోనే ఉందని చెప్పవచ్చు. ఐసీఐసీఐ ప్రు వేల్యూ డిస్కవరీ ఫండ్ పనితీరు ఒకింత నిరాశమయంగా ఉన్నప్పటికీ, 13 ఏళ్ల కాలంలో ఈ ఫండ్ పుంజుకొని మంచి రాబడులు ఇచ్చే అవకాశాలే అధికంగా ఉన్నాయి. మరోవైపు ఈ ఫండ్ పోర్ట్‌ఫోలియో పటిష్టంగానే ఉంది. నాణ్యత గల షేర్లే ఈ ఫండ్ పోర్ట్‌ఫోలియోలో ఉన్నాయి. ఎలాంటి అనుమానాలు లేకుండా ఈ వేల్యూ ఫండ్స్‌ల్లో మీ సిప్‌లను కొనసాగించండి.

**సాధారణంగా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ వివిధ రంగాలకు చెందిన కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి కదా ! వివిధ రంగాల కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఆ యా రంగాల్లోని రిస్క్‌లు ఆయా కంపెనీలపై బాగానే ప్రభావం చూపుతాయి కదా! అలాంటప్పుడు ఈక్విటీ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్ చేయడం సరైనదేనా ? అసలు ఈక్విటీ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్ చేసేటప్పుడు అసలు ఎలాంటి విషయాలు పరిగణనలోకి తీసుకోవాలి?**

–జావేద్, విజయవాడ

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ వివిధ రంగాలకు చెందిన కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. అయితే ఒక ఫండ్ ఏ రంగాల కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసిందనే విషయం ప్రధానాంశంగా ఫండ్స్‌కు సంబంధించిన ఇన్వెస్ట్‌మెంట్ నిర్ణయాలు తీసుకోకూడదు. గతంలో ఒక ఫండ్ పనితీరు ఎలా ఉంది అనే విషయాన్నే పరిగణనలోకి తీసుకొని ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవాలి. మార్కెట్ పెరుగుతున్నప్పుడు, అలాగే మార్కెట్ పతన బాటలో ఉన్నప్పుడూ సదరు ఫండ్ పనితీరు ఎలా ఉంది అనే విషయం కీలకం. అలాగే సదరు ఫండ్‌ను నిర్వహిస్తున్న ఫండ్ మేనేజర్ ట్రాక్ రికార్డ్ ఎలా ఉంది? దీర్ఘకాలం పాటు అతని పనితీరు సవ్యంగానే ఉందా ?అనే విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. చాలా ఈక్విటీ ఫండ్స్ పోర్ట్‌ఫోలియోలు దాదాపు ఒకేలాగా ఉన్నప్పటికీ, వాటి రాబడుల్లో మాత్రం తేడా ఉండొచ్చు. అందుకని ఈక్విటీ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసేటప్పుడు సదరు ఫండ్ పోర్ట్‌ఫోలియోనే కీలకంగా చూడకూడదు. ఆ ఫండ్ పనితీరును కూడా మదింపు చేయాలి.

# ‘వజ్ర’కు సెలవు!

## కనుమరుగు కానున్న ఏసీ మినీ బస్సులు

## సీట్లు తొలగించి సరుకు రవాణా విభాగానికి బదిలీ

## 1,200 బస్సులతో ప్రత్యేకంగా గూడ్స్ విభాగం

సాక్షి, హైదరాబాద్

బస్టాండ్ల వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కాలనీల్లోనే బస్సు ఎక్కే వసతి కల్పిస్తూ ప్రవేశపెట్టిన వజ్ర ఏసీ బస్సుకు ఆర్టీసీ టాటా చెప్పేసింది. వజ్ర సర్వీసును ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. ఏసీ వసతితో ఉండే ఈ మినీ బస్సులను ఇక సరుకు రవాణా బస్సులుగా మార్చాలని నిర్ణయించింది. మరికొద్ది రోజుల్లో వాటి సేవలను నిలిపివేయనుంది. ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు ప్రారంభించిన ఆ సర్వీసులు కొన్ని లోపాల వల్ల ప్రయాణికుల ఆదరణకు నోచుకోలేదు. రూ.12 కోట్ల మేర నష్టాలు మోసుకురావటంతో వాటిని వదిలించుకోవాలని నిర్ణయించింది. సీఎం కేసీఆర్ అనుమతితో వజ్ర సర్వీసులను ఆర్టీసీ ఉపసంహరించుకుంటోంది.

**సరుకు రవాణాకు..**

ఆర్టీసీని నిర్వహించటం సాధ్యం కాదని దాదాపు తేల్చేసి ఆ తర్వాత మనసు మార్చుకుని సంస్థను కొనసాగించాలని నిర్ణయించిన సీఎం కేసీఆర్.. ఇప్పుడు దానిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో ఆర్టీసీ ఆదాయాన్ని పెంచేందుకు సరుకు రవాణా సేవలను ప్రారంభించాలని నిర్ణయించారు. ఇప్పటికే ప్రైవేటు సంస్థతో కలిసి పార్శిల్ సర్వీసును ఆర్టీసీ కొనసాగిస్తోంది. దాన్ని పూర్తిస్థాయి సరుకు రవాణాగా మార్చాలని సీఎం ఆదేశించారు. ఇందుకోసం తొలుత 1,200 బస్సులను సరుకు రవాణాకు కేటాయించాలని ఆర్టీసీ నిర్ణయించింది. నగరంలో నష్టాలు మోసుకొస్తున్నాయన్న ఉద్దేశంతో వేయి సిటీ బస్సులను ఉపసంహరించుకోవాలని ఇప్పటికే నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ వేయి బస్సులను సరుకు రవాణా విభాగానికి మార్చాలని దాదాపు నిర్ణయించింది. వాటికి మరో 200 బస్సులను చేర్చనుంది. అందులో భాగంగా, ప్రస్తుతం అందుబాటులో ఉన్న 58 వజ్ర ఏసీ బస్సులను కూడా వాటికే కేటాయించాలని అధికారులు నిర్ణయించారు. వాటిల్లోని సీట్లను తొలగించి సరుకు రవాణాకు వీలుగా మార్చనున్నారు.

**ప్రభుత్వ గోదాములకు అనుబంధంగా..**

రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసేందుకు పెద్ద సంఖ్యలో గోదాములను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వీటిల్లోకి సరుకు తరలించేందుకు వందల సంఖ్యలో లారీలను వినియోగిస్తున్నారు. ఇవన్నీ ప్రైవేటు వాహనాలే. ఇప్పుడు ఈ సరుకు రవాణాలో ఆర్టీసీ బస్సు సేవలను తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. సంబంధిత విభాగాలకు ఈమేరకు ఆదేశాలు అందనున్నాయి. ప్రైవేటు వాహనాలు బుక్ చేసుకుంటున్నట్టుగానే ఆర్టీసీ సరుకు రవాణా బస్సులను కూడా బుక్ చేసుకోబోతున్నారు. ఈ రూపంలో ఆర్టీసీకి భారీగానే ఆదాయం వస్తుందని అంచనా. దీంతోపాటు ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు కూడా నేరుగా సంబంధిత డిపోలకు వెళ్లి సరుకు రవాణా బస్సులను బుక్ చేసుకోవచ్చు. త్వరలోనే దీనికి సంబంధించిన ధరలు నిర్ణయిస్తారు.




### వజ్ర స్వరూపం ఇది..

నగరం నుంచి ప్రధాన పట్టణాలకు కాలనీల మీదుగా నడిపేందుకు వజ్ర పేరుతో ఏసీ మినీ బస్సు సేవలను ఆర్టీసీ 2017 మే నెలలో ప్రారంభించింది. హైదరాబాద్ నుంచి వరంగల్, నిజామాబాద్‌కు ప్రారంభించారు. ఆ తర్వాత కరీంనగర్, గోదావరిఖనిలకు విస్తరించారు. కానీ జనం ఆదరించలేదు. బస్సుల నాణ్యత కూడా సరిగా లేదని, ప్రయాణం ఇబ్బందిగా ఉందని ఫిర్యాదులొచ్చాయి. బస్టాండ్లకు వెళ్లకపోవటం పెద్ద మైనస్‌గా మారింది. ఇక గరుడ బస్ కంటే దీని టికెట్ ధర ఎక్కువగా ఉండటం మరో ప్రధాన ఫిర్యాదు. శ్రీశైలం, యాదగిరిగుట్ట, కర్నూలు లాంటి ప్రాంతాలకు నడిపినా.. డిపోలకు వెళ్లేలా చేసినా.. జనం వాటిని పట్టించుకోలేదు. చూస్తుండగానే రూ.12 కోట్ల మేర నష్టాలు రావడంతో వాటికి సెలవు చెప్పాల్సిన సమయం వచ్చింది.

# జీవన దాతలకోసం... ఎదురుచూపులే!



- అవయవ మార్పిడికి పెరుగుతున్న డిమాండ్
- దాతలు లేక అనేకమంది ఎదురుచూపు
- దాదాపు పావు వంతు మందికే అందుబాటు
- ఏడేళ్లలో 7,126 బాధితుల్లో 1,953 మందికే లభ్యత
- ట్రామాకేర్ సెంటర్లు లేక అవయవాలు వృథా

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో అవయవ మార్పిడి అవసరమైన వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారితో పోలిస్తే, అవయవాల లభ్యత దాదాపు పావు వంతు వరకే ఉంటుంది. దీంతో అవయవ మార్పిడికి నోచుకోక అనేక మంది దీర్ఘకాలిక చికిత్సతోనే కాలం వెళ్లదీస్తున్నారు. కొందరైతే చికిత్స మధ్యలోనే తనువు చాలిస్తున్నారు. దేశంలోనూ రాష్ట్రంలోనూ కిడ్నీ, లివర్, గుండె, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు మరింత పెరుగుతున్న సంగతి తెలిసిందే. వారికి అవయవాలను మార్పిడి చేసేందుకు అవకాశాలు దక్కడంలేదు. ఈ పరిస్థితిపై ఇటీవల గవర్నర్‌కు ఇచ్చిన నివేదికలో వైద్య, ఆరోగ్యశాఖ పలు వివరాలు వెల్లడించింది.

**వెయిటింగ్ లిస్టులో 5,173 మంది..**

రాష్ట్రంలో కిడ్నీ, లివర్, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులతో చనిపోతున్నవారి సంఖ్య పెరుగుతోంది. అటువంటి వారిని రక్షించుకోవాలంటే సాధారణ చికిత్సలతోపాటు అవయవ మార్పిడి అవసరం. దేశంలో మొన్నమొన్నటి వరకు అత్యంత ఎక్కువ అవయవ మార్పిడి చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ నంబర్‌వన్ స్థానంలో ఉంది. ఇప్పుడు ఆ స్థానాన్ని మహారాష్ట్ర దక్కించుకుంది. దేశంలో ఏటా సుమారు 5 లక్షల మంది అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారు. 10 లక్షల మందికి 0.8 అవయవ దానం రేటు ఉండగా, తెలంగాణలో ఆ రేటు నాలుగుగా ఉంది. 2013 నుంచి ఈ ఏడాది ఇప్పటివరకు అంటే ఏడేళ్లలో 7,126 మంది జీవన్‌దాన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోగా, కేవలం 1,953 మందికి మాత్రమే మార్పిడి జరిగింది. ఇంకా 5,173 మంది బాధితులు వెయిటింగ్ లిస్టులో ఉన్నారని వైద్య, ఆరోగ్యశాఖ ఆ నివేదికలో తెలిపింది.

**ట్రామాకేర్ సెంటర్లు లేకపోవడం వల్లే..**

అవయవ మార్పిడి రెండు రకాలుగా జరుగుతుంది. బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి కుటుంబ సభ్యుల సమ్మతి మేరకు అవయవాలను సేకరిస్తారు. అలాగే బతికుండగా బంధువుల సమ్మతి మేరకు కిడ్నీ, లివర్ వంటివి సేకరిస్తారు. ఇక ఇతర దేశాల్లో గుండెపోటుతో చనిపోయిన వారి నుంచి కూడా అవయవాలను సేకరిస్తారు. కానీ మన దేశంలో గుండెపోటుతో చనిపోయిన వారి నుంచి అవయవాలను సేకరించడం లేదు. ఎందుకంటే గుండెపోటుతో చనిపోయిన వారి నుంచి 20 నిమిషాల్లోనే అవయవాలను సేకరించాలి. అంత తక్కువ సమయంలో సేకరించే వ్యవస్థ, మౌలిక సదుపాయాలు మన వద్ద లేవని పలువురు అంటున్నారు. అవయవాల సేకరణకు మనకున్న మార్గాలు బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి, అలాగే కుటుంబ సభ్యుల నుంచి లైవ్‌గా సేకరించడమే. రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన వారిలో ఎక్కువ మంది బ్రెయిన్ డెడ్‌కు గురవుతారు. కానీ జాతీయ రహదారుల వెంట మనకు ట్రామాకేర్ సెంటర్లు లేకపోవడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లేలోగా వారు చనిపోతున్నారు. ట్రామాకేర్ సెంటర్లలో ప్రమాదాలకు గురైన వారికి వైద్యం చేసి బతికించే అవకాశం ఉంటుంది. లేదా బ్రెయిన్ డెడ్ అయితే అటువంటి వారి నుంచి అవయవాలు సేకరించే అవకాశం ఉంటుంది. ఇక కుటుంబ సభ్యుల్లో ఎవరి నుంచైనా కిడ్నీ, లివర్ వంటివి సేకరించాలంటే చాలామంది ముందుకు రావడంలేదు. మానవ సంబంధాలు సక్రమంగా లేకపోవడంతో ఇటువంటి పరిస్థితి నెలకొంటుంది. ఈ పరిస్థితుల వల్ల తెలంగాణలో అనేకమంది అవయవ మార్పిడి చికిత్స అందక మరణిస్తున్నారు.

**జీవన్‌దాన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న, అవయవాలు పొందిన వారి వివరాలు**




### అవయవ మార్పిడికి డిమాండ్ పెరిగింది



అవయవ మార్పిడికి రాష్ట్రంలో డిమాండ్ పెరిగింది. కానీ ఆ మేరకు అందించలేకపోతున్నాం. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో దాదాపు 10 వేల మంది కిడ్నీ డయాలసిస్ చేయించుకుంటున్నారు. అయినా అనేక మంది ఇంకా రిజిస్ట్రేషన్ చేయించుకోవడం లేదు. అవకాశం లేదనో, అవగాహన లేకనో జీవన్‌దాన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవడం లేదు. ఇక రాష్ట్రంలో లక్ష మంది అవయవదాన ప్రతిజ్ఞ చేశారు.

– డాక్టర్ స్వర్ణలత, జీవన్‌దాన్ ఇన్‌చార్జి, హైదరాబాద్

# కాళేశ్వరం నీరు... ‘కృష్ణ’కు చేరు

- బస్వాపూర్ నుంచి సాగర్ ఒడికి జలం
- సమగ్ర అధ్యయనం చేయాలని రిటైర్డ్ ఇంజనీర్లకు సీఎం ఆదేశం



**సాక్షి, హైదరాబాద్ :** కాళేశ్వరంతో గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లోని నాగార్జునసాగర్ ఆయకట్టుకు తరలించి నీటి లభ్యతను పెంచే కొత్త ప్రతిపాదనకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రాణం పోశారు. కాళేశ్వరంలో భాగంగా నిర్మించే బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలను సాగర్ ఆయకట్టు పరీవాహకానికి తరలించి నీటి లభ్యతను పెంచడం, ఆయకట్టును స్థిరీకరించడం లక్ష్యంగా అధ్యయనం చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఎక్కువ భూసేకరణ అవసరం లేకుండా తక్కువ ఖర్చుతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించడంతో ఆ దిశగా అప్పుడే కసరత్తు మొదలైంది.

**3.50లక్షల ఎకరాల స్థిరీకరణ..**

కాళేశ్వరం ప్రాజెక్టును ప్రస్తుతం రెండు టీఎంసీల సామర్థ్యంతో చేపట్టగా, ఇందులో మిడ్‌మానేరు దిగువన ఒక టీఎంసీ, ఎస్సారెస్పీ పునరుజ్జీవానికి మరో టీఎంసీ తరలించేలా ప్రస్తుతం పనులు పూర్తయ్యాయి. నల్లగొండ జిల్లాలో ప్రతిపాదించిన బస్వాపూర్ వరకు నిర్ణయించిన ఆయకట్టుకు నీరివ్వడంతో పాటు సింగూరు, నిజాంసాగర్ వరకు మరింత నీటిని అందుబాటులో ఉంచేందుకు అదనంగా మరో టీఎంసీ నీటిని తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే మేడిగడ్డ (లక్ష్మి) పంప్ హౌస్ నుంచి సుందిళ్ల (సరస్వతి) పంప్‌హౌస్ పనులు సైతం మొదలయ్యాయి. ఇక ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరు, అటునుంచి మల్లన్నసాగర్ వరకు రూ.25వేల కోట్లతో పనులు చేపట్టేందుకు రెండు రోజుల కిందట సీఎం ఆదేశించారు. ఈ అదనపు టీఎంసీతో నీటి లభ్యత పెరుగుతున్నందున 11.39 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని నాగార్జున సాగర్ ఆయకట్టుకు తరలించేలా చూడాలని ఆయన ఆదేశించగా రిటైర్డ్ ఇంజనీర్లు ప్రాథమిక సూచనలు చేశారు. బస్వాపూర్ నుంచి కేవలం 3 కిలోమీటర్ల కాల్వ తవ్వకం ద్వారా నీటిని శామీర్‌పేట వాగుకు తరలించవచ్చని, కనిష్టంగా 4వేల క్యూసెక్కుల నీటిని తరలించేలా కాల్వను వెడల్పు చేసుకుంటే సరిపోతుందని సూచించారు. అక్కడి నుంచి మూసీ నది, ఆసిఫ్ నహర్‌కు నీటిని తరలించాలని, ఉదయ సముద్రాన్ని బైపాస్ చేసి పానగల్ వాగులో కలపాలని తేల్చారు. అక్కడి నుంచి నేరుగా నాగార్జున సాగర్లో ఆన్‌లైన్ రిజర్వాయర్ అయిన పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తే, అక్కడి నుంచి సాగర్ కింద ఉన్న 3.70లక్షల ఎకరాల ఆయకట్టులో కనిష్టంగా 3.50లక్షల ఎకరాలకు నీరందించి స్థిరీకరించవచ్చని తేల్చారు.

**రేపు పర్యటించనున్న రిటైర్డ్ ఇంజనీర్లు**

కృష్ణా నదిలో నీటి ప్రవాహం లేని సమయంలో ఈ విధంగా గోదావరి నీటిని నాగార్జున సాగర్ ఆయకట్టుకు అందించేలా సమగ్ర అధ్యయనం చేసి ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం సూచించారు. దీనిపై రిటైర్డ్ ఇంజనీర్లు మంగళవారం నుంచి అధ్యయనం మొదలుపెట్టనున్నారు. ఇక దీనితో పాటు సాగర్ ఆయకట్టు పరిధిలో కొత్తగా ఎత్తిపోతల పథకాలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యేల నుంచి డిమాండ్ వస్తోంది. ఇప్పటికే వరల్డ్‌బ్యాంకు నిధులతో సాగర్ కాల్వల ఆధునికీకరణ చేసిన నేపథ్యంలో కొత్తగా ఎత్తిపోతల పథకాలు అవసరమన్న విషయాన్ని రిటైర్డ్ ఇంజనీర్ల బృందం అధ్యయనం చేయనుంది.

# వచ్చే వారంలో సెర్చ్ కమిటీల సమావేశాలు!

**వీసీల నియామకానికి చర్యలు వేగవంతం**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్ల నియామకం కోసం ఏర్పాటు చేసిన సెర్చ్ కమిటీల సమావేశాలను వచ్చే వారంలో ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, తెలుగు యూనివర్సిటీ, శాతవాహన, మహాత్మాగాంధీ, పాలమూరు, తెలంగాణ యూనివర్సిటీ, జేఎన్‌టీయూ, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ల పదవీ కాలం గత జూలైతోనే ముగిసిపోగా, ప్రభుత్వం వీసీల నియామకం కోసం అదే నెలలో నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో 984 దరఖాస్తులు వచ్చాయి. అందులో కొంతమంది రెండు మూడు వర్సిటీల వీసీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ తరువాత ప్రభుత్వం ఒక్కో వర్సిటీకి ఒక్కో సెర్చ్ కమిటీని ఏర్పాటు చేసింది. అందులో ఉన్న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నామినీలు సమయం ఇవ్వడంలో ఆలస్యం కావడంతో సెర్చ్ కమిటీ సమావేశాలు జరగలేదు. తాజాగా యూజీసీ నామినీలు సెర్చ్ కమిటీల సమావేశాలకు హాజరయ్యేందుకు సమయం ఇవ్వడంతో సమావేశాల తేదీలను ప్రభుత్వం ఖరారు చేసింది.



**ఆ పాత మధురాలు...** సోదరి కె.కవిత, సోదరుడు జోగినిపల్లి సంతోష్‌తో తాను చిన్నప్పుడు దిగిన ఫోటోలను మంత్రి కె.తారకరామారావు ట్విట్టర్‌లో పోస్టు చేసి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

## పెరిగిన రాత్రి ఉష్ణోగ్రతలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే కాస్త అధికంగా నమోదవుతున్నాయి. గడిచిన 24 గంటల్లో భద్రాచలంలో సాధారణం కంటే 3.8 డిగ్రీలు, హైదరాబాద్‌లో 3.3 డిగ్రీలు, నిజామాబాద్‌లో 3.4 డిగ్రీలు అధికంగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇతర ప్రాంతాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అయితే మెదక్‌లో మాత్రం సాధారణం కంటే 0.3 డిగ్రీలు, నల్లగొండలో 0.2 డిగ్రీలు తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు ఆదిలాబాద్‌లో 13.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇక పగటి ఉష్ణోగ్రతలు ఒకట్రెండు చోట్ల మినహా మిగిలిన చోట్ల సాధారణం కంటే కాస్త తక్కువగానే నమోదయ్యాయి. ఇదిలావుండగా శ్రీలంక తీరానికి దగ్గరలో నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి ఏర్పడింది. మరోవైపు ఈశాన్య, తూర్పు దిశల నుంచి గాలులు వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సీనియర్ అధికారి రాజారావు వెల్లడించారు. దీంతో వచ్చే మూడు రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం ఉండే అవకాశముందని ఆయన తెలిపారు.

## పాలమూరు వర్సిటీ ప్రొఫెసర్‌కు అవార్డు



**సాక్షి, హైదరాబాద్:** పాలమూరు విశ్వవిద్యాలయంలో ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న గూడూరు మనోజ అన్నా బావు సాతే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆమెను మహారాష్ట్రలోని ది ఇంగ్లిష్ ఎడ్యుకేటర్స్ సొసైటీ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ నెల 14న ఔరంగాబాద్‌లో జరిగే సదస్సులో ఆమె ఈ అవార్డును అందుకోనున్నారు. మనోజ ఇంగ్లిష్, హిందీ, తెలుగు, మరాఠీ భాషల్లో అనేక పుస్తకాలు రాశారు. అన్నా బావు సాతే పుస్తకాన్ని తెలుగులోకి అనువదించారు. మరోవైపు ఆమె గుంజాల గోండి లిపి అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించారని, ఆమె చేసిన కృషికిగాను ఈ అవార్డుకు ఎంపిక చేశామని ది ఇంగ్లిష్ ఎడ్యుకేటర్స్ సొసైటీ సమన్వయకర్త డాక్టర్ రమేష్ లాండేగే వెల్లడించారు.



L&K | SAATCHI & SAATCHI

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com